
'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 106

శుక్రవారం 7-7-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



NEETలో ర్యాంకు రాకున్నా డాక్టర్ కావచ్చు!

India's Biggest MBBS ABROAD

EDUCATION FAIR

డాక్టర్ కావాలనుకున్న
మీ కలను సాకారం చేసుకోవడానికి
ఈ వేదిక ఒక చక్కని అవకాశం



INDIA లో MBBS సీట్ రాక, విదేశాలలో MBBS చదివి USA, UK, CANADA, AUSTRALIA మొదలగు దేశాలలో PG సీటు సాధించిన వారు, INDIA లో State & Central Govt. హాస్పిటల్‌లో డాక్టర్స్‌గా రాణిస్తున్న వారు లక్షల సంఖ్యలో ఉన్నారు. కావున విదేశాలలో మెడికల్ కాలేజ్‌లలో MBBS విద్యావిధానం ఇండియాకు ఏ మాత్రం తీసిపోదు.

విదేశాలలో MBBS చదివి వచ్చిన విద్యార్థులకు MCI - FMGE పరీక్ష నుండి మినహాయింపు

ఇకపై ఇండియాలో చదివిన విదేశాలలో చదివిన ఒకే ప్రాధాన్యత
ఇస్తు అందరికీ NEXT EXAM వర్తింపు

Date : 9th July, 2023
ఆదివారం
10.00 AM to 6.00 PM

అత్యాధునిక వైద్య విధానం, అద్భుత విద్యా భవ్యత ఎన్నో దేశాలలో అనేక మంది విద్యార్థులు MBBS పూర్తి చేసుకొని డాక్టర్లుగా ప్రాక్టీసు చేస్తున్నారు. అనేక దేశాల యూనివర్శిటీల ప్రతినిధులు ఒకే వేదికపై ఈ ఎడ్యుకేషన్ ఫేయిర్‌లో తప్పకుండా పాల్గొని మీ లక్ష్యం దిశగా అడుగులు వేయండి.

ఉచిత ప్రవేశం

- ✦ స్పాట్ అడ్మిషన్స్ ✦ 1 to 1 ఇంటరాక్షన్
- ✦ స్కాలర్‌షిప్ అప్షన్స్ ✦ లోన్ అసిస్టెన్స్

విదేశాలలో MBBS పై అవగాహన సదస్సు

Venue :
Kamma Sangam
Ameerpet
HYDERABAD

డాక్టర్ కావడమే మీ లక్ష్యమైతే నీట్‌లో ర్యాంక్ రాలేదని చింతించనవసరం లేదు. డాక్టర్ కావాలనే మీ కలను సాధించే అద్భుత అవకాశం మీ కోసం, తక్కువ ఫీజుతో విదేశాలలో MBBS చేసే అవకాశం.

ఈ ఆదివారం జూలై 9వ తేదీన జరిగే ఎడ్యుకేషన్ ఫేయిర్‌లో పాల్గొని మీ సందేహాలను నివృత్తి చేసుకోగలరు.

SPONSORS

BHAGYALAXMI Educational Services
SG CONSULTANCY SERVICES — CREATING DOCTORS FOR FUTURE INDIA
CAREER PLUS ABROAD EDUCATION SERVICES PVT LTD. ISO 9001 : 2015 CERTIFIED EDUCATIONAL CONSULTANCY
UNIVERSITY GEOMEDI
Estd.:2004 ISM FOCAL POINT
VIETMBBS Vietnam Medical Admission Center
NEAR EAST UNIVERSITY
CYPRUS HEALTH
alte UNIVERSITY
GIRNE AMERIKAN UNIVERSITESI
DUY TAN UNIVERSITY

For more details please contact :

8651 444 666
77 879 77778

Event by: Rohana Media
Digital Partner: way2news #IndiaReadsWay2News

Advertisement



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 106

శుక్రవారం 7-7-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఆరెంజ్' ఓ రేంజ్‌లో...

స్కాట్లాండ్‌పై గెలుపుతో వన్డే ప్రపంచకప్‌కు నెదర్లాండ్స్ అర్హత -13లో



మార్కెట్లో మళ్లీ కొత్త రికార్డులు


19,500 స్థాయికి చేరువలో నిఫ్టీ.. సెన్సెక్స్ లాభం 340 పాయింట్లు -13లో



ట్విట్టర్‌కు కొత్త సవాల్

మైక్రోబ్లాగింగ్ యాప్ ట్విట్టర్‌కు పోటీగా దాదాపు అవే ఫీచర్లతో ప్రత్యర్థి మెటా సంస్థ థ్రెడ్స్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

- వివరాలు 6లో



మణిపూర్‌పై చర్చకు నిరాకరణ..

మణిపూర్‌పై చర్చించాలన్న డిమాండ్‌ను కమిటీ చీఫ్ నిరాకరించడంతో పార్లమెంటరీ కమిటీ భేటీ నుంచి విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు.

- వివరాలు 6లో



ఎన్సీపీ అధ్యక్షుడిని నేనే

ఎన్సీపీ అధ్యక్షుడిని తానేనని ఎన్సీపీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో



ఎన్నికల్లో కలసికట్టుగా పోరాటం

రాజస్తాన్ సీఎం గెహ్లోత్, సచిన్ పైలెట్ మధ్య విభేదాలు రూపుమాపడానికి అధిష్టానం చేసిన ప్రయత్నాలు ఫలించినట్టే కనిపిస్తున్నాయి.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

విద్యుత్ సంస్థలకు కొత్త బాస్‌లు?



రాష్ట్ర విద్యుత్ సంస్థలకు కొత్త సీఎండీలు, డైరెక్టర్ల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, ఇందుకు సంబంధించిన కసరత్తును ప్రారంభించిందని చెబుతున్నారు. సింగరేణి సంస్థ సీఎండీగా ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఎన్.శ్రీధర్.. ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎండీ రేసులో ముందు వరుసలో ఉన్నట్టు సమాచారం.

- వివరాలు 3లో


కంప్యూటర్ సైన్స్‌లో పెరిగిన సీట్లు



రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలలో కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించిన సీట్లు భారీగా పెరిగాయి. ప్రైవేటు కాలేజీల విజ్ఞప్తి మేరకు పెద్దగా డిమాండ్ లేని బ్రాంచీల నుంచి ఇతర బ్రాంచీలకు 7,635 సీట్లను మార్చగా.. అదనంగా 6,930 సీట్లు అందుబాటులోకి వచ్చాయి.

- వివరాలు 3లో

కరీంనగర్ జిల్లాలో 68.6 శాతం సిజేరియన్లు



కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్లు పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జూన్‌లో ఈ జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో 68.6 శాతం ప్రసవాలు సిజేరియన్ ఆపరేషన్ల ద్వారానే జరిగాయని వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ జిల్లాలో మే నెలలో 64.1 శాతం సిజేరియన్లు జరగ్గా, నెలలోనే ఇంకా పెరగడం గమనార్హం.

- వివరాలు 14లో

అడవిచింత.. చారెడంత!

- రాళ్లను తలపించేలా గింజలు
- కరీంనగర్‌లో విక్రయిస్తున్న ఛత్తీస్‌గఢ్ గిరిజనులు

5లో

ఇదండీ సంగతి



తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్ అరధే



జస్టిస్ అలోక్ అరధే



జస్టిస్ ధీరజ్‌సింగ్

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరధే, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను నియమించాలంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సిఫార్సు చేసిన నేపథ్యంలో ఆయన స్థానంలో జస్టిస్ అలోక్ అరధే నియామకానికి సిఫార్సు చేసినట్లు కొలీజియం పేర్కొంది. అలాగే ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన ప్రశాంత్ కుమార్ మిశ్రా మే 19న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందడంతో ఆయన స్థానంలో జస్టిస్ ఠాకూర్‌ను

మిగతా 10వ పేజీలో ▶

ఏకేద్దాం.. బీరెడీ!



బీఆర్‌ఎస్ 'ఏ టీం, బీ టీం' అంటూ చేస్తున్న వ్యాఖ్యలపై కేసీఆర్ ఆగ్రహం

- విపక్షాల విమర్శలను సీరియస్‌గా తీసుకుంటున్న ముఖ్యమంత్రి
- ఉపేక్షిస్తే వచ్చే ఎన్నికల్లో నష్టం కలుగుతుందనే భావన
- దీటుగా తిప్పికొట్టేందుకు అవసరమైన వ్యూహాలపై కసరత్తు
- మోదీ పర్యటనకు ముందు, ఆ తర్వాత బీజేపీని ఎండగట్టాలని నిర్ణయం
- ఈ నెల 20 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో దూకుడుగా ముందుకు..
- బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం పాటిస్తూ ఇరుకున పెట్టాలని యోచన

సాక్షి, హైదరాబాద్: జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో వేగంగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో.. విపక్షాల విమర్శలను ఉపేక్షించకూడదని, విరుచుకుపడే విధానాన్ని అవలంబించాలని భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం పాటిస్తూ.. ఇరు పార్టీల విధానాలను, అనుసరిస్తున్న పంథాను ఎండగట్టాలని అభిప్రాయానికి వచ్చారు. ఆ రెండు పార్టీలు బీఆర్‌ఎస్‌ను అనవసరంగా విమర్శిస్తూ, తప్పుడు ఆరోపణలతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని.. ఇలాంటి సమయంలో ఎదురుదాడి చేయకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. మారుతున్న

మిగతా 3వ పేజీలో ▶

ప్రధాని మోదీ పర్యటనపై ఫోకస్

ప్రధాని మోదీ ఈ నెల 8న వరంగల్‌కు రానున్న నేపథ్యంలో.. బీజేపీ, కేంద్రం తీరును ఎండగట్టాలని కేసీఆర్ నిర్ణయించినట్టు తెలిసింది. విభజన చట్టం హామీలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఇతర అంశాలను లేవనెత్తనున్నట్టు సమాచారం. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు సామాజిక మాధ్యమాలు, ఇతర వేదికల ద్వారా ప్రధానికి ప్రశ్నాస్త్రాలు సంధించనున్నారు. ప్రధాని పర్యటన ముందు, తర్వాత బీజేపీపై ఎదురుదాడిని తీవ్రం చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

బీజేపీపై విష ప్రచారం

మాకు ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉండదు: కిషన్‌రెడ్డి

2లో

గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ▶



ఇంటర్వ్యూ కిషన్‌రెడ్డి

యుద్ధంలో ఉన్నాం.. కలసి పోరాడాల్సిందే!

- పార్టీని ఎవరూ వీడరు.. టీమ్ వర్క్‌తో ముందుకెళ్తాం
- పాత, కొత్త తేడా లేకుండా నేతలతో సమన్వయం సాధిస్తాం

- సమష్టిగా కార్యాచరణ ప్రణాళిక, వ్యూహాలను రూపొందించుకుంటాం
- కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించడం ఖాయం
- రాహుల్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకోవట్లేదు
- పార్టీలోకి చేరికలు, అభ్యర్థుల ఎంపికపై త్వరలో కసరత్తు చేపడతామన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

సాక్షి, హైదరాబాద్: ఇప్పుడు యుద్ధంలో ఉన్నామని.. క్రమశిక్షణ కలిగిన సైనికులుగా అంతా కలసి పోరాడాల్సిందేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. జాతీయ పార్టీ ఆదేశాలను తుచ తప్పకుండా పాటిస్తూ.. వచ్చే ఎన్నికల్లో విజయసాధనే లక్ష్యంగా ముందుకు వెళతామని పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీలో పూర్తిస్థాయిలో సమన్వయం సాధిస్తామని.. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటామని చెప్పారు. పార్టీని ఎవరూ వీడబోరని.. పార్టీలోకి చేరికలు, అభ్యర్థుల ఎంపికపై త్వరలో కసరత్తు చేపడతామని వెల్లడించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా నియమితులయ్యాక కిషన్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో ▶

దళితులు ధనికులు కావాలె..

- ప్రతి నియోజకవర్గానికి మరో 1,100 దళితబంధు యూనిట్లు
- ఏ పార్టీ వాళ్లయినా ఇద్దాం
- 30 వేల మంది గిరిజనులు ప్రజాప్రతినిధులు అయ్యారు
- సిరిసిల్లలో మంత్రి కేటీఆర్
- మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పోడు భూముల పట్టాల పంపిణీ



సిరిసిల్లలో పోడుభూముల పట్టా పంపిణీ చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సిరిసిల్ల: సమాజంలో అణచివేతకు గురై, అట్టడుగున ఉన్న దళితులను ధనికులను చేసే లక్ష్యంతో దేశంలోనే ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ తెలంగాణలో దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం రాష్ట్ర ఎస్సీ, గిరిజన, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పోడుభూములకు పట్టాలు, ఎస్సీ చిరువ్యాపారులకు ఆర్థిక సాయం అందించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ దళితబంధులో తొలి విడతలో ప్రతి నియోజ కవర్గానికి 100 కుటుంబాలకు అందించామని, విప్లవాత్మక మార్పులు వచ్చాయని అన్నారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 1100 యూనిట్లు అందిస్తామని

మిగతా 2వ పేజీలో ▶

త్వరలో ధరణి ఫైల్స్..

- ఆధారాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం
- కేటీఆర్ మిత్రుడు శ్రీధర్ చేతిలో ధరణి పోర్టల్



- మంత్రి గంగులకు భూముల కేటాయింపు
- ఈటల రాజేందర్‌కు బీజేపీ మోసం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

2లో

14న చంద్రయాన్-3 ప్రయోగం



- కీలకమైన చంద్రయాన్–3 ప్రయోగాన్ని ఈ నెల 14న చేపట్టనున్నట్లు ఇస్రో గురువారం తెలిపింది. మొదటగా ఈ నెల 12న అని ప్రకటించింది. ఆ తర్వాత 13కు వాయిదా వేసింది. తాజాగా, 14న మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగం ఉంటుందని షార్ వర్గాలు ప్రకటించాయి. సాంకేతిక లోపాలను సరిచేసుకోవడంతోపాటు చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చే సమయంలోనే ప్రయోగిస్తారనే వాదన కూడా ఉంది.

6లో



బాధితుడి కాళ్లు కడిగిన మధ్యప్రదేశ్ సీఎం

దశ్మత్‌ను శ్రీకృష్ణుడి బాల్య స్నేహితుడు సుధామతో పోల్చిన శివరాజ్‌సింగ్ చౌహాన్

మధ్యప్రదేశ్‌లో మూత్ర విసర్జన ఘటన గిరిజన బాధిత యువకుడు దశ్మత్ కాళ్లు కడుగుతున్న ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్. అనంతరం సీఎం ఆ నీటిని తన తలపై చల్లుకున్నారు.

- వివరాలు 6లో

క్లుప్తంగా...

ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా సీపీఐ నిరసనలు

విభజన హామీలపై మోదీ సమాధానం చెప్పాలి: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన చట్టంలోని హామీల అమలును విస్మరించి ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసనలు చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. విభజన హామీలపై మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ కూనంనేని విలేకరులతో మాట్లాడుతూ కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ అని చెప్పి రిపేరింగ్ సెంటర్ పెడతారా అని నిలదీశారు. కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వ నందుకు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో, బయ్యారం ఉక్కు కర్మాగారం చేపట్టనందుకు కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో, గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయనందుకు ములుగు జిల్లాల్లో నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు.

119 సీట్లలో టీటీడీపీ పోటీ: కాసాని



సాక్షి, హైదరాబాద్: రాబోయే శాసనసభ ఎన్నికల్లో టీటీడీపీ రాష్ట్రంలోని 119 శాసన సభ నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు గురువారం ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో టీడీపీ రోజురోజుకూ బలపడుతోందని, బీఆర్ఎస్, బీజేపీ, వైఎస్సార్‌టీపీ వంటి పార్టీల నుంచి చేరికలు పెరిగాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి ఇతర పార్టీల నుంచి పెద్దఎత్తున చేరికలను ఆహ్వానించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వేగంగా మారుతున్న తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ కీలకపాత్ర పోషించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య, అజ్మీరా రాజునాయక్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పిడి గోపాల్, ఐటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలంపల్లి అశోక్, చేవెళ్ల పార్లమెంటు అధ్యక్షుడు సుభాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అంటే బీజేపీకి రహస్య సమితి

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



సాక్షి, హైదరాబాద్: బీజేపీతో కేసీఆర్ చేస్తున్నది సమరం కాదు.. వ్యభిచారమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. కేసీఆర్, బీజేపీ ఒక్కటికాదని చిన్నదొర నొక్కినొక్కి చెబుతుంటే.. చిన్న పిల్లవాడు కూడా నమ్మడం లేదంటూ ఆమె ట్వీట్ చేశారు. తెలంగాణలో పెద్దగా బలంలేని బీజేపీని హైకిలేపి, ఇన్నాళ్లు విమర్శలు గుప్పించిన కేసీఆర్.. కొడుకు, కూతురు కేసులతో కథ అడ్డం తిరిగే సరికి ఆ పార్టీతో జతకట్టారని ఆరోపించారు. తొమ్మిదేళ్లుగా విభజన హామీలపై ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయలేని బీఆర్ఎస్.. బీజేపీకి 'బీ'టీం కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అంటే బీజేపీకి రహస్య సమితి అని అన్నారు. కేసుల నుంచి బయట పడేందుకు కేసీఆర్, కేంద్రం వద్ద మోకరిల్లారని మండిపడ్డారు. రాష్ట్రానికి వచ్చే నిధుల వాటా గురించి మాట్లాడలేని కేసీఆర్.. మోదీ తొత్తు కాదా? అని నిలదీశారు. 'కాళేశ్వరంలో వేల కోట్లు తినేసినా కనీస విచారణ లేదు.. లిక్కర్ స్కాంలో అడ్డంగా దొరికినా బేడీలు వేయలేదంటే బీఆర్ఎస్‌ను కాపాడుతున్నట్టు కాదా? అని బీజేపీని ప్రశ్నించారు.

'బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలి'



లాలాపేట (హైదరాబాద్): బీసీ ముఖ్యమంత్రితో పాటు మిషన్ 60 (బీసీలకు 60 ఎమ్మెల్యే టికెట్లు) డిమాండ్‌తో జూలై 15న ఎల్‌బీ నగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించతలపెట్టిన బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలనీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఓయూలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 10 వేల మంది ప్రతినిధులతో నిర్వహించే బీసీల రాజకీయ ప్లీనరీ తెలంగాణలో రాజకీయాలను శాసించబోతుందన్నారు. ఈ సమావేశంలో బీసీల రాజకీయ భవిష్యత్, దశ-దిశను నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు అన్ని రాజకీయ పార్టీలు దళితులని ముఖ్యమంత్రి చేస్తామని, బీసీని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పినా చేయలేదని తెలిపారు. పైగా తెలంగాణలోని బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు అగ్రకుల నాయకులకే పార్టీ పగ్గాలు అప్పజెప్పాయని అన్నారు. తాజాగా బీజేపీ సైతం బీసీ నేతను తప్పించి అగ్రకులాల వ్యక్తికే బాధ్యతలు అప్పజెప్పిందని ఆరోపించారు. దీన్ని బట్టి చూస్తే తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలకు బీసీల రాజకీయ ప్రయోజనాలు అవసరం లేదని స్పష్టమవుతోందని ఆరోపించారు.

బీజేపీపై విష ప్రచారం

మాకు ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదు: కిషన్‌రెడ్డి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కుట్రతో చేస్తున్న ప్రచారం అది
- రాష్ట్రంలో అన్ని రకాల మాఫియాలు కల్వకుంట్ల కుటుంబం చేతిలోనే..
- కిషన్‌రెడ్డి నేతృత్వంలో ముందుకు వెళ్తామన్న బండి సంజయ్



కిషన్‌రెడ్డిని శాలువాకప్పి సన్మానిస్తున్న బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: బీజేపీపై సామాజిక మాధ్యమాల్లో కుట్రపూరితంగా విష ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ఒక పథకం ప్రకారం చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలెవరూ నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్ ఓటేస్తే బీఆర్ఎస్‌కు, బీఆర్ఎస్‌కు వేస్తే కాంగ్రెస్‌కు వేసినట్టే అనే విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కుటుంబ పాలన పోవాలని ప్రధాని మోదీ అనేక సభల్లో స్పష్టం చేశారని, కల్వకుంట్ల కుటుంబానికి వ్యతిరేకంగా పోరాడాలని అమిత్‌షా పిలుపునిచ్చారని, బండి సంజయ్ సహా బీజేపీ నాయకులంతా ఈ దిశలో పోరాటం సాగిస్తున్నారని వివరించారు. కల్వకుంట్ల కుటుంబ, అవినీతి పాలనకు చరమగీతం పాడి బీజేపీ ప్రభుత్వాన్ని తీసుకురావడమే లక్ష్యంగా తామంతా కలిసి పనిచేస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో ఎంపీ బండి సంజయ్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ఇతర నేతలతో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్-టీఆర్ఎస్ పొత్తుతో పోటీ చేశాయని, కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాల్లోనూ భాగస్వామ్యం అయ్యాయని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన మెజారిటీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవుల్లోనూ ఉన్నారని చెప్పారు. బీజేపీ గతంలో ఎప్పుడూ బీఆర్ఎస్‌తోగానీ, కాంగ్రెస్‌తోగానీ పొత్తు పెట్టుకోలేదని.. భవిష్యత్‌లోనూ ఆ పార్టీలతో కలిసి సాగే అవకాశం లేదని స్పష్టం చేశారు.

దోపిడీయే తెలంగాణ మోడలా?

''తెలంగాణ మోడల్ అంటే కుటుంబ పాలనా? కొడుకు, అల్లుడు, బిడ్డకు మరికొన్ని రాష్ట్రాలు ఇవ్వాలని అనుకుంటున్నారు. ఇది తెలంగాణ మోడలా? తొమ్మిదేళ్లు సచివాలయానికి రాకపోవడం, తొలి కేబినెట్లో మహిళలకు అవకాశం ఇవ్వకపోవడం, వేల కోట్లు దోచుకోవడం.. ఇదా తెలంగాణ మోడల్? కీలక మంత్రిత్వ శాఖలన్నీ కల్వకుంట్ల కుటుంబం చేతిలో ఉండటం తెలంగాణ మోడలా?'' అని ప్రశ్నించారు. కేసీఆర్ దేశంలోని కుటుంబ పార్టీలన్నింటికీ డబ్బులు ఇస్తానన్నారని.. అంటే రాష్ట్రంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ వ్యాపారం చేయాలన్నా బీఆర్ఎస్ నేతలు వాటాలు అడుగుతున్నారని, భూముల నుంచి దందాల దాకా అన్ని రకాల మాఫియాలు వారివేనని ఆరోపించారు. బండి సంజయ్ నేతృత్వంలో ఇటీవల బీజేపీ మంచి ఫలితాలు సాధించిందని చెప్పారు. ఈ నెల 8న మోదీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పార్టీకి వ్యతిరేకంగా పోస్టులు పెట్టొద్దు

కిషన్‌రెడ్డితో నాకు ఎంతో సాన్నిహిత్యం ఉంది: బండి సంజయ్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి హృదయ పూర్వకంగా అభినందనలు తెలుపుతున్నానని ఎంపీ బండి సంజయ్ చెప్పారు. మొదటి నుంచీ పార్టీ కోసం కమిట్మెంట్‌తో కష్టపడి పనిచేసిన నాయకుడు కిషన్‌రెడ్డి అని, కింది స్థాయి నుండి పైస్థాయి వరకు అనేక బాధ్యతలు నిర్వహించారని.. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ ఏర్పడ్డాక కూడా పార్టీని శక్తివంతంగా తయారు చేశారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు బీజేపీ మద్దతు తెలపడంతో కిషన్‌రెడ్డి క్రియాశీల పాత్ర పోషించారని.. తమ మధ్య ఎంతో సాన్నిహిత్యం ఉందని తెలిపారు. ఆయన నాయకత్వంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. తనకు, కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా, బీజేపీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన మీద అభిమానంతోనో, కోపంతోనో పార్టీకి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడం ముమ్మాటికీ ద్రోహం అవుతుందని.. దయచేసి అలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నానని చెప్పారు.

యుద్ధంలో ఉన్నాం.. కలసి పోరాడాల్సిందే!

▶ మొదటి పేజీ తరువాయి

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

ప్రత్యామ్నాయం బీజేపీనే..

''బీఆర్ఎస్ ప్రభుత్వంపై, కేసీఆర్ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలో గట్టిగా పోరాడుతాం. అధికార బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అనే నమ్మకం ప్రజల్లో కలిగించేలా కచ్చితమైన కార్యాచరణతో ముందుకెళతాం. ప్రజలు కూడా ఇదే కోరుకుంటున్నారు.

ఎన్నికల మోడ్‌లోకి వెళతాం

ఈ నెల 10న ఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశం ఉంది. ప్రధాని మోదీని కలుస్తాను. రాష్ట్ర పార్టీలోని నేతలందరితో సమావేశమై ఎన్నికల మోడ్‌లోకి వెళతాం. ఇక్కడి నాయకులతో భేటీలు నిర్వహించి, అన్ని అంశాలపై సమన్వయం చేసుకుని ముందుకెళతాం. ఆషాఢ మాసం కాబట్టి ఇప్పుడే అధ్యక్ష స్థానంలో కూర్చోను. అయితే అధ్యక్ష బాధ్యతలన్నీ చూసుకుంటాను.

ఒక్కరోజులోనే పరిస్థితులు మారిపోవచ్చు!

అసెంబ్లీ ఎన్నికలకు సమయం తక్కువగా ఉండటం సమస్య అని నేను అనుకోవడం లేదు. వేగంగా మారుతున్న సమాజ అభిప్రాయాలు, అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిన సందర్భంలో ఒక్క రోజులోనే పరిస్థితులు మారిపోతాయి. ఒక్క రోజులోనే అనుకూల వాతావరణం ఏర్పడవచ్చు. కేసీఆర్ నేతృత్వంలో తొమ్మిదేళ్లకుపైగా నిరంకుశ పాలనను చవిచూసిన ప్రజలు ఈసారి ఆయనను తిరస్కరించడం ఖాయం. జాతీయ, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్‌పై విశ్వాసం, నమ్మకం కుదిరే పరిస్థితులు లేవు, రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకోవడం లేదు.

పార్టీని ఎవరూ వీడరు.. సమన్వయం సాధిస్తాం..

ఏ నాయకుడు కూడా బీజేపీని విడిచి వెళతారని భావించడం లేదు. అందరినీ కలుపుకొని పోతాం. పార్టీలో అసంతృప్తి అనే మాటే లేకుండా, సర్దుకునిపోయేలా సమన్వయం చేయడంపై ప్రధానంగా దృష్టి పెడతాం. కొత్త, పాత నేతలు, జూనియర్, సీనియర్ అనే తారతమ్యాలు లేకుండా నాయకుల మధ్య ఐక్యతను సాధిస్తాం. టీమ్ వర్క్‌తో అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కచ్చితమైన కార్యాచరణ ప్రణాళిక, ఎన్నికల వ్యూహాలను సమష్టిగా రూపొందించుకుంటాం.

బీజేపీలోకి చేరికలను వేగవంతం చేస్తాం

ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేరికల ప్రక్రియను ఇకపై వేగవంతం చేస్తాం. ఎన్నికల్లో పోటీకి అర్హులైన అభ్యర్థులను తేల్చే కసరత్తును వెంటనే మొదలుపెడతాం. ఏ నియోజకవర్గంలో పార్టీలో ఉన్న వారిలో ఎవరెవరు మంచి అభ్యర్థి అవుతారనేది పరిశీలిస్తాం. ఆ దిశగా ప్రక్రియ వేగంగా పూర్తి చేస్తాం.

ప్రజల్లోనే ఉంటూ పోరాడుతాం

కేసీఆర్ సర్కారు పూర్తిగా అవినీతిమయమైంది. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాజీలేని పోరాటం చేస్తాం. పార్టీ కార్యకర్తలు ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉంది. నేతలంతా ప్రజలు, కార్యకర్తల మధ్యే ఉంటూ విశ్వాసం కలిగించేలా చూస్తాం. పార్టీని విజయపథంలోకి నడిపించడంలో కార్యకర్తలు కీలకపాత్ర పోషించబోతున్నారు..'' అని కిషన్‌రెడ్డి చెప్పారు.

కేసీఆర్ తీరును ఎండగడుతూనే ఉన్నాం..

పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇటీవలి సభలో బీఆర్ఎస్‌ను రాక్షస సమితి అని, కేసీఆర్ సర్కార్ అవినీతిలో కూరుకుపోయిందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. బీఆర్ఎస్ గెలిస్తే ఆయన కుమార్తెకే మేలు జరుగుతుందని ప్రధాని మోదీ విమర్శించారు. కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. అమిత్‌షా రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా కేసీఆర్ సర్కార్ అవినీతి, కుటుంబ, నియంతృత్వ పాలనను ఎండగడుతూనే ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును, కేసీఆర్ వ్యవహారశైలిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం అనడానికి ఇంతకంటే ఏం కావాలి?

బండికి ఘన స్వాగతం

'సీఎం సంజయ్' అంటూ నినదించిన కార్యకర్తలు



విమానాశ్రయంలో బండి సంజయ్‌ను భుజాలపై మోసుకొస్తున్న కార్యకర్తలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అధ్యక్ష బాధ్యతల నుండి తప్పుకున్నాక తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన బండి సంజయ్‌కు గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. పెద్దసంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు విమానాశ్రయానికి వచ్చి, 'భారత్ మాతాకీ జై.. జై బీజేపీ.. జై బండి సంజయ్' అనే నినాదాలు చేస్తూ ఆయన్ను భుజాలపైకి ఎత్తుకుని బయటకు తీసుకొచ్చారు. కార్యకర్తలకు అభివాదం చేస్తూ సంజయ్ తన వాహనం వద్దకు రావడానికి దాదాపు గంట సమయం పట్టింది. 'అన్నా.. మీరే మా ధైర్యం.. మీ వెంటే మేమున్నాం' అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. కొందరు 'సీఎం సంజయ్' అంటూ నినదించడంతో బండిని వారిని వారించారు. ఎయిర్‌పోర్టు నుండి బర్కత్‌పురాలోని పార్టీ సెంట్రల్ జిల్లా కార్యాలయానికి వచ్చిన బండి.. పార్టీ కొత్త అధ్యక్షుడిగా నియమితులైన కిషన్‌రెడ్డి వద్దకు వెళ్లి శాలువా కప్పి అభినందించారు. అనంతరం ఇద్దరూ.. పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి తదితరులతో కలిసి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.

త్వరలో ధరణి ఫైల్స్ విడుదల

ఆధారాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం

- ధరణిలో పెట్టుబడిదారులు ఎవరో కేంద్రం నిగ్గు తేల్చాలి
- కేటీఆర్ మిత్రుడు శ్రీధర్ గాదె చేతిలో ధరణి పోర్టల్: రేవంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో కోదండరెడ్డి, సంపత్

సాక్షి, హైదరాబాద్: ధరణి వెనుక పెద్ద మాఫియా దాగుందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందుకు సంబంధించిన ఆధారాలతో 'ధరణి ఫైల్స్'ను సీరియల్‌గా బయటపెట్టనున్నట్లు ప్రకటించారు. గురువారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ధరణికి సంబంధించి ప్రజలకు, మీడియాకు టెర్రాసిస్ కంపెనీ మాత్రమే కనిపిస్తోందని, కానీ ధరణి దోపిడీపై అన్ని ఆధారాలతో త్వరలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ధరణి పెట్టుబడిదారులు ఎవరో కేంద్ర ప్రభుత్వం ద్వారా నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

విదేశీయుల చేతుల్లో ధరణి నిర్వహణ

ధరణి పోర్టల్ నిర్వహణ విదేశీయుల చేతుల్లోకి వెళ్లిపోయిందని, ఇది అత్యంత ప్రమాదకరమని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 'ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న సంస్థలో పెట్టుబడి పెట్టిన వారు ఆర్థిక నేరగాళ్లు. ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న వారిలో విదేశీయులు ఉన్నారు. ధరణి పోర్టల్ అనేక చేతులు మారి చివరకు..బ్రిటిష్ ఐల్యాండ్ చేతికి వెళ్లింది. ధరణిలోని అనేక లోటుపాట్లను ఆసరాగా తీసుకొని నిషేధిత జాబితాలోని భూములను అనుచరులకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూములను అనుచరులకు రిజిస్ట్రేషన్ చేసి వెంటనే ప్రొహిబిషన్ లాక్ చేస్తున్నారు. ధరణి పోర్టల్ మొత్తం కేటీఆర్ మిత్రుడు శ్రీధర్ గాదె చేతిలో ఉంది. శ్రీధర్ గాదె వద్ద ఉన్న తాళంతో ధరణిని ఎప్పుడైనా తెరవొచ్చు, ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరు మీద మార్చేయొచ్చు' అని వివరించారు. ప్రభుత్వ భూములకు యజమానులను సృష్టించడం, అనంతరం ఆ భూములను బదలాయించడం, ఆ తర్వాత వాటిని లే అవుట్లు వేసి అమ్ముకోవడం... అనే తతంగం నడుస్తోందని ఆరోపించారు. గాదె శ్రీధర్ రాజు హైటెక్ సిటీ ప్రాంతంలో క్వాంటెల్లా అనే సంస్థ పేరిట ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, కోదండరెడ్డి కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అనేక భూ అక్రమాలు జరుగుతున్నట్టు ప్రాథమిక వివరాలు రాబట్టిందని రేవంత్ వివరించారు. దేవాదాయ భూములను అక్రమంగా ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని చూశారని ఆరోపించారు.

తొలుత బీసీ, ఎస్సీ. ఎస్టీ అభ్యర్థుల ప్రకటన

రానున్న ఎన్నికల కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను మొట్టమొదట ప్రకటించాలని పార్టీలో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈటల రాజేందర్‌ను ఫిరాయింపుల కమిటీ నుంచి ఎన్నికల కమిటీకి మార్చారని, రాజేందర్‌ను బీజేపీ మోసం చేసిందన్నారు. రాజేందర్ కు భద్రత పెంచినా... అనుమానితుడిపై ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ భూమి డిక్లరేషన్‌ను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విడుదల చేశారు.

ఈనెల 15 తర్వాత ఎప్పుడైనా..

''ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తానంటే కేసీఆర్ భయపడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ధరణిని రద్దు చేసి అంతకంటే మెరుగైన పోర్టల్‌ను తీసుకొస్తాం. కేసీఆర్ భూ అక్రమాలను కూడా బయటపెడతాం. ధరణిలో జరిగిన అక్రమాలను జూలై 15 తర్వాత బయటపెడతాం. కేంద్రం తలచుకుంటే ధరణి వెనకున్న ఆర్థిక నేరాలను బహిర్గతం చేయొచ్చు'' అని రేవంత్ పేర్కొన్నారు. గజ్వేల్‌లో 1500 ఎకరాల అసైన్డ్ భూములను చట్టవిరుద్ధంగా ప్రభుత్వం గుంజుకుందని, అమూల్ డెయిరీ వందల ఎకరాలు కట్టబెట్టారని, మంత్రి గంగుల కమలాకర్‌కు భూములు కేటాయించారని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి దేవాదాయ భూములను ఫార్మా కంపెనీలకు కట్టబెట్టారన్నారు.

బీజేపీ , బీఆర్ఎస్‌ను వేరుగా చూడొద్దు

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఎన్నికల చట్టాల్లో మార్పులను ఉపయోగించుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నాయని, ఆ రెండు పార్టీలను వేర్వేరుగా చూడొద్దని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం ఇందిరా భవన్‌లో టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఎల్‌డీఎం బూత్ లెవెల్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ రెండు పార్టీలను ఎన్నికల్లో దీటుగా ఎదుర్కొనేందుకు గాంధీ భవన్ నుంచి, గ్రామస్థాయి వరకు అందరూ అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారని, బూత్‌లు మార్చి ఓటరును గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ శ్రేణులు 120 రోజులు ఇంటికి సెలవు పెట్టి కష్టపడి పని చేసి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

దేశంలోనే వేగంగా హైదరాబాద్ ప్రగతి

- ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో ఊహించని అభివృద్ధి
- జనాభాలో మలేసియాతో, విస్తీర్ణంలో సౌత్‌కొరియాతో తెలంగాణ సమానం
- ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు



మాదాపూర్: భారతదేశంలో వేగంగా అభివృద్ధి సాధిస్తున్న నగరంగా హైదరాబాద్ గుర్తింపు సాధించిందని, భవిష్యత్తులో మరింత ప్రగతిని సాధిస్తుందనే నమ్మకం ఉందని మంత్రి కేటీ రామారావు అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం రాత్రి టీహబ్ ఆధ్వర్యంలో టీ-ఇన్నోవేషన్ సమ్మిట్ 'గ్లాడియేటర్స్ ఆఫ్ మైండ్' అనే అంశంపై రెండవ ఎడిషన్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మంత్రి కేటీరామారావు మాట్లాడుతూ కేవలం ఒక్క ఐటీ రంగంలోనే కాకుండా వ్యవసాయం, ఇతర రంగాలలో అనూహ్య ప్రగతిని సాధించిన రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపును సాధించిందన్నారు. 2014లో ఐటీ ఎగుమతులు రూ.56వేల కోట్లు ఉండగా 2023 మే నాటికి రూ.2.41 లక్షలకు పెరిగాయని, అదే విధంగా ఐటీ ఉద్యోగాల కల్పనలోనూ ఎంతో ప్రగతిని సాధించామన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభా ప్రకారం మలేషియా దేశంతో సమానం కాగా, విస్తీర్ణంలో సౌత్‌కొరియాతో సమానమని మంత్రి పేర్కొన్నారు.

యాట కూర తిన్నాక....తోట కూర తింటే..

సోషల్ మీడియా స్టార్ మంత్రి మల్లారెడ్డి మాట్లాడాక ఇక మాకు మాట్లాడేందుకు ఏమి ఉంటుందని.. 'యాట కూర తిన్నాక తోటకూరన్న ప్రాధాన్యత లాగా ఉంటుందని. అదేవిధంగా క్రికెట్‌లో సూర్యకుమార్‌యాదవ్ బ్యాటింగ్ చేశాక స్లో ఆడే ఇండియన్ క్రికెటర్ ఆడితే ఎలా ఉంటుందో నేను మాట్లాడితే అలా ఉంటుందని కేటీఆర్ చలోక్తి విసురుతూ అందరినీ నవ్వించారు. కార్యక్రమంలో కార్మిక శాఖామంత్రి మల్లారెడ్డి, ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు, సైయింట్ అధినేత బీవీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితులు ధనికులు కావాలె..

▶ మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఏ పార్టీ వారైనా అందరికీ దళితబంధు ఇస్తామన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ధనికులు ఏ నీళ్లు తాగుతారో.. వీర్నపల్లి తండాలోనూ అవే నీళ్లు తాగేలా ఇంటి ముందు నల్లా పెట్టి నీళ్లు అందిస్తున్నామన్నారు. కొమురం భీమ్ స్ఫూర్తితో జల్, జమీన్, జంగల్ నినాదాలతో నీళ్లు సాధించి, పోడుభూములకు పట్టాలిచ్చి, కొత్తగా 5 లక్షల ఎకరాల్లో 8 శాతం పచ్చదనాన్ని పెంచామన్నారు. 70 ఏళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమం 9 ఏళ్లలో చేసి చూపించామని, తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని కేటీఆర్ వివరించారు. రైతులకు బీమా చేయిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే అన్నారు. సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయాలతో తెలంగాణ రాష్ట్రం దేశానికి మోడల్‌గా మారిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు.

వ్యవసాయ కాలేజీకి బాబూ జగ్జీవన్‌రామ్ పేరు

జిల్లెల్ల వ్యవసాయ కళాశాలకు బాబూ జగ్జీవన్‌రామ్ కళాశాలగా నామకరణం చేశారు. ఆయన వర్ధంతి సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని మంత్రులు ఆవిష్కరించారు. 128 మంది ఎస్సీ చిరువ్యాపారులకు రూ.62 లక్షల మేరకు ఆర్థిక సాయం చెక్కుల ను పంపిణీ చేశారు. జిల్లాలో 1,614 మంది గిరిజ నులకు 2,558.34 ఎకరాల పోడు భూములకు పట్టాలను అందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్ జయంతి, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పాల్గొన్నారు.

కొత్త శిఖరాలకు కేంద్ర ఉద్యోగ ఖాళీలు

మంత్రి కేటీఆర్ ఎద్దేవా

- మన్మోహన్ పాలనాకాలంలో ఉద్యోగ ఖాళీలు 11 శాతం
- మోదీ అచ్ఛేదిన్‌లో మాత్రం ఏకంగా 25 శాతానికి..

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగ ఖాళీలు కొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు గురువారం ట్విట్టర్ వేదికగా ఎద్దేవా చేశారు. '2004లో 'భారత్ వెలిగిపోతోంది'అంటూ నినాదాలు ఇస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు 12.1 శాతంగా ఉండేవి. భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో ఇది సుమారు 11 శాతంగా నమోదైంది. కానీ ప్రధాని మోదీ పాలనలోని 'అచ్ఛే దిన్'(మంచి రోజులు)లో మాత్రం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు ఏకంగా 25 శాతానికి చేరుకున్నాయి. అయినా అంతా సజావుగా ఉందని చెబుతున్నారు..'అని కేటీఆర్ విమర్శించారు.

రెవెన్యూ, రక్షణ రంగంలో 40 శాతం ఖాళీలు

కేంద్ర పాలిత ప్రాంతాలు మినహా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మంజూరైన పోస్టుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలను కేటీఆర్ తన ట్వీట్‌లో వెల్లడించారు. కేంద్ర వ్యయ విభాగం వార్షిక నివేదికను ఉటంకించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో అత్యధికంగా రెవెన్యూలో 41.6 శాతం, రక్షణ (సివిల్) విభాగంలో 40.2 శాతం, పోస్టల్ 38.7 శాతం, ఇతరాల్లో 34.9 శాతం, రైల్వేల్లో 20.5 శాతం, హోం శాఖలో 11.1 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు లక్ష్యంగా విపక్ష పార్టీలు వ్యూహాలు, కుట్రలపై దృష్టి పెడితే, ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం వచ్చే తరానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో తీరిక లేకుండా ఉన్నారని మరో ట్వీట్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. వైద్య విద్య, ఆరోగ్యరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులతో.. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 500 పడకల సామర్థ్యంతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్, న ర్సింగ్ కాలేజీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఈ తరహా అభివృద్ధిని ఎవరైనా సాధించారా అని కేటీఆర్ ప్రశ్నించారు.

బీజేపీ ఏ పార్టీతో కలవలేదు.. కలవదు

- తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయం!
- కాంగ్రెస్ పార్టీవి అమలు సాధ్యం కాని హామీలు
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



సాక్షిప్రతినిధి, వరంగల్: 'బీజేపీ ఏ పార్టీతో కలవలేదు, కలువబోదు' అని ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. 'మా మీద గుడ్డి ద్వేషంతో.. వారి కాళ్ల కింద భూమి కదిలిపోతోందని కొందరు కుట్రలు చేస్తున్నారు. కొన్ని మీడియా సంస్థలు, పేపర్లు, యూట్యూబ్ చానళ్లు కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నాయి'' అని విమర్శించారు. బీజేపీలో సంస్థాగత మార్పులు రాబోయే కాలంలో రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి రావడానికి నాంది పలుకుతున్నాయన్నారు. శనివారం ప్రధాని మోదీ వరంగల్‌కు వస్తున్న సందర్భంగా ఈటల హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాన్ని సందర్శించి సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వరంగల్‌లో ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో నిర్వహించే విజయ సంకల్పసభతో ఎన్నికల శంఖారావం పూరిస్తామన్నారు. బీజేపీలో భేదాభిప్రాయాలకు తావులేదని, అందరం ఐక్యంగా ఉన్నామని చెప్పారు.

ప్రజాస్వామ్యం ఖూనీపై మోదీ ఆందోళన

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మోదీ ఆందోళన చెందారని ఈటల చెప్పారు. రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని వదిలేది లేదు, చట్టం నుంచి వారు తప్పించుకోలేరన్నారు. కేసీఆర్ కుటుంబపాలనకు అంతం పలికేది బీజేపీయేనన్నారు. ఆర్థిక మంత్రిగా చేసిన అనుభవంతో చెబుతున్నానని, కాంగ్రెస్ హామీలు అమలు సాధ్యం కాదన్నారు. ఓరుగల్లు గడ్డమీద ముప్పై ఏళ్ల తర్వాత దేశ ప్రధానిగా మోదీ అడుగు పెట్టబోతున్నారని చెప్పారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, మాజీ మంత్రి విజయరామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు



సాక్షి, హైదరాబాద్: జూన్‌లో జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను శుక్రవారం విడుదల చేస్తున్నట్టు టెన్త్ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఫలి తాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు.ఫలితాల కోసం www.bse.telangana.gov.inలేదా http://results.bsetelangana.orgవెబ్‌సైట్లకు లాగిన్ కావాలని సూచించారు. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను వేగంగా అందించేందుకు సాక్షి ఏర్పాట్లు చేసింది. www.sakshieducation.comకు లాగిన్ అయి ఫలితాలు తెలుసుకోవచ్చు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు నేడు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శుక్రవారం వెల్లడిస్తున్నట్టు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. సాయంత్రం 2 గంటలకు అధికారిక వెబ్‌సైట్లలో ఫలితాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఫలితాల కోసం https://tsbie.cgg.gov.in లేదా https://results.cgg.gov.in వెబ్‌సైట్లకు లాగిన్ అవ్వాలని తెలిపింది. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలను www.sakshieducation.comలో కూడా చూడవచ్చు.

నేటి నుంచి బాసర ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్



భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో 2023–24 విద్యాసం వత్సరానికి సీట్లు దక్కించుకున్న విద్యార్థులకు శుక్రవారం నుంచి 3రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువా రం ఆయన కౌన్సెలింగ్ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అధికారులు సూచించిన విధంగా సర్టిఫికెట్లు తీసుకు రావాలని, ఫీజు చెల్లించేందుకు కౌన్సెలింగ్ ఆవరణలోనే ఎస్ బీఐ కౌంటర్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామ న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

38 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల ఉన్నతీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 38 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను ఇంటర్మీడియెట్ వరకు ఉన్నతీకరించినట్టు విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి వెల్లడించారు. వీటిలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ఫస్టియర్, 2024–25 నుంచి సెకండియర్ క్లాసులు మొదలవుతాయని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా రూ.7.60 కోట్ల భారం పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 475 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ఉండగా, ఇప్పటివరకు 245 విద్యాలయాలను ఇంటర్మీడియెట్ వరకు అప్‌గ్రేడ్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం 38 కస్తూర్బా గాంధీ బాలికావిద్యాలయాలను అప్‌గ్రేడ్ చేయడం వల్ల ఈ సంవత్సరం 3,040 మంది బాలికలకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు. 475 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 1,33,879 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. తాజాగా అప్‌గ్రేడ్ చేసిన విద్యాలయాల్లో రెండేసి గ్రూపులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సీనియారిటీ ఆధారంగానే డీఎంహెచ్‌వో పోస్టుల భర్తీ

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేయనున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పోస్టులను సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కోరింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాలూ ప్రసాద్ రాథోడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కల్యాణ్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి దీన్ దయాల్, కోశాధికారి ప్రశాంత్.. వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీని కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగంలోని వైద్యులకు ఎన్నో ఏళ్ల సర్వీసు ఉన్నా, పదోన్నతులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సీనియారిటీ ప్రకారం 33 జిల్లాల్లో పోస్టులను భర్తీ చేయాలని కోరారు.


పాలిసెట్ కౌన్సెలింగ్‌లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: పాలిసెట్ ఆఖరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం వెల్లడవుతున్న నేపథ్యంలో, ఉత్తీర్ణులయ్యే వారికి అవకాశం కల్పించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ముఖ్య తేదీలు..

స్లాట్ బుకింగ్ చివరి తేదీ	9.7.23
ఆప్షన్లకు ఆఖరి గడువు	11.7.23
సీట్ల కేటాయింపు	14.7.23
సెల్ఫ్ రిపోర్టింగ్	14 నుంచి 17.7.23
తరగతులు ప్రారంభం	21.7.23

కంప్యూటర్ సైన్స్‌లో పెరిగాయ్..



- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అందుబాటులోకి సీట్లు..
- డిమాండ్ లేని బ్రాంచీల నుంచి ఇతర బ్రాంచీలకు 7,635 సీట్లు మార్పు
- ఇదే సమయంలో కొత్తగా 6,930 సీట్లకు అనుమతి
- మార్చిన, కొత్త సీట్లలో చాలా వరకు కంప్యూటర్ సైన్స్ కోర్సులవే..
- కొత్త సీట్ల చేరిక నేపథ్యంలో ఎంసెట్ షెడ్యూల్‌లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలలో కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించిన సీట్లు భారీగా పెరిగాయి. ప్రైవేటు కాలేజీల విజ్ఞప్తి మేరకు పెద్దగా డిమాండ్ లేని బ్రాంచీల నుంచి ఇతర బ్రాంచీలకు 7,635 సీట్లను మార్చగా.. అదనంగా 6,930 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో చాలా వరకు కంప్యూటర్ సైన్స్ బ్రాంచీలకు సంబంధించిన సీట్లేకావడం గమనార్హం. మొత్తంగా డిమాండ్ ఉన్న బ్రాంచీలకు సంబంధించి ఈసారి (2023–24) కొత్తగా 14,565 ఇంజనీరింగ్ సీట్లను ఎంసెట్ కౌన్సెలింగ్‌లో చేర్చుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన సీట్లలో దాదాపు 10,195 సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ఇలా ఇంజనీరింగ్‌లో సీట్ల పెంపుతో రూ.27.39 కోట్ల మేర అదనంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ భారం పడుతుందని ప్రభుత్వం పేర్కొంది. విద్యార్థుల నుంచి డిమాండ్ లేని బ్రాంచీలు, సీట్లు రద్దు చేసుకుని.. ఆ మేర డిమాండ్ ఉన్న కోర్సుల్లో పెంచుకోవడానికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఇటీవల అనుమతించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వందకుపైగా కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. సుమారు 50కిపైగా కాలేజీలు సీఎస్‌సీ, ఇతర కంప్యూటర్ కోర్సుల్లో భారీగా సీట్లు పెంచుకున్నాయి.

మొత్తం 1.15 లక్షలకు చేరిన సీట్లు..

➤ రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశ ఎంసెట్ కౌన్సెలింగ్‌లో 66,112 సీట్లను అందుబాటులో పెట్టారు. తాజాగా పెరిగిన సీట్లను కూడా చేరిస్తే ఈ సంఖ్య 80,677 సీట్లకు పెరుగుతోంది. యాజమాన్య కోటా సీట్లనూ కలిపితే రాష్ట్రంలో 1.15 లక్షల ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌తోపాటు మరికొన్ని కంప్యూటర్ కోర్సుల్లో గత సంవత్సరం 41,506 సీట్లు అందుబాటులో ఉండగా.. ఈసారి 56 వేల వరకూ చేరనున్నాయి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్‌తోపాటు ఇతర బ్రాంచీల్లో గత ఏడాది 29,780 సీట్లు ఉండగా.. ఈసారి 22,145 సీట్లకు తగ్గిపోనున్నాయి.

ఎంసెట్ షెడ్యూల్‌లో మార్పు

ఇప్పటికే ఎంసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ చివరి దశకు చేరకుంది. ఈ నెల 12న సీట్ల కేటాయింపు జరగాల్సి ఉంది. కొత్త సీట్లకు అనుమతి ఇవ్వడంతో.. వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు ఎంసెట్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. దీని ప్రకారం ఈ నెల 8 వరకూ అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 9న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 12 వరకు ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 16న సీట్ల కేటాయింపు చేపడతారు. సీటు వచ్చిన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. రెండో దశ ఎంసెట్ కౌన్సెలింగ్ ఈ నెల 24 నుంచి మొదలవుతుంది.

పెంపు మంచి నిర్ణయం..



ఇంజనీరింగ్ సీట్ల పెంపు నిర్ణయం ఆహ్వానించదగ్గ పరిణామం. దీనివల్ల అదనంగా 10వేల మందికిపైగా సీట్లు పొందే అవకాశం వస్తుంది. డిమాండ్ ఉన్న కోర్సుల్లో చేరాలనుకునే వారికి ఇది ప్రయోజనకరం.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

ఫ్యాకల్టీకి ఉద్యోగ భద్రత కల్పించాలి

సంప్రదాయ బ్రాంచీల్లో సీట్లు తగ్గించడం వల్ల కొన్ని సెక్షన్లు రద్దవుతాయి. ఈ కారణంగా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అధ్యాపకులను తొలగించే ప్రమాదం ఉంది. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. అవసరమైతే వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మిగతా బ్రాంచీల్లో బోధించే నైపుణ్యం కల్పించాలి.

– వి.బాలకృష్ణ, సాంకేతిక, వృత్తి విద్యా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఏకేద్దాం.. బీ రెడీ!

▶ మొదటి పేజీ తరువాయి

రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహానికి పదును పెడుతున్నారని వివరిస్తున్నాయి.

'ఏ టీం, బీ టీం'పై ఆగ్రహం

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. పరస్పరం తలపడాల్సిన కాంగ్రెస్, బీజేపీ రెండూ బీఆర్‌ఎస్‌ను లక్ష్యంగా చేసుకోవడాన్ని కేసీఆర్ సీరియస్‌గా పరిగణిస్తున్నారు. బీఆర్‌ఎస్‌ను 'ఏ టీం', 'బీ టీం' అంటూ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న ఆరోపణలను నిలువరించకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కు నష్టం వాటిల్లుతుందని అంచనా వేస్తున్నారు. బీజేపీలో జరుగుతున్న పరిణామాలను బీఆర్‌ఎస్‌ను జతచేస్తూ జరుగుతున్న ప్రచారానికి అడ్డుకట్ట వేయడంపై దృష్టి సారించారు. జాతీయ స్థాయిలో పెరుగుతున్న బీఆర్‌ఎస్ ప్రభావాన్ని నిలువరించేందుకు కాంగ్రెస్, బీజేపీ తమను లక్ష్యంగా చేసుకున్నట్టుగా భావిస్తున్నా రు. ఈ నేపథ్యంలో రెండు జాతీయ పార్టీలను ఏకకాలంలో ఇరుకున పెట్టేందుకు అవసరమైన కార్యాచరణపై కసరత్తు చేస్తున్నారు.

పార్లమెంటు సమావేశాల్లో దూకుడుగా..

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో అనేక అంశాల్లో కాంగ్రెస్, ఇతర విపక్షాలతో కలసి బీఆర్‌ఎస్ ఆందోళన చేసింది. మళ్లీ ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. ఈసారి బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం పాటిస్తూ బీఆర్‌ఎస్ గొంతు వినిపించేలా కేసీఆర్ వ్యూహరచన చేస్తున్నారు. దీనికి సంబంధించి వచ్చే వారం బీఆర్‌ఎస్ ఎంపీలతో భేటీ నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నట్టు తెలి సింది. బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలను జాతీయ స్థాయిలో ఎత్తిచూపేలా తమ కార్యాచరణ ఉంటుందని పార్టీ ఎంపీ ఒకరు వెల్లడించారు.

విపక్షాల్లోని అసంతృప్త నేతలకు గాలం..!

బీఆర్‌ఎస్‌లోని అసంతృప్త నేతలను చేర్చుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఆ రెండు జాతీయ పార్టీల్లోని సంస్థాగత లోపాలను అనువుగా మలుచుకోవాలని.. అసంతృప్త, అసమ్మతి నేతలకు గాలం వేసి, పార్టీ చేర్చుకోవాలని బీఆర్‌ఎస్ నిర్ణయించినట్టు తెలిసింది. దీనికి సంబంధించి కేసీఆర్ ఆదేశాల మేరకు కీలక నేతలు పలువురితో మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం. ఇప్పటికే మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి దాసోజు శ్రవణ్, స్వామిగౌడ్, భిక్షమయ్య గౌడ్, కాంగ్రెస్ నుంచి పల్లె రవికుమార్ బీఆర్‌ఎస్ గూటికి చేరుకున్నారు. ప్రస్తుతం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఓ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన రాకను నిరసిస్తూ సంబంధిత నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కేడర్ సమావేశమై తమ అభిప్రాయాన్ని అధిష్టానానికి తెలియజేశారు కూడా. గతంలో రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్‌లో చేరి, ఎంపీ టికెట్ దక్కకపోవడంతో పార్టీ మారిన నేత కూడా బీఆర్‌ఎస్‌లో చేరడం ఖాయమైనట్టు ప్రచారం జరుగుతోంది. సదరు నేతకు పెద్దపల్లి లోక్‌సభ స్థానం లేదా ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్ ఇస్తామనే హామీ బీఆర్‌ఎస్ నుంచి వచ్చినట్టు సమాచారం. ఇదే తరహాలో మరికొందరు నేతలపైనా బీఆర్‌ఎస్ ఫోకస్ చేసినట్టు తెలిసింది.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో వీఏఎస్ అభ్యర్థుల హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: పశు సంవర్థక శాఖ పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (వీఏఎస్) ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్‌టికెట్లు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. అభ్యర్థులు వీటిని వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి సూచించారు. ఈనెల 13, 14 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5వరకు వీఏఎస్ అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. హాల్‌టికెట్‌తో పాటు నిబంధనలు సైతం వెబ్ సైట్‌లో ఉన్నా యని, వాటిని అభ్యర్థులు తప్పకుండా అనుసరించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు మాక్‌టెస్ట్‌లో పాల్గొనవచ్చని, ఇందుకు కమిషన్ వెబ్‌సైట్ తెరిచి నిర్దేశించిన లింకు ద్వారా పరీక్ష రాయొచ్చని సూచించారు.

గ్రూప్–2 దరఖాస్తు సవరణకు అవకాశం

ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు సవరణ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవరణ అవకాశం కల్పించింది. ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులో పొరపాట్లను సవరించుకునే వీలుంటుంది. సవరణ ప్రక్రియ కేవలం ఒక్కసారి మాత్రమే ఉంటుందని, దరఖాస్తును ముందుగా తెరిచి ఎక్కడ పొరపాట్లు ఉన్నాయో గుర్తించి వాటిని సవరించుకోవాలని స్పష్టం చేసింది. ఎడిట్ ఆప్షన్ కోసం దరఖాస్తును తెరిచి ఎంట్రీ చేసిన వివరాలను తుది వివరాలుగా పరిగణిస్తామని కమిషన్ స్పష్టం చేసింది. పేరు, ఆధార్ వివరాలు, పుట్టిన తేదీ తదితరాలను సవరించుకోవాల్సి వస్తే అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సవరణ తర్వాత పీడీఎఫ్ దరఖాస్తును భవిష్యత్ అవసరాల కోసం డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐఏఎస్ అధికారి నవీన్ మిత్తల్‌కు రూ.10 వేల జరిమానా

కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో సీనియర్ ఐఏఎస్ నవీన్ మిత్తల్‌కు హైకోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. గతంలో కళాశాల విద్యాకమిషనర్‌గా ఉన్నప్పుడు కోర్టు ఆదేశాలను పాటించనందుకు ఈ మేరకు ఆదేశించింది. కళాశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరికి కూడా రూ.10 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే నెల జైలుశిక్ష అనుభవించాలని పేర్కొంది. కల్వకుర్తి గవర్నమెంట్ మోడల్ డిగ్రీ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు కోవిడ్ కాలంలో ఉద్యోగానికి రాలేదని సర్వీసు నుంచి తొలగిస్తూ మిట్టల్ అప్పట్లో ఆదేశాలు జారీచేశారు. దీనిపై శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించగా ఆ ఆదేశాలను కొట్టేసింది. అయితే శ్రీనివాస్‌రావును సర్వీసులోకి తీసుకోకుండానే మళ్లీ ఆయన్ను రీజినల్ జాయింట్ డైరెక్టర్ తొలగించారు. దీంతో శ్రీనివాసరావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం అధికారులిద్దరికీ జరిమానా విధించారు.

విద్యుత్ సంస్థలకు కొత్త బాస్‌లు?

- ఇంధన శాఖలో జోరందుకున్న ఊహాగానాలు
- తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న ట్రాన్స్‌కో/ జెన్‌కో, ఎస్పీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్లు
- వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు
- బాధ్యతల నుంచి తప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు
- కొత్తవారి నియామకంపై సర్కారు దృష్టి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సంస్థల సీఎండీలు, డైరెక్టర్ల మార్పు, కొత్తవారి నియామకంపై ఊహా గానాలు ఊపందు కున్నాయి. కొత్త సీఎండీలు, డైరెక్టర్ల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, ఇందుకు సంబంధించిన కసరత్తును ప్రారంభించిందని చెబుతున్నారు. సింగరేణి సంస్థ సీఎండీగా ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఎన్.శ్రీధర్.. ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎండీ రేసులో ముందు వరుసలో ఉన్నట్టు సమాచారం. అయితే ఆయన ఇప్పటికే ఆయన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ సీఎండీగా ఎంపికైనా, ఇంకా నియామక ఉత్తర్వులు జారీ కాలేదు. శ్రీధర్ కాకుంటే, సీఎంకు అత్యంత విశ్వసనీయంగా ఉండే సీనియర్ ఐఏఎస్ అధి కారుల్లో ఒకరిని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది.

తనకు విముక్తి కల్పించాలంటున్న ప్రభాకర్‌రావు..

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) సీఎండీగా, విద్యుత్ సరఫరా సంస్థ(ట్రాన్స్‌కో)ల ఇన్‌చార్జి సీఎండీగా డి.ప్రభాకర్‌రావు గత నెలతో 9 ఏళ్లు, 2019 జనవరి 10 నాటికి విద్యుత్ సంస్థల్లో 50 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసుకుని రికార్డు సృష్టించారు. ఆయన అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా 1969 జనవరి 10న ఎలక్ట్రిసిటీ బోర్డులో చేరారు. విద్యుత్ రంగానికి సంబంధించిన విధానాల రూపకల్పన, నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ స్టేట్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (టీఎస్‌పీసీసీ) చైర్మన్ హోదాలో ఆయన డిస్కంల నిర్వహణను సైతం పర్యవేక్షించారు. ఆయనకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) హోదాను కట్టబెట్టి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రస్తుతం 76 ఏళ్ల వయస్సులో ప్రభాకర్‌రావు వయోభారం, అనా రోగ్య సమస్యలతో ఇబ్బందులు పడు తున్నారు. తనను బాధ్యతల నుంచి తప్పిస్తే విశ్రాంతి తీసు కుంటానని గతంలో ఆయన విజ్ఞప్తి చేయగా సీఎం కేసీఆర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలోనే గత నెల రోజులుగా ఆయన బహిరంగ సభల్లో తనకు బాధ్యతల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. సమీప భవిష్యత్తులో తాను బాధ్యతల నుంచి తప్పు కున్నా మరో విధంగా భావించవద్దని విద్యుత్ ఉద్యోగులకు ఆయన తాజా గా విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తులపై ప్రభుత్వం నుంచి సాను కూల సంకేతాలు అందిన నేపథ్యంలోనే ఆయనీ ప్రకటనలు చేశారని విద్యుత్ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

డైరెక్టర్లు కూడా దీర్ఘకాలంగా..

టీఎస్ఎస్పీడీసీఎల్‌లో 8 మంది, టీఎస్ఎన్పీ డీసీఎల్‌లో ఆరుగురు, ట్రాన్స్‌కోలో జేఎండీ, మరో నలుగురు డైరెక్టర్లు, జెన్‌కోలో ఆరుగురు డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో చాలామంది 9 ఏళ్లకు పైగా ఆయా పదవుల్లో కొనసాగుతున్నారు. వీరిలో చాలామంది 70 ఏళ్లకు పైబడిన వారే. కొన్ని విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల సంఖ్య మంజూరైన పోస్టుల సంఖ్య కంటే పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో కొందరు డైరెక్టర్లను సాగనంపి వారి స్థానంలో కొత్తవారిని నియమించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

80 ఏళ్లకు చేరువలో ఉత్తర డిస్కం సీఎండీ..

ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) సీఎండీగా ఎ.గోపాల్ రావు ఆరున్నరేళ్లు పూర్తి చేసుకున్నారు. ఆయన 2003లో చీఫ్ ఇంజనీర్‌గా రిటైరయ్యారు. ప్రస్తు తం ఆయన వయస్సు 78 ఏళ్లకు పైనే. వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న ఆయన వృద్ధాప్య సమస్యల వల్ల తరుచుగా హైదరాబాద్‌కు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యుత్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని అంటున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎండీగా జి.రఘుమా రెడ్డి సైతం ఈ నెలలో 9 ఏళ్లను పూర్తి చేసుకోనున్నారు. ప్రస్తుతం ఆయన వయస్సు కూడా 71 ఏళ్లకు పైనే. ఒక వేళ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా నాన్ ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వం భావిస్తే ఈయన పేరును సైతం పరిశీలించే అవకాశం ఉంది.



తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్‌రావు, ఆలిండియా జ్యుడీషియల్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బి.లక్ష్మారెడ్డి తదితరులు

గురుకుల సీటుకు సిఫారసు కట్

- సంక్షేమ గురుకుల విద్యాసంస్థల అడ్మిషన్లలో మెరిట్‌కే ప్రాధాన్యం
- ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసులను అనుమతించొద్దని సొసైటీల నిర్ణయం
- మెరిట్ అభ్యర్థులు లేకుంటే సీట్లు ఖాళీగా ఉంచాలని నిర్ణయం
- ప్రస్తుతం తొలివిడత ప్రవేశాలతో సరిపెట్టిన సొసైటీలు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో సిఫా రసు లేఖలకు కాలం చెల్లింది. గురుకులాల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిశాక మిగులు సీట్ల భర్తీలో మంత్రులు, ప్రజాప్రతినిధుల సిఫా రసు లేఖలను ఏమాత్రం పరిగణ నలోకి తీసుకో రాదని... కేవలం మెరిట్ ఆధారంగానే అడ్మిషన్లు ఇవ్వాలని గురుకుల సొసైటీలు నిర్ణయించాయి. గత నెలలో ప్రవే శాల ప్రక్రియను ప్రారంభించిన గురుకుల సొసై టీలు తొలివిడత కౌన్సెలింగ్ చేపట్టి సీట్లు పొందిన విద్యార్థులకు గడువులోగా నిర్దేశిత విద్యాసంస్థల్లో రిపోర్టు చేయాల్సిందిగా స్పష్టం చేశాయి. మెజారిటీ విద్యార్థులు ఆయా సంస్థల్లో చేరగా మిగులు సీట్లకు సంబంధించి మరో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ఆశావహులు భావించారు. కానీ గురుకుల సొసైటీలు మాత్రం ఇప్పటికీ పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ చేయలేదు. మరోవైపు అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమవగా బోధన సైతం వేగంగా కొనసాగుతోంది.

మెరిట్‌కే పరిమితం...: రాష్ట్రంలో ఐదు గురుకుల విద్యాసంస్థల సొసైటీలున్నాయి. మహాత్మా జ్యోతిభాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీలు సంబంధిత సంక్షేమ శాఖల పరిధిలో కొనసాగుతున్నాయి. తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీ మాత్రం పాఠశాల విద్యాశాఖ పరిధిలో కొనసాగుతోంది. ఐదు సొసైటీల పరిధిలో 1005 పాఠశాలలు, కళాశాలలున్నాయి. వాటిలో ఐదో తరగతి అడ్మిషన్లతోపాటు 6, 7, 8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఇంటర్ ఫస్టియర్, డిగ్రీ ఫస్టియర్‌కు ఏటా అడ్మిషన్లు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల సొసైటీల పరిధిలో ఐదో తరగతికి ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. మిగతా తరగతులకు మాత్రం సొసైటీలు వేరువేరుగా ప్రకటనలు జారీ చేసి అర్హత పరీక్షలు నిర్వహించి మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇస్తాయి.

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఎంబీబీఎస్ సీట్లలో రిజర్వేషన్

రామగుండం మెడికల్ కాలేజీ పేరు ఇకనుంచి 'సిమ్స్'

సాక్షి, హైదరాబాద్: సింగరేణి ఉద్యోగులకు, వారి పిల్లలకు శుభవార్త. పెద్దపల్లి జిల్లా రామగుండం మెడికల్ కాలేజీ పేరును సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)గా మార్చడంతోపాటు, అక్కడి ఉద్యోగుల పిల్లలకు ఎంబీబీఎస్ సీట్లలో రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సింగరేణి ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రామగుండం మెడికల్ కాలేజీలో మొత్తం 150 ఎంబీబీఎస్ సీట్లుండగా, 23 సీట్లు ఆలిండియా కోటాకి వెళ్తాయి. మిగతా 127 ఎంబీబీఎస్ సీట్లలో 5% రిజర్వేషన్ ప్రకారం, అంటే 7 సీట్లు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కేటాయించనున్నారు. నీట్ మెరిట్ ప్రకారం భర్తీ చేసే ఈ సీట్ల విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పరిగణనలోకి తీసుకుంటారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. కాగా, ఈ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోని 50 శాతం పడకలను సింగరేణి ఉద్యోగులకు కేటాయించినట్లు ప్రకటించారు. ఇదిలావుండగా, తెలంగాణ మెడికల్, డెంటల్ కాలేజీల అడ్మిషన్ నిబంధనలను కొన్నింటికి సవరణలు చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇవన్నీ కూడా గతంలో ఉన్న ఉత్తర్వులేనని వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది.

ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశాల ప్రక్రియ షురూ..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదుకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేయనున్నారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నీట్–2023లో అర్హత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో వెల్లడించారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుంది. దరఖాస్తుతో పాటు అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులు, ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. దీనికి సంబంధించి వ్యక్తిగతంగా ఎలాంటి సమాచారం పంపరు. వెబ్‌సైట్‌ను మాత్రమే చూడాలి. తుది మెరిట్ జాబితా విడుదల అనంతరం వెబ్ ఆప్షన్లకు యూనివర్సిటీ మరో ప్రకటన జారీ చేస్తుంది. తదనుగుణంగా అభ్యర్థులు ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం జాతీయ స్థాయి నుంచి వచ్చే కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎంబీబీఎస్, డెంటల్ కోర్సుల కోసం రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజును ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ. 3,500గా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 2,900గా నిర్ధారించారు. ఫీజును డెబిట్ కార్డ్ / క్రెడిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

దరఖాస్తులో ఇబ్బంది ఎదురైతే..: అడ్మిషన్ కోసం వెబ్ ఆప్షన్ల కోసం ప్రత్యేకంగా షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తును సమర్పించడానికి విద్యార్థికి ఏదైనా ఇబ్బంది ఎదురైతే 93926 85856, 78425 42216, 9059672216 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. లేదా tsmedadm2023@gmail.comకు ఈ–మెయిల్ చేయొచ్చు. ప్రవేశాలకు సంబంధించిన అర్హతలు, ఇతర సమాచారానికి యూనివర్సిటీ వెబ్‌సైట్ www.knruhs. telangana.gov.in ను సందర్శించాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

గిరిజన వర్సిటీ హామీ ఏమైంది?

గవర్నర్ తమిళిసైకి రెడ్కో చైర్మన్ లేఖ

సాక్షి, హైదరాబాద్: ములుగులో జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేంద్రం ఆమోదముద్ర వేసే బాధ్యత తీసుకుంటానన్న హామీ ఏమైందని గవర్నర్ తమిళిసైని రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (రెడ్కో) చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం గవర్నర్‌కి బహిరంగ లేఖ రాశారు. వర్సిటీకి ప్రభుత్వం భూమి కేటాయించినా.. మీరిచ్చిన హామీ నాలుగేళ్లవుతున్నా వర్సిటీ ఏర్పాటు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంత కరుణామయుడు (అల్లాహ్)!
నక్షత్రాలు మరియు వృక్షాలు అన్నీ ఆయనకు
సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉంటాయి.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 7 జూలై 2023

వైరుధ్యాలతోనే... ఒకే గూటిలో...

పరస్పర వైరుధ్యాలను బయటపెట్టుకుంటూనే సహకారం కోసం సాగిన ప్రయత్నం ఇది. మంగళవారం నాటి 'షాంఘై సహకార సంఘం' (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సును ఒక్కమాటలో అభివర్ణించాలంటే అంతే! భారత ఆతిథ్యంలో వర్చ్యువల్‌గా సాగిన ఈ 8 సభ్యదేశాల సంఘం 23వ సదస్సు విజయవంతంగానే ముగిసింది కానీ, చైనా, పాకిస్తాన్‌లతో మన సంబంధాల్లో అంతర్లీనంగా ఉన్న అసంతృప్తి మాత్రం స్పష్టంగా కనపడింది. ఢిల్లీ ఎప్పటిలానే తీవ్రవాద వ్యతిరేక మంత్రం, బీజింగ్ షరా మామూలు ఆర్థిక సహకార తంత్రాలనే సదస్సులో ప్రవచించాయి. అమెరికా, పాశ్చాత్య ప్రపంచాలతో సంబంధం లేకుండా చైనా–రష్యా కేంద్రకంగా యురేషియా బృందానికి, ప్రపంచ జనాభాలో 40 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘం గనకే ఎస్సీఓపై ప్రపంచానికి అమితాసక్తి. భారత ప్రధాని వర్చ్యువల్‌గా ఆతిథ్యమిచ్చిన ఈ సదస్సుకు హాజరైనవారిలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లతో పాటు కొత్తగా సభ్యత్వం పొందిన అమెరికా వ్యతిరేక ఇరాన్ అధ్యక్షుడు ఉన్నారు. వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఈ సదస్సును జరపాలనుకున్నా, మోదీ అమెరికా పర్యటనతో వాయిదా వేసి, ఆన్‌లైన్‌లో సరిపెట్టాల్సి వచ్చింది.

ఈ సమావేశంతో ఏడాది కాలపు భారత అధ్యక్ష హోదా ముగిసింది. నిన్న గాక మొన్ననే అమెరికాలో పర్యటించి, స్నేహం పెంచుకున్నప్పటికీ విదేశాంగ విధానంలో తాము స్వతంత్రులమే అని భారత్ ప్రకటించుకోవడానికి ఈ సదస్సు ఉపకరించింది. అమెరికా వ్యతిరేక ఇరాన్‌ను సభ్యదేశంగా ఆహ్వానించడం, ఉక్రెయిన్‌పై దాడిలో రష్యాకు మిత్ర పక్షమైన బెలారుస్‌కు వచ్చే ఏటికల్లా పూర్తి సభ్యత్వమిస్తామని ప్రతిపాదించడమే అందుకు సూచన. అదే సమయంలో చైనా చేపట్టిన వందల కోట్ల డాలర్ల ప్రాజెక్ట్ 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' (బ్రి)కు మిగతా దేశాలన్నీ మద్దతుగా నిలిచినా, సదస్సు అనంతర ప్రకటనలో ఆ భాగానికి భారత్ దూరం జరిగింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) మీదుగా సాగే 'చైనా – పాకిస్తాన్ ఆర్థిక కారిడార్' (సీపీఈసీ) నిర్మాణం సైతం 'బ్రి'లో భాగం గనక దాన్ని భారత్ వ్యతిరేకిస్తోంది. ఆ ప్రాంతంలో సీపీఈసీ పురోగతి దేశ సార్వభౌమత్వానికీ, ప్రాదేశిక సమగ్రతకూ తీవ్ర ఉల్లంఘన అనేది మన స్పష్టమైన వైఖరి.

ఆది నుంచి ఎస్సీఓ కొంత చైనా లక్షణాలను పుణికిపుచ్చుకున్నదే. అలా చూస్తే 2017 నుంచి పాకిస్తాన్‌తో పాటు ఈ సంఘంలో పూర్తిస్థాయి సభ్యత్వం పొందిన భారత్ ఇందులో విజాతీయ సభ్యదేశం. అదే ఏడాది ఇటు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన పునరుద్ధరించిన 'క్వాడ్' లోనూ భారత్ సభ్యత్వం పొందింది. వర్తమాన భౌగోళిక రాజకీయాల రీత్యా వివిధ అంతర్జాతీయ వేదికలను సమర్థంగా వినియోగించుకోవాలని భారత్ సంకల్పం. తాజా ఎస్సీఓ భేటీలోనూ సహకార, భాగస్వామ్యాలు వీలున్న అంశాల్లో మాటామంతీ ముందుకు తీసుకెళ్ళాలని ప్రయత్నించింది. ఇది ప్రశంసనీయమే. సీమాంతర తీవ్రవాదం, ప్రాంతీయ సుస్థిరత, సభ్యదేశాల మధ్య మెరుగైన సహకారం తదితర కీలక అంశాలపై ఈ సదస్సు దృష్టి పెట్టింది. చైనా, పాకిస్తాన్‌లతో కలసి భారత్ వేదిక పంచుకోవడమనేది అరుదైన ఘటన గనక అందరి చూపూ ఇటు పడింది.

భారత, పాకిస్తాన్‌లు మాటామంతీ సాగించడానికీ, పరస్పర సహకారానికి గల మార్గాలను పరిశీలించడానికీ ఈ సదస్సు సదవకాశం. కానీ, ఇరుదేశాల మధ్య పాతుకుపోయిన అవిశ్వాసమే ఈ శిఖరాగ్ర సదస్సులో మళ్ళీ బయటపడింది. తీవ్రవాదానికి అండగా నిలిచినంత కాలం పాక్‌తో చర్చలు పునరుద్ధరించేది లేదన్నదే భారత వైఖరి. అలాగే, వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంట యథాపూర్వ స్థితి రావాలని కోరుతున్న భారత్, చైనాతో సాధారణ సంబంధాలను పునరుద్ధరించడానికి ఆ మాట మీదే పట్టుబడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ సభ్యదేశాల మధ్య సహకరానికి ఢిల్లీ అయిదు అంశాల్ని గుర్తించింది. అవి... అంకుర సంస్థలు–నవకల్పన, సాంప్రదాయిక వైద్యం, యువతరం సాధికారికత, అందరికీ డిజిటల్ అవకాశాలు, ఉమ్మడి బౌద్ధ వారసత్వం. ఇవి అస్పష్టమే అయినప్పటికీ, వైరుధ్యాల మధ్యా తమకు సామ్యాలున్నట్టు చెప్పడానికి ఉపకరిస్తాయి.

నిజానికి, సెప్టెంబర్‌లో భారత్‌లో జరిగే జీ–20 భేటీలో ఏకాభిప్రాయ ఉమ్మడి ప్రకటనకు చైనా, రష్యాల నుంచి చిక్కులు లేకుండా చూసుకొనేందుకు తాజా ఎస్సీఓను ముందస్తు ట్రయల్‌గా భారత్ వాడుకొని ఉండవచ్చు. కానీ, ఐరాస భద్రతామండలిలో భారత ప్రయత్నాలకు చైనా అడ్డుపడుతున్న వేళ తీవ్రవాదంపై బలంగా స్వరం వినిపిస్తూ చైనా, పాక్‌లపై పరోక్షంగా బాణం గురిపెట్టింది. అయితే, అదే సమయంలో తీవ్రవాద, వేర్పాటువాద సంస్థల 'ఉమ్మడి జాబితా' రూపకల్పనను చైనా ఆధిపత్య ఎస్సీఓ లక్ష్యంగా పెట్టుకొనేలా చేయగలిగింది. భద్రతామండలి ఇప్పటికే ఈ పని చేస్తున్నందున ఈ రెండో జాబితా ఎందుకు, దాని వల్ల ఉపయోగమేమిటన్నది చెప్పలేం.

ఇంగ్లీషును లాంఛనప్రాయంగా ఎస్సీఓ భాషగా చేయడంపై ఎస్సీఓ దేశాల మధ్య ఒప్పందం కుదరలేదు. ఇక, త్రివిక్రమావతారం దాల్చి చైనా మొత్తం ఆక్రమిస్తుందనే శంకతో ఆర్థిక సహకారంపై నిర్ణీత ప్రణాళికకు భారత్ సై అనలేదు. వెరసి, మిశ్రమ ఫలితాలతోనే ఎస్సీఓ భారత అధ్యక్ష హయాం ముగిసిపోయింది. మునుపటి లాభాలు తగ్గిపోతున్నా, పరస్పర భిన్నాభిప్రాయాలు ఎన్ని ఉన్నా సరే... మధ్య ఆసియా ప్రాంతంతో మాటామంతీకీ, అలాగే తాలిబన్ల హయాంలోని అఫ్ఘనిస్తాన్ నుంచి భద్రత కారణాల రీత్యా ఎస్సీఓలో క్రియాశీలంగా కాలు కదపడమే భారత్ ముందున్న మార్గం. ముగిసిన ఎస్సీఓ శిఖరాగ్ర సదస్సు అందులో ఓ భాగమని సంతృప్తిపడాలి.

పరువు దక్కించుకునే ప్రయాణమా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

భారత్ సొంతంగా ఓ వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపేందుకు ప్రయత్నిస్తున్నది. అలాంటప్పుడు 'నాసా' ప్రాయోజకత్వంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మన వ్యోమగామిని పంపించాల్సిన అవసరం ఏమిటి? యూఏఈ, సౌదీ అరేబియా, మలేసియా వ్యోమగాములు కూడా ఇక్కడకు వెళ్లారు. మన వ్యోమగాములను కూడా పంపాలని అనుకుని ఉంటే ఆ పని 'ఇస్రో' ఎప్పుడో చేసి ఉండేది. ఏదోలా మానవుడిని అంతరిక్షంలోకి పంపటం మన ప్రాథమ్యం కాదు. స్వాతంత్య్రం సాధించి 75 ఏళ్లు అయ్యే సమయానికి భారతీయ వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశిస్తారని మోదీ 2018లో ప్రకటించారు. ఈ అతిశయోక్తి హామీ నెరవేరలేదు. దానికొక అల్ప ప్రత్యామ్నాయంగా బహుశా ఇలా మన వ్యోమగామిని అక్కడికి పంపనున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలి అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య సాంకేతిక పరిజ్ఞాన ఒప్పందాలు చాలానే జరిగాయి. వాటిల్లో అంతరిక్ష రంగానికి సంబంధించినవి కూడా రెండు ఉన్నాయి. ఒకటేమో శాంతియుత ప్రయోజనాల కోసం అంతరిక్ష అన్వేషణకు ఉద్దేశించిన 'ఆర్టిమిస్ అకార్డ్స్'. (ఆర్టిమిస్ అనేది ఒక గ్రీకు దేవత పేరు.) అమెరికాలో భారతీయ రాయబారి తరణ్‌జీత్ సింగ్ సంధూ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. వాషింగ్టన్‌లోని ఓ హోటల్‌లో నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నీల్సన్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. రెండో ఒప్పందం ... 2024లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్) పంపే భారతీయ వ్యోమగామికి అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) ప్రాయోజకత్వం వహించడం! భారత్, అమెరికాల మధ్య కుదిరిన ఒప్పందాలు దౌత్యపరంగా, సైన్స్ పరంగా చారిత్రాత్మకమైనవని వర్ణిస్తున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కుదుర్చుకున్న 2008 నాటి భారత్– అమెరికా అణు ఒప్పందంతో వీటిని పోలుస్తున్నారు. అయితే వాస్తవం దీనికి చాలా భిన్నం.

భారత్ సొంతంగానే ఓ వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ కార్యక్రమం ఒకవైపు నడుస్తూండగానే అమెరికా ప్రాయోజకత్వంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వ్యోమగామిని పంపించాల్సిన అవసరం ఏమొచ్చిందన్నది ప్రశ్న. అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో కలిసి నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ– ''ఆర్టిమిస్ అకార్డ్స్‌లో భాగం కావాలన్న నిర్ణయం ద్వారా అంతరిక్ష సహకారంలో నేడు మేలిమి ముందడుగు వేశాం. క్లుప్తంగా చెప్పాలంటే భారత్ – అమెరికా భాగస్వామ్యానికి ఆకాశం కూడా హద్దు కాబోదు'' అని వ్యాఖ్యానించారు.

భారత్‌లోనూ ఈ అంశంపై పెద్ద ఎత్తున సంబరాలు జరిగాయి. ''మనం నర్సరీ రైమ్స్ పాడుకుంటున్న సమయంలోనే జాబిల్లి ఉపరితలంపై మనిషి కాలిడేలా చేసిన అమెరికా లాంటి దేశం జాబిల్లిపై ప్రయోగాల విషయంలో మన నుంచి సమాచారాన్ని, నైపుణ్యాన్ని ఆశిస్తోందంటే అంతకంటే గర్వకారణమైన విషయం ఇంకోటి ఉంటుందా?'' ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి, అంతరిక్ష, అణుశక్తి రంగాల పర్యవేక్షకులైన జితేంద్ర సింగ్ చేసిన వ్యాఖ్య ఇది. అంతేకాదు, ఆర్టిమిస్ ఒప్పందం అంతరిక్ష రంగానికి సంబంధించిన కీలక టెక్నాలజీల దిగుమతిపై ఉన్న నియంత్రణలు తొలగేందుకు మార్గంగా మారతుందని కూడా ఆయన అన్నారు. ఫలితంగా భారతీయ కంపెనీలు అమెరికా మార్కెట్ల కోసం కొత్త కొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థలను అభివృద్ధి చేయగల సత్తా సంపాదిస్తాయని చెప్పారు.

ఆర్టిమిస్ ఒప్పందం ద్వైపాక్షిక ఒప్పందం లేదా ట్రీటీ, ప్యాక్ట్ కాదు. ఆర్టిమిస్ కోసం భారతీయ నైపుణ్యాన్ని, సమాచారాన్ని కూడా కోరడం లేదు. జాబిల్లిపై ఒక స్థావరాన్ని ఏర్పాటు చేయడం ఆర్టిమిస్ లక్ష్యం. కీలక టెక్నాలజీల దిగుమతిపై నియంత్రణలు తొలగించే ప్రస్తావన కూడా ఆర్టిమిస్ ఒప్పందంలో లేదు. నాసా వెబ్‌సైట్‌లో, జూన్ 23 నాటి నాసా పత్రికా ప్రకటనలో ఉన్న సమాచారం ప్రకారం... అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం అన్వేషించడం, ఈ అన్వేషణకు సంబంధించి కొన్ని సాధారణ నియమ నిబంధనలు మాత్రమే ఉన్నాయి. పారదర్శ కత, అంతరిక్షంలో సిబ్బందికి సహకారం, ఖగోళ వస్తువుల నమోదు, శాస్త్ర సమాచారాన్ని విడుదల చేయడం, అంతరిక్ష వారసత్వాన్ని కాపాడటం, సుస్థిర పద్ధతుల్లో అంతరిక్షాన్ని వాడుకోవడం వంటివి. మంత్రి చెప్పిన ప్రకారం, ఒకవేళ నాసా భారత్ సహకారాన్ని కోరుతున్నా... లేక దిగుమతులపై నిబంధనలను సడలించిందన్నా... నైజీరియా, రువాండా, బెహ్రెయిన్, కొలంబియా, ఈక్వడార్ వంటి దేశాలతో కూడా నాసా ఇదే తరహా ఒప్పందాలు చేసుకుంది.



భారతదేశం ఆర్టిమిస్ అకార్డ్‌లో భాగమైన 27వ దేశమన్నది గుర్తుంచుకోవాలి. పైగా ఈ ఒప్పందాలన్నీ స్వచ్ఛందమైనవే. ఆర్టిమిస్ అకార్డ్ ఉద్దేశం బయటకు కనిపిస్తున్న దానికంటే చాలా భిన్నమైంది. అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ మరోసారి అమెరికా ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు దీన్ని సృష్టించిందనాలి. చైనాతోపాటు ప్రైవేట్ అంతరిక్ష కంపెనీలు అనేకం మనుగడలోకి వస్తున్న నేపథ్యంలో ఇలాంటి ఒప్పందం ఒకటి అవసరమైంది. ఈ ఒప్పందాల ద్వారా అంతరిక్ష రంగానికి సంబంధించిన కొత్త నియమ నిబంధనలను రూపొందించేందుకు సిద్ధమవుతోంది. అంతరిక్ష రంగానికి సంబంధించి ఇప్పటికే ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో రూపొందిన చట్టాలు కొన్ని అందుబాటులో ఉన్నాయి. వీటిని ఇప్పుడు ఈ కాలానికి తగ్గట్టుగా మార్చాల్సిన అవసరముంది. ఈ ఉద్దేశాలను ముందుగానే పసిగట్టిన చైనా, రష్యా, జర్మనీ, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ వంటివి ఆర్టిమిస్‌కు దూరంగానే ఉన్న విషయం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

ఆర్టిమిస్ ఒప్పందంలో పదాలను చాలా తెలివిగా ఉపయోగించారు. ఔటర్ స్పేస్ ట్రీటీకి (ఐక్యరాజ్య సమితి సిద్ధం చేసింది. 1967 జనవరి 27వ తేదీ నుంచి దేశాల ఆమోద ముద్రను ఆహ్వానిస్తున్నది) కట్టుబడి ఉండటం ఎంత ముఖ్యమో చెబుతూనే కొన్ని కొత్త విషయాలను ఇందులోకి చేర్చారు. ఈ ఒప్పందంలో వ్యోమగాముల రక్షణ వంటి విషయాల్లో ఐక్యరాజ్య సమితి ఒప్పందంతోపాటు ఖగోళ వస్తువుల వల్ల కలిగే నష్టానికి బాధ్యులపై 1972లో కుదిరిన అంతర్జాతీయ ఒప్పందానికీ కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. కానీ... ఆర్టిమిస్‌లో అంతరిక్ష వారసత్వాన్ని కాపాడటం, సహజ వనరుల వినియోగానికి సురక్షిత ప్రాంతాల ఏర్పాటు (ఐక్యరాజ్య సమితి ఒప్పందాలకు భిన్నంగా) వంటి ఆలోచనలను జొప్పించారు. ఆర్టిమిస్ అకార్డ్ భవిష్యత్తులో ఐక్యరాజ్య సమితి అభివృద్ధి చేసే అంతరిక్ష ఒడంబడికలోని ప్రధాన అంశాలపై ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు ఉద్దేశించినట్టుగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే బహుముఖీన సిద్ధాంతాలను తోసిరాజన్నారు. భారత్ ఇవేవీ ఆలోచించకుండా దౌత్యపరమైన వలలో చిక్కుకుంది. దేశీయంగా ఎలాంటి చర్చ జరపకుండా, అంతరిక్ష చట్టం ఏదీ చేయకుండా 'ఊ' కొట్టేసింది.

అమెరికాతో కుదిరిన అంతరిక్ష ఒప్పందాల్లో ఇంకోటి వచ్చే ఏడాది నాసా భారతీయ వ్యోమగామిని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపడం. ఇది కూడా చాలా చిత్రమైందనే చెప్పాలి. ఎందుకంటే మానవ సహిత అంతరిక్ష ప్రయోగాల కోసం భారత్ ఇప్పటికే ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. నలుగురు వ్యోమగాములు రష్యాలో శిక్షణ కూడా పొందుతున్నారు. అమెరికా, రష్యా సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మన వ్యోమగాములను పంపాలని అనుకుని ఉంటే ఆ పని 'ఇస్రో' ఎప్పుడో చేసి ఉండేది. ఎందుకు చేయలేదంటే, మానవుడిని అంతరిక్షంలోకి పంపటం ఇస్రో ప్రాథమ్యం కాదు కాబట్టి! అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తోంది. ఇప్పటివరకూ 21 దేశాలకు చెందిన 269 మంది వ్యోమగాములు అక్కడికి వెళ్లారు. అమెరికా, యూరోపియన్ దేశాలను మినహాయించినా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, మలేసియా వ్యోమగాములు కూడా ఇక్కడకు వెళ్లారన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలకు భారత్ సొంతంగా సిద్ధమవుతున్న తరుణంలో ఇక్కడికి వ్యోమగామిని పంపేందుకు తొందర పడటం ఎందుకు? భారత్ స్వాతంత్య్రం సాధించి 75 ఏళ్లు అయ్యే సమయానికి భారతీయ వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశిస్తారని ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా 2018లో ప్రకటించారు. ఈ అతిశయోక్తి హామీ నెరవేరలేదు. అందుకే దానికొక అల్ప ప్రత్యామ్నాయంగా, పరువు దక్కించుకోవడానికి బహుశా ఇలా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వ్యోమగామిని పంపనున్నారు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇలాగా న్యాయం?



నిందితుడి ఇంటిని కూల్చేయడం, బాధితుడి కాళ్లు కడగటం... అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశంలో న్యాయాన్ని అందించే మార్గం ఇది కాదు. (మూత్ర విసర్జన బాధిత గిరిజనుడి కాళ్లను మధ్య ప్రదేశ్ సీఎం కడిగిన నేపథ్యంలో.)

– వైష్ణా రాయ్, సంపాదకురాలు

కరుణ నేర్చారు!



మా అమ్మాయి క్రిస్టియన్ కాన్వెంట్ స్కూల్లో చదువుకుంది. పాఠశాలకు సొంత చర్చ్ ఉండేది. ప్రతిరోజూ ప్రార్థన తప్పనిసరి. సనాతన ముస్లిం కుటుంబాల పిల్లలు కూడా ఇతర సమాజాల వారితో పాటు చదివేవారు. అయినా ఎవరైనా క్రైస్తవ మతంలోకి మారినట్టుగా ఎప్పుడూ వినలేదు. వాళ్లు అక్కడ కరుణ, మానవత్వం నేర్చుకున్నారు.

– రెజీనా సుల్తానా, యాక్టివిస్ట్

ఘోరమైన వేదిక



జుక్ (మార్క్ జుకర్‌బర్గ్) చెప్పింది నిజమే. ట్విట్టర్‌లో ఉన్న మనుమలు మరీ అల్పులు. సామాజిక మాధ్యమాల్లో జనాలు ఎలా ప్రవర్తిస్తారనేది వారికి ఇస్తున్న ప్రోత్సాహాన్ని బట్టి ఉంటుంది. ఘోరమైన మాటలు మాట్లాడే ఘోరమైన మనుషులకు ప్రతిఫలం దక్కేలా ట్విట్టర్ డిజైన్ ఉంది.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్

ఎలాంటి నమూనా?



భారత్ 70% నిర్మాణ ఖర్చులను భరిస్తుంది. కానీ మైక్రాన్ కంపెనీ 100 శాతం ప్లాంటుకు యజమానిగా ఉంటుంది. కుతూహలం పుట్టించే వ్యాపార నమూనా! (గుజరాత్‌లో రానున్న మైక్రాన్ చిప్ కంపెనీకి స్పందన.)

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

చేదు నిజం



నేను గౌరవించే ప్రతి ఒక్కరూ యుద్ధంలో ఉక్రెయిన్ గెలవకూడదని యూఎస్ కోరుకుంటోందని అంటున్నారు. ఇప్పటికే యూఎస్, రష్యాల మధ్య శాంతి ఒప్పంద రూపకల్పన కోసం పైస్థాయిలో రహస్య మంతనాలు జరిగాయని అంటున్నారు.

– బ్రూనో మక్యూస్, రచయిత

నిర్మాణం బాగుంటేనే సరా?

అభిప్రాయం



అవిజిత్ పాఠక్

ఒక విస్మయం గొలిపే దాన్ని చూసినప్పుడు దాని ప్రభావానికి లోనవ్వడం ఎప్పుడూ సులువే. అందుకే సామాజిక – ఆర్థిక అంతరాలు పెచ్చుమీరినా మన దేశంలో నూతన పార్లమెంట్ భవనం ఆవిష్కరణను చాలామంది ఆసక్తిగా వీక్షించారు. అత్యంత నాటకీయంగా మత సంబంధ ప్రతీకలతో ఈ భవన ఆవిష్కరణ నాటకం సాగింది. ఈ ఘట్టాన్ని నరేంద్ర మోదీ పట్టాభిషేకం అన్నా తప్పులేదు. అయితే ఈ భ్రమాత్మక రాజకీయాలను దాటుకుని చూడగలిగే వాళ్లు కీలకమైన ప్రశ్నలు సంధించాల్సి ఉంది. వీరు ఈ వ్యక్తిపూజ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఏమాత్రం ఇనుమడింపజేసేది కాదన్న అత్యంత విస్పష్టమైన సత్యాన్ని ప్రజలకు వివరించాలి. అంతేకాదు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిని దేశానికి 'ఆపద్బాంధవుడు' అన్న రీతిలో చూపడం ప్రమాదకరం కూడా. ఆ మాటకొస్తే పార్లమెంట్ భవనం ఓ ఆర్కిటెక్చర్ అద్భుతం కావచ్చు. అలాగని 'ప్రభుత్వాధినేత' తాలూకూ గర్వానికి అది కారణం కారాదు.

పార్లమెంటున్నది చర్చలు, వాదోపవాదాల కోసమే. ఇతరుల మాటలు వినడం, వినమ్రంగా వ్యవహరించడం, పూర్తి సమచారంతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిర్ణయాలు బాధ్యతాయుతంగా తీసుకోవడం, నైతిక బాధ్యతలను నిర్వహించడం, ప్రజలకు నిబద్ధులై ఉండటం... ఇవీ ప్రజాస్వామ్య లక్షణాలు. కాబట్టి మనకు ఒక కొత్త పార్లమెంట్ భవనం ఉన్నంతమాత్రాన ప్రజాస్వామ్య విలువలన్నీ పునరుద్ధరింపబడినట్లు కాదు.

కులం, మతం వంటి వాటిని రాజకీయాల కోసం వాడుకునే సంకుచితత్వం, నేరచరితులు నేతలుగా ఎన్నికవడం, ఘర్షణలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, సర్జికల్ స్ట్రైక్స్‌ను ధీరోదాత్తతతో కూడిన మాస్టర్ స్ట్రోక్స్‌గా అభివర్ణిస్తూండటం... అది కూడా ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సాగుతూండటం ఈ సందర్భంగా గమనార్హం.

ఎన్నికల కమిషన్, సీబీఐ వంటి సంస్థల విశ్వసనీయత రోజులతో పాటే కరిగిపోతోంది. రాజకీయ ప్రమేయాలతో నియామకాలు జరుగుతూండడంతో ఈ వ్యవస్థల స్వాతంత్ర్యమూ కుంచించుకుపోతోంది. ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు పార్టీ ఫిరాయింపులే ఆచరణీయమైన వ్యూహాలుగా మారిపోతున్నాయి. ఆంతరాత్మ లేని, అంగట్లో వస్తువుల చందంగా అమ్ముడు పోయేందుకు సిద్ధంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు అన్నిచోట్ల కనిపిస్తున్నారిప్పుడు. ఈ ధోరణులన్నీ సర్వసాధారణమైపోతున్న ఈ తరుణంలో మనం ఎన్నికలతో కూడిన ఏకవ్యక్తి పాలనవైపు అడుగులేస్తున్నామంటే కాదనడం సాధ్యమేనా?



కొత్తగా కట్టిన పార్లమెంట్ భవనం భవ్యమైందే. కానీ సమస్య దాని భవ్యత్వంలో లేదు. ఆ భవనం భౌతిక గోడలను దాటుకుని అసలైన ప్రజాస్వామ్య సంస్కృతిని అలవర్చుకోవడం సాధ్యమేనా అన్నది ప్రశ్నించుకోవాలి. అర్థవంతమైన విద్య, సోషలిజం, అన్నివర్గాల వారికీ చోటు కల్పించే రాజకీయాలు, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించడం వీలవుతుందా? దేశంలో రాజకీయపరమైన ప్రజాస్వామ్యం పరిఢ విల్లడానికి ప్రజాస్వామ్యయుతమైన విద్య అవసరం. కొంచెం సింపుల్‌గా చెప్పుకోవాలంటే... నిర్దిష్ట నైపుణ్యాలను నిత్యం పెంపొందిస్తూండటం. ఈ నైపుణ్యా లేమిటంటారా? ఆధిపత్యం, తిరోగమన సిద్ధాంతాలను నిశితంగా విశ్లేషించగల, విచారించగల సామర్థ్యం! సత్యమనే ప్రకాశాన్ని అధికారమనే కృత్రిమ ధగధగల నుంచి వేరుగా చూడగల మేధోపరమైన స్పష్టత! స్పష్టమైన అవగాహనతో చర్చ చేయడం, సంవాదంతో ఘర్షణలకు పరిష్కారాలు కనుక్కోవడం. పూర్తి అవగాహన కలిగి ఉన్న పౌరులుగా ఉండేందుకు నిత్యం ప్రయత్నం చేయడం. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలా కాకుండా ఇప్పుడున్న తీరుగానే నియో లిబరలిజమ్ ప్రవచనాలు కొనసాగితే... అవి మనల్ని స్వార్థపరమైన వినియోగదారులుగా మార్చేస్తాయి. మతోన్మాదం, ఛాందసవాదం/మితిమీరిన జాతీయవాదం మన ఆలోచనలను ఆక్రమించేస్తే ప్రజాస్వామ్యయుతమైన విద్యను పెంపొందించడం దాదాపు అసాధ్యం.

ఈ నేపథ్యంలో చూస్తే ఉదారవాదం, రాజకీయ చైతన్యం ప్రస్ఫుటంగా ఉన్న విశ్వవిద్యాలయాలపై దాడులు పెరిగిపోవడం ఆశ్చర్యమేమీ కలిగించదు. విద్యా సంస్థలు, విద్యా కేంద్రాల మార్కెటీకరణ జరుగుతున్న నేపథ్యంలో విమర్శనాత్మకమైన విద్యాబోధన కూడా తక్కువవుతోంది. ఇప్పుడున్న వ్యూహకర్తల ఏకైక లక్ష్యం... యువ విద్యార్థులకు 'మంచి ప్లేస్‌మెంట్', 'మంచి ప్యాకేజీ' ఆశ చూపడం మాత్రమే అనిపిస్తుంది. ఫలితంగా ఏర్పడ్డ మేధో శూన్యత పెత్తందారీ పద్ధతులు పెరిగిపోయేందుకు కారణమవుతోంది.

మీరు, నేను అన్ని రకాల టెక్నికల్ నైపుణ్యాలనూ అందిపుచ్చుకోవచ్చు. అన్ని రకాల పరీక్షలూ పాసైపోవచ్చు. మన సీవీలను డిగ్రీ, డిప్లొమాలతో అలంకరించుకోవచ్చు. అయితే స్వాతిశయ లక్షణాలున్న వాక్చాతురులను ఆరాధిస్తూనే... ఆదివాసీలు, దళితులు, మైనార్టీల హక్కుల కోసం పోరాడుతున్న వారిపట్ల కొంత గౌరవమూ చూపవచ్చు. అలాగే ఓ భారీ విగ్రహం, లేదా ఓ భవ్యమైన దేవాలయం, దూసుకెళ్లే రైలు, స్మార్ట్ సిటీలే అభివృద్ధని చంకలు గుద్దుకోనూ వచ్చు. బహుశా కొత్త పార్లమెంట్ భవనం కూడా ఈ కోవలోకే చేరుతుందేమో. పెత్తందారులకు ఇంతకంటే కావాల్సిన విషయం ఇంకోటి ఉండదు కూడా!

వ్యాసకర్త సోషియాలజిస్ట్

వాన జల్లు గురుస్త లేదు గని...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. ఎప్పటి తీర్గనే గా దినం ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ. పొద్దు మీకంగనే మా దోస్తులందరు పాన్ డబ్బ కాడ జమైతరు. సిగిలేట్లు దాక్కుంట పాన్లు దినుకుంట ముచ్చట బెడుతుంటరు. గా దాని మీద గీ దాని మీద అనకుంట అన్నిటి మీద గాల్లు మాట్లాడుతుంటరు. గని ఎక్వ రాజకీయాల మీద ముచ్చట బెడుతుంటరు. రాజకీయాల మీద ముచ్చట బెట్టుకుంట నువ్వెంత అంటె నువ్వెంత అనుకుంట మాటలతోనే కొట్లాడుతుంటరు.

''సిటింగ్లందర్కి టికిట్ ఇచ్చే సవాల్ లేదని ముఖ్యమంత్రి అనంగనే ఒక మంత్రి ఏం జేసిండో ఎర్కేనా?'' అని యాద్గిరి అన్నడు.

''ఏం జేసిండు?'' అని సత్నారి అడిగిండు.

''గాయిన ఇల్లు వాస్తు ప్రకారం మంచిగున్నదో లేదో సూబెట్టుకుండు. సగం ఇల్లు కూలగొట్టి మల్ల గట్టిండు.''

''వాస్తు ప్రకారం ఇల్లు మంచిగుంటె ఎమ్మెల్యే టికిట్ వొస్తదా?''

''వొస్తదనే గాయిన అనుకుంటున్నడు... ఆదిలాబాద్ జిల్లల ఒక ఎమ్మెల్యే ఏం జేసిండంటె...'' అని యాద్గిరి ఏమో జెప్పబోతుంటె అడ్డం దల్గి – ''ఏం జేసిండు?'' అని సత్నారి అడిగిండు.

''టికెట్ ప్రాప్తి యాగం జేసిండు.''

''వరంగల్ జిల్లల కొంత మంది ఎమ్మెల్యేలకు టికిట్ రాదని ఎర్క గాంగనే గాల్లు ఏం జేసింద్రు?''

''శని దేవునికి పూజలు జేసింద్రు.''

''మనిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ రాజినామ జేస్తనన్నడు. రాజినామ కాయితంను గూడ రడీ జేసిండు. గాని రాజినామ జెయ్యలేదు.'' ''గాయిన రాజినామ డ్రామ ఆడిండు'' అని ఇస్తారి అన్నడు.

''గదెట్ల?''

''రాజినామ కాయితంను గవర్నర్‌కు ఇయ్యకుంట ఒక ఆడామెకు ఇచ్చిండు. గామె గా కాయితంను చింపేసింది. పానం కన్న ముఖ్యమంత్రి కుర్సీ ఎక్వ గదా! గా దాన్ని గాయిన ఎట్ల ఇడుస్తడు?''

''ఇంతకు ముందు వాడకట్టుల తిరిగేటి కూరగాయిల బండాయన టమాటలు, ఎర్ర ఎర్రని టమాటలు అని వొర్లెటోడు. గిప్పుడు ఏమంటున్నడో ఎర్కేనా?''

''ఏమంటున్నడు?''

''టమాటలు కొనెటోల్లు ఉంటె రాంగ్రి అని అంటున్నడు.''



''పెండ్లిల టమాట కూర లేదని జెప్పి ఒకడు పెండ్లి క్యాన్సిల్ జేస్కుండు. కట్నం కింద రొండు బస్తల టమాటలు గుద్క ఇయ్యాలని కొందరు అడిగింద్రు.''

''టమాట దొంగలను జేల్ల బెట్టబట్టింద్రు.''

''పట్నంల కటౌట్లు, ఫ్లెక్సి రాజకీయాలు షురువైనయి.''

''పట్నంల ఫ్లెక్సిలు పెట్టొద్దు గదా!''

''పెట్టొద్దు అంటె ఎవరింటరు. అన్ని పార్టీల లీడర్లు ఫ్లెక్సిలు పెట్టిపిస్తనే ఉన్నరు. ఎవలి కటౌట్లు, ఫ్లెక్సిలు ఎక్వ ఉంటె గాల్లకు ఎక్వ బలమున్నట్లు లెక్క.''

''గాయినయి ఎన్ని కటౌట్లు, ఫ్లెక్సిలు ఉన్నయో లెక్క బెట్టుకుంట ఒక లీడర్ బోబట్టిండు. గప్పుడు ఏమైందో ఎర్కేనా?''

''ఏమైంది?''

''ఒక కటౌట్ గూలి గాయిన మీద బడ్డది.''

''ఖమ్మంల కాంగ్రెస్ జనగర్జన సబ అయ్యింది. గా దాన్కి రాహుల్ గాంధి వొచ్చిండు. పెద్ద స్టేజ్ గట్టింద్రు. గా దాని మీద రొండు వందల మంది లీడర్లు గూసుంద్రు.''

''గంత మంది గూసుండుడెందుకు?''

''అందరం ఒక్కటే అని జెప్పెతందుకు. రాహుల్ గాంధికి ఒక పక్క పొంగులేటి గూసుంటె, ఇంకొక పక్క భట్టి గూసున్నడు.''

''రేవంత్ ఏం జేసిండు?''

''లీడర్ల బుజాల మీద చేతు లేసి రాహుల్ తోని కండ్వలు గప్పిచ్చిండు.''

''రాహుల్ హిందిల మాట్లాడిండు. గాయిన హిందిల మాట్లాడింది ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలుగుల జెప్పిండు.''

''రాహుల్ ఒకటంటె ఉత్తమ్ ఇంకొకటి జెప్పిండట గదా?''

''అవ్ మా సర్కార్ వొస్తె గిరిజనులకు పోడు బూములిస్తమని రాహుల్ అంటె, పోడు బూములు ఇచ్చేసినమని ఉత్తమ్ అన్నడు...''

''రాహుల్ మాట్లాడుకుంట చేయూత పద్కం కింద ఫించిన్‌ను నాలుగు వేల రూపాయలకు పెంచుతమని అన్నడు'' అని సత్నారి అంటె – ''వాన జల్లు కురుస్త లేదు. లీడర్ల వరాల జల్లు కురుస్తున్నది'' అని యాద్గిరి అన్నడు.

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.చవితి ఉ.8.10 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.5.09 వరకు, తదుపరి శతభిషం తె.4.02 వరకు (తెల్లవారితే శనివారం), **వర్జ్యం:** ప.12.20 నుండి 1.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.11 నుండి 9.03 వరకు, తదుపరి ప. 12.31 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** రా.9.17 నుండి 10.45 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.35.

అడవి చింత.. చారెడంత!

రాళ్లను తలపించేలా గింజలు

కరీంనగర్‌లో విక్రయిస్తున్న ఛత్తీస్‌గఢ్ గిరిజనులు





సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అరే.. చింతగింజలు ఏమిటి ఇంత భారీ సైజులో కనిపిస్తున్నాయని ఆశ్చర్యపోతున్నారా.. కానీ ఇవి చింతగింజలు కాదు.. అచ్చం వాటిని పోలినట్లు ఉండే అడవి చింత గింజలు! మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని అడవుల్లో పెరిగే ఓ భారీ తీగ జాతి మొక్క నుంచి వీటిని సేకరిస్తారు. ఈ మొక్క కాండం చాలా పొడవుగా ఉంటుంది. దీని కాయలు సుమారు 4–5 అడుగుల వరకు పెరుగుతాయి. అచ్చం చింతకాయలను పోలి ఉండటంతో వీటిని ఆయా రాష్ట్రాల సరిహద్దులో ఉండే తెలుగువారు అడవిచింత గింజలుగా పిలుస్తున్నారు. ఈ గింజలను కరీంనగర్‌లోని పలు కూడళ్ల వద్ద ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గిరిజనులు ఒక్కోటి సుమారు రూ. 30 వరకు విక్రయిస్తున్నారు. ఈ గింజల్లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయని... పచ్చకామెర్లు, పంటినొప్పి, కీళ్ల నొప్పులను తగ్గించే గుణం వీటికి ఉందని చెబుతున్నారు. ఈ చింతగింజల నుంచి తీసిన నూనెను ఏదైనా గానుగ నూనెతో కలిపి కీళ్లనొప్పులకు మర్దన చేస్తే నొప్పులు తగ్గుతాయని అంటున్నారు.

దట్టమైన అడవిలోనే పెరుగుతాయి

“ ఈ అడవిచింత సీసాల్పినేసి కుటుంబపు మొక్క. దీని శాస్త్రీయ నామం ఎంటాడా పరిసేత. అధిక వర్షపాతంగల దట్టమైన అడవుల్లో పెరిగే ఔషధ మొక్క. ఈ తీగజాతి నుంచి గుత్తులు గుత్తులుగా చింతపండు ఆకారంలో వచ్చే పొడవైన కాయల నుంచి గింజలను గిరిజనులు సేకరిస్తారు. తెలంగాణలో ఇలాంటి తీగజాతులు ఎక్కడాలేవు. ఏపీలోని తలకోన, శేషాచలం అడవులు, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలు వాటికి అనుకూలం.

– డాక్టర్ నరసింహమూర్తి, శాతవాహన యూనివర్సిటీ



హైదరాబాద్‌లోనే ఇంత దయనీయమా?

- నౌబత్ పహాడ్ మహిళల సమస్యలపై నివేదిక సమర్పించండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోనే ఉన్న నౌబత్ పహాడ్‌లో నివసించే నిరుపేద మహిళల పరిస్థితి ఇంత దారుణంగా ఉందా? అక్కడి ప్రస్తుత పరిస్థితిపై స్టేటస్ రిపోర్టు సమర్పించండి అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేర కు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 8కి వాయిదా వేసింది. మహానగరం చెంతనే ఉన్నా.. కనీస సౌకర్యాలు లేక మహిళలు దీన స్థితిలో బతుకుతున్నారని, బహిర్భూమికి సూర్యోదయానికి ముందే చుట్టూ ఉన్న కొండల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని.. మరుగుదొడ్లు కూడా లేక దయనీయంగా బతుకు వెళ్లదీస్తున్నారని పేర్కొంటూ ఓ పత్రికలో కథనం ప్రచు రితమైంది. దీనిపై జస్టిస్ వినోద్‌కుమార్ రాసిన లేఖను హైకోర్టు టేకెన్ అప్ పిల్‌గా విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

‘పాన్ ఇండియా’ కావాలనేదే లక్ష్యం!

- వరంగల్ నుంచి 13 రాష్ట్రాలకు వస్త్రవ్యాపారం విస్తరణ
- రూ.లక్షల నుంచి రూ.850 కోట్లకు చేరిన టర్నోవర్
- త్వరలో బెంగళూరు, చెన్నైకు ‘మాంగళ్య’దుకాణాల విస్తరణ
- ‘సాక్షి’తో ప్రముఖ వస్త్రవ్యాపారి కాసం ఓం నమశ్శివాయ



సాక్షిప్రతినిధి, వరంగల్: కాసం ఓంనమశ్శివాయ... వస్త్ర వ్యాపార రంగంలో పరిచయం అవసరం లేని పేరు. వరంగల్ పరిసర ప్రాంతాల్లో ఈ పేరే ఒక బ్రాండ్. అయితే.. ఒకప్పుడు వరంగల్‌కే పరిమితమైన వ్యాపారం 13 రాష్ట్రాలకు విస్తరించింది. రూ.10 లక్షలున్న టర్నోవర్ ఇప్పుడు రూ.850 కోట్లు దాటింది. వస్త్ర వ్యాపార రంగంలో దూసుకెళ్లి ‘‘పాన్(ప్రెజన్స్ అక్రాస్ నేషన్) ఇండియా’’కావాలనేది ఆయన లక్ష్యం. ఈ మేరకు గురువారం ఆయన ‘సాక్షి’తో ప్రత్యేకంగా మాట్లాడారు. మా నాన్న కాసం పుల్లయ్య 1951 నుంచి 1986 వరకు వరంగల్ బట్టలబజార్‌లో షాపు నడిపారు. ఆ కాలంలో 150–200 గ్రామాల ప్రజలతో సంబంధాలు ఉండేవి. నాన్న మరణించిన అనంతరం అన్న మల్లికార్జున్, తమ్ముళ్లు కేదారినాథ్, శివప్రసాద్‌లతో కలిసి బట్టల షాపు నడిపాం. 1996 నుంచి 2008 వరకు ‘కాసం సెలెక్షన్స్’, ‘సెనెట్’‘సావనీర్’, ‘కాసం బ్రదర్స్’, 2011లో ‘కాసం హోం వరల్డ్ (ఫర్నిచర్)’లను నెలకొల్పాం. కేసీఆర్ జన్మదినం 2012 ఫిబ్రవరి 17న మా బావ పీఎన్ మూర్తి, వారి కుమారుడు పుల్లూరు అరుణ్‌తో కలిసి మొదలెట్టిన ‘మాంగళ్య’విజయవంతంగా కొనసాగుతోంది.

100 ‘ది స్వయంవర్’ ఫ్రాంచైజీ లక్ష్యం

వ్యాపార రంగంలో 28 ఏళ్ల అనుభవం గడించాకే మెట్రోపాలిటిన్ సిటీలలో సంస్థలు నెలకొల్పాం. వరంగల్‌కే పరిమితమైన మా వ్యాపారం ‘ది స్వయంవర్’ఫ్రాంచైజీల ద్వారా 2015 నాటికి 13 రాష్ట్రాలకు విస్తరించాం. 2023 డిసెంబర్ నాటికి దుకాణాలను 100కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. హైదరాబాద్‌లో 2019లో అడుగుపెట్టాం. ‘మాంగళ్య’పేరిట మొత్తం దేశంలోని 15 ప్రాంతాలలో ప్రారంభించాం. ఈ నెల 12న సూర్యాపేటలో ప్రారంభించనున్నాం. వస్త్రవ్యాపార రంగంలో వరంగల్‌ను నంబర్‌వన్‌గా నిలిపాం. పోటీగా నిలిచే సంస్థలు మా దరిదాపుల్లో లేవు. త్వరలోనే బెంగళూరు, చెన్నైలలో ఏర్పాటు చేయాలని ప్రణాళిక తయారు చేస్తున్నాం. పాన్ ఇండియా స్థాయిలో తమ సంస్థలు నిలుస్తాయి.

తూకంతో బట్టలమ్మే ప్రయోగం మాదే...

మా షాపుల్లో ప్రవేశపెట్టిన అనేక కొత్త కొత్త స్కీములను చాలామంది కాపీ కొట్టారు. కిలోల వారీగా తూకం వేయడం మొదలుకుని ‘టన్నుల కొద్దీ సరుకు’ అంటూ విక్రయించాం. రూపాయికి చీర విక్రయించిన రోజులున్నాయి. ముంబై, ఢిల్లీ, సూరత్, ధర్మవరం ప్రాంతాల్లో ఖాయిలాపడ్డ పరిశ్రమలను లీజుకు తీసుకుని అక్కడ తయారైన ఉత్పత్తులను అదే ధరకు అమ్మే ప్రయత్నం చేశాం. సుమారు 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించాం.

‘రియల్ ఎస్టేట్’ సమస్యలు పరిష్కరిస్తాం

- సీఎస్ శాంతికుమారి
- రియల్ ఎస్టేట్ సంఘాల ప్రతినిధులతో సీఎస్ భేటీ
- సమస్యలు వివరించిన ప్రతినిధులు



సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిష్కరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి హామీ ఇచ్చారు. నిర్మాణరంగం విస్తరణకు అవరోధంగా ఉన్న అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఆమె చెప్పారు. గురువారం రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు సచివాలయంలో సీఎస్ శాంతికుమారి అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. క్రెడాయ్, నారెడ్కో, తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్, తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, కమర్షియల్ ట్యాక్స్, కార్మిక శాఖల ఉన్నతాధికారులు సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను త్వరగా పరిష్కరించడానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఆయా సంఘాల సభ్యులు సీఎస్ ను కోరారు. ప్రస్తుత మాస్టర్‌ప్లాన్‌లోని కొన్ని అంశాలు రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని తెలిపారు. కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే వరకు మున్సిపల్ శాఖలో కమిటీ వేసి ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌లోని ఆ అంశాలను మార్చాలని, ఇతర పరిశ్రమల మాదిరిగానే నిర్మాణ స్థలంలో తాత్కాలిక వాటర్ కనెక్షన్ కూడా ఇవ్వాలని ప్రతినిధులు సూచించారు. భవన నిర్మాణ అనుమతితో పాటు టీఎస్‌బీపాస్ కింద బోర్‌వెల్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా, భవన నిర్మాణానికి తాత్కాలిక విద్యుత్ కనెక్షన్‌ను కూడా టీఎస్‌బీపాస్ దరఖాస్తులో భాగంగా ఇవ్వాలని కోరారు. అలాగే సందేహాలను పరిష్కరించడానికి జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కార్యాలయాలలో సాంకేతిక హెల్ప్ డెస్కలను ఏర్పాటు చేయాలని ప్రతినిధులు కోరారు.

బిల్డర్లు సహకరించాలి..: రాష్ట్రంలో మంచి పర్యావరణ పరిరక్షణకు బిల్డర్లు ప్రభుత్వంతో కలసి పనిచేయాలని శాంతికుమారి కోరారు. రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు. సమావేశంలో టీఎస్ రెరా చైర్మన్ ఎన్.సత్యనారాయణ, సీసీఎల్‌ఏ కమిషనర్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, వాటర్ వర్క్స్ ఎండీ దానకిషోర్, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ నీతూప్రసాద్ పాల్గొన్నారు.

తల్లి వదిలేస్తే.. తండ్రే సంరక్షకుడు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: జన్మనిచ్చిన తల్లి పిల్లలను వదిలేస్తే.. తండ్రే సంరక్షకుడు అవుతాడని హైకోర్టు పేర్కొంది. ఆయనకు పిల్లలపై హక్కులుంటాయని వ్యాఖ్యానించింది. పంజాబ్‌లోని మొహాలీకి చెందిన సచిన్‌కుమార్ యాదవ్, హైదరాబాద్‌కు చెందిన ముస్లిం మహిళ సైదా సరన్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సైదా తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌కు తీసుకొచ్చి తిరిగి పంపలేదు. దీంతో తన భార్యను అప్పగించాలని సచిన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అయితే భార్య తరఫు వారు ఆమెను పంపేందుకు అంగీకరించలేదు. దీంతో దంపతులు విడాకులు తీసుకున్నారు. ఇదిలా ఉండగా, తాను కుమారుడిని పెంచలేనని సైదా సరన్.. హైదరాబాద్ అమీర్‌పేట లోని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారికి బాబును అప్పగించారు. ఇది తెలిసిన సచిన్ తన కుమారుడిని తనకు అప్పగించేలా ఆ అధికారికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. తల్లి పూర్తిగా వదిలేసినప్పుడు సహజ సంరక్షకుడైన తండ్రికే బాలుడిని అప్పగించాలని అధికారులను ఆదేశించింది.

ఏడాది చివరినాటికి 300 మెగావాట్ల సోలార్ విద్యుత్

- 4 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలి
- వచ్చే ఏడాది రెండోదశలో 240 మెగావాట్ల విద్యుత్: సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్



గోదావరిఖని: 300 మెగావాట్ల సోలార్ విద్యుత్ సామర్థ్యం లక్ష్యంగా సింగరేణి ముందుకు సాగుతోంది. ఈ ఏడాది చివరి నాటికి సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచు కోవాలని చూస్తోంది. మొదటిదశలో మిగిలిన 76 మెగావా ట్ల ప్లాంట్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో జరిగిన సింగరేణి థర్మల్, సోలార్ విద్యుత్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలిదశలో 300 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించగా.. వీటిలో 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సహా మొత్తం 224 మెగావాట్ల ప్లాంట్ల నిర్మాణం పూర్తయి ఉత్పత్తి జరుగుతోందన్నారు. మిగిలిన 76 మెగావాట్లను ఈ ఏడాది నవంబర్‌లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెన్నూరులో చేపట్టనున్న 11 మెగావాట్లు, కొత్తగూడెంలో 10.5 మెగావాట్ల ప్లాంట్లను సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలన్నారు. రామగుండం ఓసీపీ –1 ఓబీ డంప్‌యార్డుపై 22 మెగావాట్ల ప్లాంటు అక్టోబర్ లోగా, కొత్తగూడెంలో చేపట్టే 22.5 మెగావాట్ల ప్లాంట్‌ను నవంబర్‌లోగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్టీపీపీ జలాశయంలో చేపట్టనున్న 15 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలా ర్‌లో ఇప్పటికే 5 మెగావాట్లు పూర్తి కాగా.. మిగిలిన 10 మెగావాట్లను ఈ డిసెంబర్‌లోగా పూర్తి చేయాలన్నారు.

రెండోదశలో 240 మెగావాట్లు..: 2024–25 నాటికి సింగరేణి సంస్థాగత ఇంధన అవసరాల ను సోలార్ విద్యుత్ ద్వారా తీర్చుకోవడం ద్వారా నెట్ జీరో కంపెనీగా మారేందుకు వీలుగా రెండోదశలో 240 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించినట్టు శ్రీధర్ వివరించారు.

మహిళా భద్రతపై అవగాహన శిబిరాలు

- సైబర్ నేరాల నియంత్రణపై పాఠశాలల్లో చైతన్య కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: ‘లైగింక వేధింపులు అంటే ఏమిటి..? ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే రక్షణ ఎలా పొందాలి. ఎవరికి ఫిర్యాదు చేయాలి. ఎవరైనా దాడికి దిగితే ఎలా కాపాడుకోవాలి’ తదితర అంశాలపై పిల్లలకు విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించేందుకు రాష్ట్ర మహిళా భద్రత విభాగం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా షీటీమ్ బృందాలతో స్థానిక పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ‘షీటీమ్స్ విధులు ఏమిటి, అవి మనకు ఏవిధంగా అండగా ఉంటాయి. షీటీమ్స్ వాట్సాప్ నంబర్ ఏమిటి’.. అనే ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా ఉండేందుకు ఎలా అప్రమత్తంగా ఉండాలి, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఇతర సోషల్ మీడియా ఖాతాల్లో ప్రైవసీ, సైబర్ నేరగాళ్లకు మన బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, పాన్ కార్డు నంబర్లు, మన ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పవద్దని, డెబిట్, క్రెడిట్ కార్డుల పాస్‌వర్డ్‌లు ఇతరులకు చెప్పకుండా ఉండడం, అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో స్నేహాలకు దూరంగా ఉండడం.. వంటి అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన పెంచేలా ఈ అవగాహన తరగతులలో పోస్టర్లను ప్రదర్శిస్తున్నారు. విద్యార్థులకు ఏ విషయం చెప్పినా వెంటనే అర్థం చేసుకోవడంతోపాటు వాటిని పాటిస్తారని, వారి తల్లిదండ్రులు, బంధువులు, చుట్టుపక్కల వారికి సైతం విద్యార్థుల ద్వారా అవగాహన కల్పించే అవకాశం ఉండడంతో వారికి ఈ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా...

19న అఖిలపక్ష సమావేశం

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 19న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు అఖిలపక్ష భేటీ నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. వర్షాకాల సమావేశాల కోసం అధికార, విపక్షాలు తమ వ్యూహాలు, అస్త్రాలతో సన్నద్ధమవుతున్నాయి.

మణిపూర్‌పై చర్చకు నిరాకరణ..

న్యూఢిల్లీ: మణిపూర్‌లో పరిస్థితులపై చర్చించాలన్న తమ డిమాండ్‌ను కమిటీ చీఫ్ నిరాకరించడంతో హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం నుంచి ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో జైళ్ల సంస్కరణల చర్చించేందుకు ఈ కమిటీ గురువారం భేటీ అయింది. మణిపూర్‌లో పరిస్థితులను నిర్లక్ష్యం చేయజాలమంటూ టీఎంసీ సభ్యుడు డెరెక్ ఓ బ్రియాన్, కాంగ్రెస్‌కు చెందిన దిగ్విజయ్ సింగ్, ప్రదీప్ భట్టాచార్య కమిటీ చీఫ్ బ్రిజ్‌లాల్‌కు ఒక ఉమ్మడి లేఖ అందజేశారు.

దుండగుల కాల్పుల్లో మహిళ మృతి

ఇంఫాల్: మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటన చోటుచేసుకుంది. గురువారం గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. పశ్చిమ ఇంఫాల్ జిల్లా లంఫెల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్వాకీథెల్ మయయి కోయిబిలోని ఓ స్కూల్ వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలు స్థానికంగా ఉండే మానసిక వికలాంగురాలని సమాచారం. ఈ ఘటనపై ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం(ఐటీఎల్ఎఫ్) స్పందించింది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసింది. అదేవిధంగా, కంగ్‌పోక్పి జిల్లా ఫయిలెంగ్ గ్రామంలో తుపాకీ కాల్పులు చోటుచేసుకున్నాయి.

లీవు లేకుండా 74 ఏళ్లుగా ఉద్యోగం..!

వాషింగ్టన్: అమెరికాకు చెందిన ఓ మహిళ ఉద్యోగానికి ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా ఏకంగా 74 ఏళ్లపాటు విధులకు హాజరయ్యారు. మెల్బా మెబానె 16 ఏళ్ల వయసులో 1949లో టైలర్ అనే స్టోర్‌లో ఉద్యోగంలో చేరారు. 1956లో ఆ సంస్థను డిలార్డ్ సొంతం చేసుకుంది. లిఫ్ట్ ఆపరేటర్‌గా జాయినయి దుస్తులు, కాస్మటిక్ విభాగంలో 74 ఏళ్లపాటు పనిచేశారు. 90 ఏళ్ల వయసులో ఇటీవలే రిటైరయ్యారు. ఇప్పుడిక మంచి ఆహారం తీసుకుంటూ, ప్రయాణాలు చేస్తూ విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని అన్నారు.

మన డేటా ఎంత భద్రం?



మనమున్న సైబర్ ప్రపంచంలో అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పౌరుల వ్యక్తిగత గోప్యత ప్రశ్నార్థకంగా మారింది. ఒక యాప్ డౌన్ లోడ్ చేసుకున్నా చాలు మన వ్యక్తిగత సమాచారం బజార్లో పడినట్టే. మెటా, ట్విట్టర్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలతో పాటు ఈ- కామర్స్ సైట్లు పౌరుల వ్యక్తిగత డేటాతో ఆటాడుకుంటున్నాయి. వీటి దూకుడుకు కళ్లెం వేయడానికే ఇప్పుడీ ముసాయిదా బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది.

"డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు-2022"ను (డీపీడీపీ) వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశ పెట్టనున్నారు. ఈ డిజిటల్ ప్రపంచంలో పౌరుల వ్యక్తిగత సమాచారం గోప్యతకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. గత ఆరేళ్లుగా మేధోమథనం సాగించిన కేంద్రం ప్రభుత్వం ఎట్టకేలకు ముసాయిదా బిల్లును రూపొందించింది. గతేడాది నవంబర్‌లో ప్రజలు, సామాజిక సంస్థల అభిప్రాయం కోసం వెలువరించిన ముసాయిదా బిల్లులో అంశాలే ఇంచుమించుగా ఇందులో ఉన్నాయి. అయితే విదేశీ సంస్థలు సమాచార సేకరణలో కొన్ని ఆంక్షల్ని విధించారు.

వ్యక్తిగత డేటా పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ కఠినమైన నిబంధనల్నీ విధిస్తూ ఉంటే మన ప్రభుత్వం 2018 నుంచి ఈ చట్టంపై కసరత్తు చేస్తోంది. వ్యక్తిగత డేటా పరిరక్షణ కోసం ఉద్దేశించిన శ్రీకృష్ణ కమిటీ 2018లో ఒక ముసాయిదా బిల్లు కేంద్రానికి సమర్పించింది. కానీ కేంద్రానికి, దిగ్గజ సామాజిక

గతంలో ఏం జరిగింది?

మాధ్యమ సంస్థలకి మధ్య ఒక అంగీకారం రాలేదు. చివరికి 2019లో ఒక ముసాయిదా బిల్లుని పార్లమెంటులో ప్రవేశపెట్టింది. అయితే ఈ బిల్లులో సమగ్రత లోపించిందని స్వయంగా జస్టిస్ శ్రీకృష్ణ పేర్కొనడం కలకలం రేపింది. డేటా పరిరక్షణ బిల్లు నిబంధనల్ని అతిక్రమించే వారి జాబితా నుంచి ప్రభుత్వం తనని తాను మినహాయించుకోవడంతో దీనిపై తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఆ బిల్లులో 81 సవరణలు చేయాలంటూ పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించడంతో గత ఏడాది ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లును ఉపసంహరించుకుంది.

బిల్లులో ఏముందంటే ?

డీపీడీపీ బిల్లును ఇంకా పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉండడంతో దీని వివరాలను కేంద్రం అత్యంత గోప్యంగా ఉంచింది. అయితే కొన్ని జాతీయ మీడియా కథనాల ప్రకారం నిపుణులు ఆందోళన వ్యక్తం చేసిన కొన్ని వివాదాస్పద అంశాలు అలాగే ఉన్నట్టు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం, దాని అనుబంధ సంస్థలకు విస్తృతమైన మినహాయింపులు ఇవ్వడం, డేటా ప్రొటెక్షన్ బోర్డు పాత్రను గణనీయంగా తగ్గించడం వంటివి ఉన్నట్టు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఇక ప్రభుత్వాధికారులు, ఇతర నాయకులకు సంబంధించిన డేటా కూడా ఈ చట్టం కింద గోప్యంగా ఉంచడం వల్ల సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందనే ఆందోళనలున్నాయి. ఇంకా బిల్లులో ఉన్న అంశాలివే..

- ఆన్‌లైన్ లేదంటే ఆఫ్‌లైన్ ద్వారా సమాచారం సేకరించి డిజిటలైజ్ చేసే పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని పూర్తిగా వారి సమ్మతితో సేకరించాలి. దానిని భద్రంగా ఉంచాల్సిన బాధ్యత ఆ సంస్థలదే. తమ పని పూర్తి కాగానే ఆ సమాచారాన్ని తొలగించాలి.
- మన దేశంలో డిజిటల్ పర్సనల్ డేటాను సేకరించి ప్రాసెస్ చేయవచ్చు. అదే విదేశాల్లో వస్తు, సేవల వినియోగంలో మాత్రం డేటాను సేకరించే అవకాశం ఉంటుంది.
- వివిధ సామాజిక మాధ్యమాలు, ఈ కామర్స్ సంస్థలు, మొబైల్ యాప్స్ జవాబుదారీ తనం పెరిగేలా సేకరించిన సమాచారాన్ని ఎలా భద్రపరుస్తున్నారు, ఏ రకంగా సేకరిస్తున్నారు ? పౌరుల సమాచారాన్ని ఏ రకంగా ఉపయోగిస్తున్నారు ? వంటి ప్రశ్నలకు ఆయా సంస్థలు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది
- ఏదైనా సమాచారం చుట్టూ వివాదం చెలరేగితే కేంద్రం ఏర్పాటు చేయనున్న డేటా ప్రొటెక్షన్ బోర్డు ఆఫ్ ఇండియా వాటిని పరిష్కరిస్తుంది. ఈ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ను కేంద్రమే నియమిస్తుంది.
- పౌరుల వ్యక్తిగత సమాచారం ఉల్లంఘన జరిగితే సదరు కంపెనీలకు అత్యధికంగా రూ.250 కోట్ల జరిమానా విధించవచ్చు.
- ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు వేర్వేరు విధివిధానాలున్నాయి. జాతి భద్రతకు సంబంధించిన అంశాల్లో సమాచార సేకరణపై మినహాయింపులున్నాయి.
- పౌరులు తమ డేటాను వాడుకున్నారని భావిస్తే నష్టపరిహారం కోసం కోర్టుకి ఎక్కొచ్చు. చిన్నారుల వ్యక్తిగత డేటాను సేకరించాల్సి వచ్చినప్పుడు వారి లీగల్ గార్డియన్ అనుమతి తప్పనిసరిగా ఉంటుంది.
- ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే యూరోపియన్ యూనియన్ వంటి దేశాలతో వాణిజ్య లావాదేవీల్లో అత్యంత కీలకం కానుంది.

విదేశాల్లో వ్యక్తిగత గోప్యతకు అత్యంత ప్రాధాన్యం

ప్రపంచంలోని 71% దేశాల్లో వ్యక్తిగత సమాచారం భద్రతపై కఠినమైన చట్టాలే ఉన్నాయి. వాణిజ్యం, అభివృద్ధిపై ఐక్యరాజ్య సమితి సదస్సులో తీసుకున్న నిర్ణయానికనుగుణంగా 194 దేశాల్లోని 137 దేశాలు డేటా పరిరక్షణ కోసం చట్టాలు రూపొందించాయి.

ఆఫ్రికా దేశాల్లో 54గాను 33 దేశాల్లో (61%) డేటా చట్టాలు అమల్లో ఉన్నాయి.

ఆసియా దేశాల్లో ఇది ఇంకా తక్కువగా 57% మాత్రమే ఉంది. 60 దేశాలకు గాను 34 దేశాలు చట్టాలను రూపొందించాయి. ఇక వెనుకబడిన దేశాలు 46కి గాను 22 దేశాల్లో మాత్రమే చట్టాలున్నాయి.



అంతర్జాతీయంగా ఈయూ మోడల్, యూఎస్ మోడల్ చట్టాలే అత్యధికంగా ప్రాచుర్యం పొందాయి. ఈయూ మోడల్‌లో వ్యక్తిగత సమాచార సేకరణ నిబంధనలు అత్యంత కఠినంగా ఉంటాయి. పౌరుల డేటా బయటకు వచ్చిందంటే ఆయా సంస్థలకు భారీగా జరిమానాలు విధిస్తాయి. అత్యధిక దేశాలు ఈ మోడల్‌నే అనుసరిస్తున్నాయి. ఇక అమెరికా మోడల్‌లో డేటా భద్రతని వ్యక్తుల స్వేచ్ఛ పరిరక్షణగా చూస్తారు. ప్రభుత్వాలు కూడా వ్యక్తుల పర్సనల్ స్పేస్‌లోకి వెళ్లవు. వ్యక్తుల డేటా అవసరమైన ప్రతీ సారి వారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

సాక్షి, నేషనల్ డెస్క్

14న చంద్రయాన్-3 ప్రయోగం

- పూర్తయిన రాకెట్ అనుసంధానం
- వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు తరలింపు



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): కీలకమైన చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఈ నెల 14న చేపట్టనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) గురువారం తెలిపింది. మొదటగా ఈ నెల 12న అని ప్రకటించింది. ఆ తర్వాత 13కు వాయిదా వేసింది. తాజాగా, 14న మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగం ఉంటుందని షార్ వర్గాలు ప్రకటించాయి. స్వల్ప సాంకేతిక లోపాలను సరి చేసుకోవడంతో పాటు చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చే సమయంలోనే ప్రయోగిస్తారనే వాదన కూడా ఉంది. 2019లో చంద్రయాన్-2ను కూడా జులై 15న ప్రయోగించారు. షార్‌లోని రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ అనుసంధానం పూర్తి చేసి గురువారం ఉదయాన్నే వ్యాబ్ నుంచి ప్రయోగవేదికకు అనుసంధానించే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. పీఎస్ఎల్వీ రాకెట్‌ను 4 దశల్లో ప్రయోగిస్తే అదే జీఎస్ఎల్వీ రాకెట్‌ను మాత్రం 3 దశల్లోనే ప్రయోగిస్తారు. పీఎస్ఎల్వీ కంటే జీఎస్ఎల్వీ-మార్క్-2 రాకెట్ కొంచెం బరువు ఎక్కువ, 2 వేల కిలోలు బరువున్న ఉపగ్రహాలు తీసుకెళుతుంది. అదే ఎల్వీఎం మార్క్-3 అత్యంత శక్తివంతమై రాకెట్. ఫ్రెంచి గయానా కౌరు అంతరిక్ష కేంద్రం రూపొందించి ఏరియన్-5 రాకెట్ తరహాలో వుంటుంది. మూడు వేలు కిలోల నుంచి 6 వేలు కిలోల బరువైన ఉపగ్రహాలను సునాయాసంగా రోదసీలోకి తీసుకెళ్లగలుగుతుంది. ఈ రాకెట్‌కు అత్యంత శక్తివంతమైన రెండు స్ట్రాపాన్ బూస్టర్లు వుంటాయి. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 200 టన్నుల ఘన ఇంధనం వుంటుంది. మొదటిదశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో వున్న 400 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను పూర్తి చేస్తారు. 110 టన్నుల ద్రవ ఇంధనంతో (ఎల్-110)తో రెండోదశను, 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనం (సీ-25)తో మూడోదశతో ప్రయోగాన్ని పూర్తి చేసేలా ఈ రాకెట్‌ను రూపకల్పన చేశారు. ప్రయోగానికి ముందు తుది విడత మిషన్ సంసిద్ధతా సమావేశాన్ని 11న నిర్వహించనున్నారు. అనంతరం ప్రయోగ సమయాన్ని, కౌంట్‌డౌన్ సమయాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ప్రస్తుతానికి ఈనెల 14న ప్రయోగమని తెలిపారు. ఎల్వీఎం3-ఎం4 రాకెట్ ప్రయోగసమయంలో 640 టన్నులు బరువు కలిగి వుంటుంది. 3,900 కిలోలు బరువు కలిగిన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని నింగివైపు మోసుకెళ్లనుంది. చంద్రయాన్-3 ఉపగ్రహంలో 2,148 కిలోలు బరువు కలిగిన ప్రపోల్షన్ మాడ్యూల్, 1,752 కిలోలు బరువు కలిగిన ల్యాండర్, 26 కిలోలు బరువు కలిగిన రోవర్‌లను అమర్చి పంపుతున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి 60 శాతం పనుల వరకు దేశంలోని 120 ప్రయివేట్ పరిశ్రమల సహకారం తీసుకున్నారు.

ట్విట్టర్‌కు కొత్త సవాల్

- 'థ్రెడ్స్'ను తీసుకువచ్చిన ప్రత్యర్థి మెటా
- మొదటి 7 గంటల్లోనే కోటి మంది సబ్‌స్క్రైబర్లు



లండన్: మైక్రోబ్లాగింగ్ యాప్ ట్విట్టర్‌కు కొత్త సవాల్ ఎదురైంది. దాదాపు ట్విట్టర్ లాంటి ఫీచర్లతోనే ప్రత్యర్థి మెటా సంస్థ థ్రెడ్స్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. బుధవారం రాత్రి యాపిల్, గూగుల్ ఆండ్రాయిడ్ యాప్ స్టోర్స్‌లో థ్రెడ్స్ ఉంచారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్ సహా 100 దేశాల వారికి ఇది అందుబాటులోకి వచ్చింది. ప్రారంభించిన మొదటి ఏడు గంటల్లోనే సుమారు కోటి మంది థ్రెడ్స్‌లో చేరారని మెటా సీఈవో జుకర్‌బర్గ్ ప్రకటించడం గమనార్హం. థ్రెడ్స్‌లో లైక్, రిప్లై వంటి వాటికి ప్రత్యేకంగా బటన్లున్నాయి. ఏ పోస్ట్‌కు ఎన్ని లైక్‌లు, రిప్లైలు వచ్చాయో యూజర్లు తెలుసుకోవచ్చు. ఒక పోస్ట్ 500 క్యారెక్టర్స్‌కు మించి ఉండరాదు. ఇదే ట్విట్టర్‌లో అయితే 280 క్యారెక్టర్లే. ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు తమ అకౌంట్లు, అదే పేర్లతో కొత్త యాప్‌లోనూ కొనసాగవచ్చునని మెటా తెలిపింది. లేకుంటే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను కొత్తగా ప్రారంభించాల్సి ఉంటుందని పేర్కొంది. కాంట్రాక్ట్స్, బ్రౌజింగ్ అండ్ సెర్చ్ హిస్టరీ వంటి సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని థ్రెడ్స్ సేకరిస్తుందని యాప్‌స్టోర్‌లోని సమాచారం చెబుతోంది. థ్రెడ్స్ రాకపై ట్విట్టర్ సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సీ స్పందించారు. దాదాపు అన్ని ఫీచర్లు ట్విట్టర్‌ను కాపీ కొట్టినట్లుగానే ఉన్నాయని వ్యాఖ్యానించారు.

ఎన్సీపీ అధ్యక్షుడిని నేనే

- పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ స్పష్టీకరణ
- నిజానిజాలు త్వరలో బయటపడతాయని వెల్లడి
- ఢిల్లీలో శరద్ పవార్ నేతృత్వంలో వర్కింగ్ కమిటీ సమావేశం



శరద్ పవార్, సుప్రియా సూలేతో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ/ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)పై ఆధిపత్యం కోసం శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాల మధ్య పోరాటం సాగుతోంది. మెజార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు తమతోనే ఉన్నారని, అసలైన పార్టీ తమదేనని ఇరు వర్గాలు తేల్చిచెబుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఢిల్లీలో శరద్ పవార్ నేతృత్వంలో ఎన్సీపీ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఎన్సీపీ అధ్యక్షుడిని తానేనని ఆ పార్టీ వ్యవస్థాపకుడు శరద్ తేల్చిచెప్పారు. ఎన్సీపీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎన్సీపీ తనదేనని అజిత్ పవార్ చెప్పుకోవడంపై స్పందించారు. సీనియర్ నేత ప్రఫుల్ పటేల్, సునీల్ తత్కారే తోపాటు మరో 9 మందిని పార్టీ నుంచి బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఈ సమావేశంలో ఆమోదించారు. వర్కింగ్ కమిటీ సమావేశంలో 8 తీర్మానాలు ఆమోదించామని ఎన్సీపీ సీనియర్ నాయకుడు పి.సి.చాకో చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడాన్ని ఖండిస్తూ తీర్మానాలు ఆమోదించామన్నారు. శరద్ పవార్‌ను ఎన్సీపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నామని తెలిపారు.

ఆ సమావేశానికి చట్టబద్ధత లేదు: అజిత్ పవార్ వర్గం

ఢిల్లీలో జరిగిన ఎన్సీపీ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఎలాంటి చట్టబద్ధత లేదని అజిత్ వర్గం ఒక ప్రకటనలో వెల్లడించింది. జూన్ 30న ఎన్సీపీ జాతీయ అధ్యక్షుడిగా అజిత్ ఎన్నికయ్యారని గుర్తుచేసింది. పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ అనుబంధ విభాగాల ముఖ్యనేతలు, సభ్యులంతా ఆయనకు మద్దతు ఇస్తున్నారని తెలియజేసింది. అసలైన ఎన్సీపీ ఎవరిదన్నది తేల్చడం ఎన్నికల సంఘం పరిధిలో ఉందని, వివాదం తేలేదాకా వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించే అధికారం ఎవరికీ లేదని స్పష్టంచేసింది.

శరద్ పవార్‌తో రాహుల్ గాంధీ భేటీ

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్, సుప్రియా సూలేతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం సమావేశమయ్యారు. ఢిల్లీలో పవార్ నివాసంలో ఈ భేటీ జరిగింది. మహారాష్ట్రలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురూ మాట్లాడుకున్నట్లు సమాచారం. శరద్ పవార్‌కు రాహుల్ మద్దతు ప్రకటించారు.

షిండే వర్గం ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు

శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ

ప్రభుత్వంలో అజిత్ చేరడాన్ని చాలామంది శివసేన(షిండే) ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నారని, వారు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) ముఖ్యనేత, ఎంపీ వినాయక్ రౌత్ గురువారం చెప్పారు. ఎన్సీపీ తిరుగుబాటు ఎమ్మెల్యేలు మంత్రులు కావడం షిండే వర్గం శివసేన ఎమ్మెల్యేలకు ఎంతమాత్రం ఇష్టం లేదని తెలిపారు. అందుకే వారంతా షిండేపై తిరగబడుతున్నారని, తమ పార్టీతో టచ్‌లోకి వచ్చారని పేర్కొన్నారు. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవులు కోల్పోయే అవకాశం ఉన్న ఎమ్మెల్యేల తమ పార్టీలో చేరే అవకాశం ఉందన్నారు. వినాయక్ రౌత్ వ్యాఖ్యలను శివసేన(షిండే) వర్గం ఎమ్మెల్యేల, మంత్రి ఉదయ్ సామంత్ ఖండించారు.



కేరళలో వరద ప్రభావిత ప్రాంతం తిరువళ్లలో వృద్ధుడిని మోసుకొస్తున్న స్థానికులు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరద ముంపునకు గురైన వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రెండు జిల్లాల్లో 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో రెడ్ అలెర్ట్ ప్రకటించారు.

బాధితుడి కాళ్లు కడిగిన మధ్యప్రదేశ్ సీఎం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో గిరిజన యువకుడు దశ్మత్ రావత్‌పై రాజకీయ నేత మూత్ర విసర్జన చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. బాధిత యువకుడికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్ క్షమాపణ చెప్పారు. గురువారం అతడిని రాజధాని భోపాల్‌లోని తన ఇంటికి పిలిపించి, కుర్చీలో కూర్చోబెట్టి కాళ్లు కడిగారు. అనంతరం ఆ నీటిని తన తలపై చల్లుకున్నారు. దశ్మత్ భార్యతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల కింద లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. పేదల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దళిత యువకుడి కాళ్లను ముఖ్యమంత్రి కడగడాన్ని మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు, మాజీ సీఎం కమల్‌నాథ్ ఒక డ్రామాగా కొట్టిపారేశారు.

వాటిల్లో కుల వివక్ష తీవ్రమైన అంశం

ఉన్నత విద్యాసంస్థల్లో కులవివక్ష నిర్మూలనకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని యూజీసీని ప్రశ్నించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై కుల వివక్షను ప్రదర్శించడం అత్యంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అంశమని సుప్రీం కోర్టు పేర్కొంది. కుల వివక్షను రూపుమాపడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో , ఏయే చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారో తెలపాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)ని ఆదేశించింది. కులపరమైన వివక్షను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారన్న ఆరోపణలు వచ్చిన హైదరాబాద్‌కు చెందిన రోహిత్ వేముల, ముంబైకు చెందిన పాయల్ తాడ్వీల తల్లులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎ.ఎస్. బొపన్న, ఎంఎం. సంద్రేశ్‌లతో కూడిన సుప్రీం డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్షపై ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు ఈ వివక్షను పారద్రోలడానికి చేపట్టిన చర్యలేంటో వెల్లడించాలని యూజీసీకి ఆదేశాలు జారీ చేసింది. ''ఇది తీవ్రమైన అంశం. వారి ఆందోళల్ని మీరు ఎలా చూస్తున్నారు ? కులవివక్షకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు చేపట్టారు ? ఈ సమస్య పరిష్కారానికి యూజీసీ నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వారి తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలి. ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి' కోర్టు యూజీసీ తరఫు లాయర్‌కు చెప్పింది. రోహిత్ వేముల, తాడ్వీ తల్లుల తరఫున వాదించిన సీనియర్ అడ్వకేట్ ఇందిర కొడుకు, కూతురిని పోగొట్టుకున్న వారి మనోవేదన తీర్చలేదని అన్నారు. వీరిద్దరే కాకుండా గత ఏడాది కాలంలో మరో ముగ్గురు విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థల్లో కులవివక్షను తట్టుకోలేక నిండు ప్రాణాలను బలి తీసుకున్నారని సుప్రీం దృష్టికి తీసుకువెళ్లారు.

ఆస్ట్రేలియాలో భారతీయ విద్యార్థిని దారుణ హత్య



మెల్‌బోర్న్: 2021లో భారతీయ నర్సింగ్ విద్యార్థినిని మాజీ ప్రియుడి చేతుల్లో దారుణ హత్యకు గురైంది. ఈ కేసును విచారించిన ఆస్ట్రేలియా సుప్రీంకోర్టు ఇది అత్యంత క్రూరమైన నేరంగా పేర్కొంది. దోషికి జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది. భారత్‌కు చెందిన జస్మీన్ కౌర్(21) ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో ఉంటూ చదువుకునేది. ఆమెకు భారత్‌కు చెందిన తారిక్‌జోత్ సింగ్(22)తో స్నేహం ఏర్పడింది. కొన్ని రోజుల తర్వాత అతడి తీరు నచ్చక దూరం పెట్టడంతో తారిక్ ఆమెను వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కక్షగట్టిన తారిక్ 2021 మార్చి 5న ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె నోటికి ప్లాస్టర్ అంటించి, కళ్లకు గంతలు కట్టి, వైర్లతో కాళ్లు చేతులు కట్టేసి స్నేహితుడి కారులో అక్కడికి 400 మైళ్లదూరంలోని ఫ్లిండర్స్ రేంజికి తీసుకెళ్లాడు. ఆమె గొంతుకు గాట్లుపెట్టి గుంత తవ్వి, సజీవంగా ఉండగానే అందులో పాతిపెట్టాడు. ఈ కేసులో కోర్టు తారిక్‌జోత్ సింగ్‌ను దోషిగా నిర్ధారించింది. దర్యాప్తు సంస్థలు సుప్రీంకోర్టుకు బుధవారం అందజేసిన నివేదికలో హత్యకు సంబంధించిన దిగ్భ్రాంతికర విషయాలు వెల్లడయ్యాయి. దోషి తారిక్‌జోత్ సింగ్.. హత్య చేయడమే కాదు, కౌర్‌ను తీవ్ర వేదనను అనుభవించేలా చేశాడని పేర్కొంది. ఇది ప్రతీకారంతో పాల్పడిన అసాధారణ క్రూరమైన చర్య అని తెలిపింది.

ఏడు హైకోర్టులకు నూతన ప్రధాన న్యాయమూర్తులు

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఏడు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఏడుగురి పేర్లను సూచించింది. బాంబే, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఒడిశా, మణిపూర్ హైకోర్టుల్లో ప్రధాన న్యాయమూర్తుల నియామకం కోసం పేర్లను సిఫార్సు చేసింది. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ దేవేంద్ర ఉపాధ్యాయ్‌ను బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని పేర్కొంది. జస్టిస్ సునీతా అగర్వాల్‌ను గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఒడిశా హైకోర్టు సీజేగా జస్టిస్ సుభాశిష్ తాళపత్రను, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్‌ను, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అరాధేను, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆశిష్ దేశాయ్‌ని, మణిపూర్ హైకోర్టు సీజేగా జస్టిస్ సిద్ధార్థ్‌ను నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది.

ఎన్నికల్లో కలసికట్టుగా పోరాటం : సచిన్ పైలెట్



న్యూఢిల్లీ: రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్, అసంతృప్త నేత సచిన్ పైలెట్ మధ్య విభేదాలు రూపుమాపడానికి అధిష్టానం చేసిన ప్రయత్నాలు ఫలించినట్టే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కలసికట్టుగా పోరాటం చేస్తామని సచిన్ పైలెట్ చెప్పారు. రాజస్థాన్‌లో ఎన్నికల సన్నద్ధతపై గురువారం న్యూఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాహుల్‌గాంధీ, ఖర్గే, సచిన్ పైలెట్ ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కాలికి ఫ్రాక్చర్ కావడంతో సీఎం అశోక్ గెహ్లోత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశానికి హాజరయ్యారు.

పన్నీర్ సెల్వం కుమారుడి ఎన్నిక చెల్లదు



సాక్షి, చెన్నై: తమిళనాడులోని తేని లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ ఓపీఎస్ రవీంద్రనాథ్ ఎన్నిక చెల్లదని మద్రాస్ హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఈ తీర్పును 30 రోజులు పెండింగ్‌లో పెడుతూ అప్పీలుకు అవకాశం కల్పించింది. అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ సీఎం పన్నీర్ సెల్వం తనయుడు రవీంద్రనాథ్ 2019 ఎన్నికలలో తేని నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎన్నికల సమయంలో తమిళనాడులో అధికారంలో అన్నాడీఎంకే ఉండటంతో తేని నియోజకవర్గంలో అధికార దుర్వినియోగం, నగదు పంపిణీపై ఆరోపణలొచ్చాయి. ఎన్నికలో ఓటమి పాలైన అభ్యర్థులు ఎవ్వరూ కోర్టును ఆశ్రయించలేదు. కానీ, నియోజకవర్గానికి చెందిన సాధారణ ఓటరు మిలానీ హైకోర్టును ఆశ్రయించారు. తన నియోజకవర్గం నుంచి గెలిచిన రవీంద్రనాథ్ నామినేషన్ దాఖలు మొదలు, ఫలితాల లెక్కింపు వరకు అక్రమాలకు పాల్పడినట్టు ఆధారాలను కోర్టు ముందుంచారు. ప్రమాణ పత్రంలో దాచిపెట్టిన అనేక అంశాలను కోర్టు దృష్టికి తెచ్చారు. ఏడాదిపాటు కేసు విచారణ సాగింది. గురువారం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఆధారాల మేరకు రవీంద్రనాథ్ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చారు. దీంతో ఆయన పదవి కోల్పోయే పరిస్థితి నెలకొంది. చివరకు ఎంపీ తరఫు న్యాయవాదులు గడువు కోరడంతో తీర్పు అమలును 30 రోజులకు వాయిదా వేశారు. ఆలోగా అప్పీలు పిటిషన్ వేసి, స్టే కోరే ప్రయత్నాల్లో రవీంద్రనాథ్ ఉన్నారు.

రష్యాలోనే వాగ్నర్ చీఫ్ ప్రిగోజిన్



మిన్స్క్: రష్యా అధినేత పుతిన్‌పై స్వల్పకాలం తిరుగుబాటు చేసి, పెను సంచలనం సృష్టించిన కిరాయి సైన్యం వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ ప్రస్తుతం రష్యాలోనే ఉన్నారని బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో గురువారం చెప్పారు. ప్రిగోజిన్ ప్రస్తుతం సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో ఆశ్రయం పొందుతున్నాడని తెలిపారు. ఉక్రెయిన్‌లో యుద్ధం కోసం రష్యా ప్రభుత్వం అందజేసిన నగదు, ఆయుధాలను వెనక్కిఇచ్చేసే ప్రయత్నంలో ప్రిగోజిన్ ఉన్నాడని వెల్లడించారు. వాగ్నర్ సైనిక దళాలు వారి క్యాంప్‌ల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ఆయా క్యాంప్‌లు ఎక్కడున్నాయనే విషయం లుకాషెంకో బయటపెట్టలేదు. బెలారస్‌లోని తమ మిలటరీ స్థావరాలను ఉపయోగించుకోవాలని వాగ్నర్ సభ్యులకు సూచించామని, వారు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ సిటీలో ప్రిగోజిన్ నివసిస్తున్నట్లు చెబుతున్న ఓ భవంతి ఫొటోలు, వీడియోలను రష్యా ఆన్‌లైన్ పత్రిక ఫోంటాకా బయటపెట్టింది. అయితే, ప్రిగోజిన్ ప్రస్తుతం రష్యాలోనే ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలేవీ లభించలేదు. పుతిన్ క్షమాభిక్ష పెట్టిన తర్వాత ప్రిగోజిన్ బెలారస్‌కు వెళ్లినట్లు వార్తలు వచ్చాయి.



సాయిచంద్ కుటుంబానికి పరామర్శ

బడంగ్‌పేట్: ఇటీవల మృతి చెందిన సాయిచంద్ కుటుంబాన్ని గురువారం గుర్రంగూడలోని ఆయన నివాసానికి వెళ్లి ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు.



నెత్తురోడిన రహదారులు

నగరంలోని పలు రహదారులు ప్రమాదాలతో నెత్తురోడాయి. వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. -8లో

సమగ్ర దర్యాప్తుతోనే నేరాల నియంత్రణ



నేరాలను అరికట్టడానికి సరైన విధానాలు, సమగ్రమైన, కచ్చితమైన దర్యాప్తు ప్రధానమని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. -8లో

న్యూస్‌రీల్

బాలానగర్ ఫ్లైఓవర్‌కు బాబూ జగ్జీవన్‌రామ్ పేరు

సాక్షి, సిటీబ్యూరో: బాలానగర్ ఫ్లైఓవర్‌కు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఫ్లై ఓవర్‌గా నామకరణం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని అయిన డాక్టర్ జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్మారకార్థం బాలానగర్ ఫ్లైఓవర్‌కు ఆయన పేరు పెట్టారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఒక జీఓను జారీ విడుదల చేసింది. దేశానికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరకాలం గుర్తుండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

10 నుంచి రేషన్ పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: చౌకధరల దుకాణాల ద్వారా ఈ నెల 10 నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కానుంది. సాంకేతిక కారణాలతో ఆలస్యంగా పంపిణీ ప్రారంభిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఇంకా నెల వారీ ఉచిత బియ్యం కోటాపై స్పష్టత రాలేదు. గత కొన్ని నెలలుగా యూనిట్‌కు కేవలం ఆరు కిలోలు మాత్రం అందిస్తున్నారు. జులై నుంచి పెరిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతున్నా.. ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారులు పేర్కొంటున్నారు.

24న తెలంగాణ క్రీడా వేడుకలు



గన్‌ఫౌండ్రీ: ఈ నెల 24న మంత్రి కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని క్రీడా సంఘాల సమన్వయంతో తెలంగాణ క్రీడా వేడుకలను నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ తెలిపారు. గురువారం ఎల్‌బీ స్టేడియంలో వివిధ క్రీడా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడా వేడుకల్లో భాగంగా సైక్లింగ్, రోలర్ స్కేటింగ్, రెజ్లింగ్ వంటి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మల్లారెడ్డి, దత్తాత్రేయ, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మహేందర్, ధర్మేందర్ సింగ్ పాల్గొన్నారు.









ఓ మై ఫ్రెండ్..

ఫర్ యువర్ సేఫ్టీ

జూనోసిస్ డే సందర్భంగా గురువారం నారాయణగూడలోని సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ ఆస్పత్రిలో ఉచిత వ్యాక్సినేషన్‌ను నిర్వహించారు. సుమారు 612 శునకాలకు వ్యాక్సిన్ వేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మధుసూదన్, స్వాతిరెడ్డి, విద్యానంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు. – హిమాయత్‌నగర్

- కంకర తేలిన అంతర్గత రోడ్లు
- కనిపించని మురుగునీటి వ్యవస్థ
- ఇటీవల చెట్ల పొదల్లో కుళ్లిపోయిన స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం
- రాత్రివేళ బయటికి రావాలంటేనే భయం.. భయం..
- లబోదిబోమంటున్న కొనుగోలుదారులు

తిప్పల్ భగాయత్

సమస్యల వలయంలో హెచ్‌ఎండీఏ లేఅవుట్



ఉప్పల్ భగాయత్‌లో చెట్ల పొదలు, చెత్తా చెదారం



ఉప్పల్: పేరు గొప్ప. ఊరు దిబ్బ. అంటే హెచ్‌ఎండీఏ లేఅవుట్ ఉప్పల్ భగాయత్‌ను ఉదాహరణగా చెప్పుకోవాల్సి వస్తుందేమో! ప్రభుత్వ, ప్రైవేట్ భాగసామ్యంతో సరికొత్త తరహాలో నగరంలో అతి పెద్ద లేఅవుట్‌గా రూపుదిద్దుకున్న ఉప్పల్ భగాయత్ ప్రస్తుతం తిప్పల్ భగాయత్‌గా మారింది. కోట్ల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రభుత్వాన్ని నమ్మి కొనుగోలు చేస్తే ఇప్పుడు ఇలా పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమంటున్నారు. రోడ్లు సరిగా లేవు. డ్రైనేజీ వ్యవస్థ లేదు. తాగునీటి సౌకర్యం శూన్యం. వీధి దీపాలు వెలగవు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు.. మట్టి దిబ్బలు.. కంకర తేలిన అంతర్గత రహదారులు.. ఇలా మౌలిక వసతులు లేకపోవడంతో స్థానికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇటీవల ఇక్కడ కుళ్లిపోయిన స్థితిలో ఉన్న శవం బయటపడటం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది.

450 ఎకరాల్లో..

ఉప్పల్ భగాయత్ దాదాపు 830 ఎకరాలు కాగా.. ఇందులో పీపీ ద్వారా రైతుల నుంచి సేకరించిన 450 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ లేఅవుట్ చేసింది. రైతులకు ప్రతి ఎకరాకు వెయ్యి గజాల చొప్పున ఇచ్చే ఒప్పందంతో రూపుదిద్దుకున్న లేఅవుట్ ఒకప్పుడు ప్రతిష్టాత్మకంగా అనిపించేది. ఇప్పుడు గ్రహణం పట్టినట్లుగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డంపింగ్ యార్డుగా..

లేఅవుట్ లోంచి దారి తీయడం వల్ల సెక్యూరిటీ లేకుండాపోయింది. ఉప్పల్ ఏషియన్ థియేటర్ నుంచి నాగోల్ వైపు వెళ్లే వారికి వీలుగా ఉండేలా లేఅవుట్ ద్వారా ట్రాఫిక్‌ను దారి మళ్లించడంతో లోపలికి వచ్చే వారిపై కంట్రోల్ తప్పుతోంది. దీంతో లారీలు, టిప్పర్ల ద్వారా డెబ్రిస్‌ను, చెత్తా చెదారాన్ని తీసుకు వచ్చి ఖాళీ ప్లాట్లలో, రోడ్లపై ఇష్టానుసారంగా డంప్ చేస్తున్నారు.

తాగునీరేది?

హెచ్‌ఎండీ లేఅవుట్‌లో తాగునీటి పైపులైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేసినా ఇంత వరకు నీటి సరఫరా లేకుండాపోయింది. తొమ్మిదేళ్ల క్రితం నిర్మించిన ట్యాంకుల పైపులన్నీ తుప్పుపట్టిపోయాయి. చాలా వరకు అపార్టుమెంట్‌లు, ఇండిపెండెంట్ ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారు నీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

వీధిదీపాల్లేక చీకట్లు..

ప్రధాన రహదారి తప్ప అంతర్గతంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు వెలగడం లేదు. రెండేళ్ల నుంచి వీధి దీపాల కోసం ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ భగాయత్ లేఅవుట్ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. హత్యలు, ఆత్మహత్యలకు, ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తీసుకు వచ్చి కాల్చి వేయడం వంటి ఘటనలకు తావుగా మారింది.

మందుబాబుల అడ్డాగా..

గంజాయి విక్రేతలకు, తాగుబోతులకు అడ్డాగా మారిందని పలువురు వాపోతున్నారు. రాత్రి పూట మందుబాబులు బీరు సీసాలు, మద్యం బాటిళ్లతో విన్యాసాలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే మూకుమ్మడి దాడి చేసి గాయపరుస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోపిడీ దొంగలకు నిలయమైందంటున్నారు. గతంలో పెట్రోలింగ్ చేసే హోంగార్డు సైతం అనుమానాస్పద స్థితిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం గమనార్హం. ఈ కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. తాజాగా ఉప్పల్ భగాయత్‌లోని శిల్పారామం వైపు ఉన్న చెట్ల పొదల్లో గుర్తు తెలియని యువకుడి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభించడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. గంజాయి బ్యాచ్‌లతో ప్రాణాలకు ముప్పు ఉందని స్థానికులు ఉప్పల్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు కూడా చేశారు.

వినతులపై పట్టింపేదీ?

ఉప్పల్ భగాయత్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా పలు దఫాలుగా హెచ్‌ఎండీఏ మంత్రులకు, స్థానిక ఎమ్మెల్యేకు, అధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయింది. ఇంత పెద్ద లేఅవుట్‌ను ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ అధికారులు కేవలం స్థలాలు విక్రయించి సొమ్ము చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, కొన్న వారికి కాని, ఉన్న వారికి లే అవుట్‌లో ఎలాంటి సదుపాయాలు కల్పించడం లేదని వాపోతున్నారు.

అన్నీ సమస్యలే..



ఉప్పల్ భగాయత్ లేఅవుట్ విశాలంగా ఉందని ప్లాట్ కొన్నాం. మంచినీళ్లు లేవు. రోడ్లు బాగాలేవు. రాత్రిళ్లు అత్యవసర సమయాల్లో ఇంట్లో నుంచి బయటకు రావాలన్నా భయం భయంగా ఉంది. సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి.

– తిరుపతి కృష్ణ, ప్లాట్ యజమాని

మౌలిక వసతుల్లేవ్..



హెచ్‌ఎండీఏ అధికారులు స్థానికులతో చెప్పిందొకటి. చేస్తోంది మరోకటి. కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశాం. ఆయన స్పందించినా అధికారులు మాత్రం కదలడం లేదు.

–మేకల మధుసూదన్ రెడ్డి, ఉప్పల్ భగాయత్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్

ప్రతిష్టను దిగజార్చొద్దు..



ఉప్పల్‌లో హెచ్‌ఎండీఏ ప్రతిష్టను దిగజార్చవద్దు. ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకుని వెంటనే మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి. భద్రతా ప్రమాణాలను పాటించాలి. లే అవుట్ చుట్టూ భద్రత ఏర్పాటు చేయాలి. – బండి రామకృష్ణా రెడ్డి, స్థానికుడు

నిరంతర గస్తీ..



ఉప్పల్ భగాయత్‌లో నిరంతరం గస్తీ తిరుగుతున్నాం. చాలా పెద్ద ఓపెన్ స్థలాలు, చెట్ల పొదలు ఉన్నాయి. మందు బాబులపై కేసులు పెట్టాం. బైక్ రేసింగ్ చేసే వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నాం.

– గోవింద్ రెడ్డి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్

ఫ్లైఓవర్లు పదిలమేనా?



పంజగుట్ట ఫ్లై ఓవర్

వీటి నిర్వహణపై పట్టింపు లేదు

- ప్రమాదకరంగా పంజగుట్ట వంతెన అంటూ తాజాగా సోషల్ మీడియాలో వైరల్
- స్ట్రక్చరల్ స్టెబిలిటీ పరీక్షల కోసం..
- జేఎన్‌టీయూను కోరిన జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలోని పలు ఫ్లైఓవర్లను నిర్మించి దశాబ్దాలు దాటినా వాటి స్ట్రక్చరల్ స్టెబిలిటీ గురించి పట్టించుకోవడం లేదు. దీంతో ఎప్పుడు ముప్పు వాటిల్లుతుందోనంటూ నగర పౌరులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా పంజగుట్ట ఫ్లై ఓవర్ పిల్లర్లకు పగుళ్లు ఏర్పడ్డాయంటూ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పరిశీలించిన అధికారులు ప్రమాదమేమీ లేదన్నప్పటికీ, మిగతా వాటి పరిస్థితేమిటన్నది అంతుపట్టడం లేదు. సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కోసం కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వం.. పాత ఫ్లై ఓవర్ల స్టెబిలిటీని కూడా పట్టించుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్మించి వదిలేశారు..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలు నిర్మించిన ఫ్లై ఓవర్లు 30కి పైగా ఉన్నాయి. నిర్మించిన వారే వాటి నిర్వహణను పట్టించుకోవాల్సి ఉన్నప్పటికీ ఆ పని జరగడం లేదు. నగరంలోని ఫ్లై ఓవర్లలో దాదాపు పది ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చి ఇరవయ్యేళ్లు అవుతోంది. అలాంటి వాటిలో బేగంపేట, బషీర్‌బాగ్, తార్నాక, హరిహర కళాభవన్, సీటీఓ, మాసాబ్‌ట్యాంక్ తదితరమైనవి ఉన్నాయి. వీటన్నింటిని కూడా పరిశీలించి మరమ్మతులు చేయాల్సి ఉంది. వీటిలో ఫ్లై ఓవర్లపై పడే గుంతల్ని పూడ్చేందుకు పైపొరలుగా కోటింగ్స్ వేస్తూ పోతుండటంతో కొన్ని ఫ్లై ఓవర్ల మందం ఎంతో ఎత్తు పెరిగిపోయింది. దీంతోనూ ఫ్లైఓవర్లు ప్రమాదకరంగా మారే ప్రమాదముందని నిపుణులు చెబుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేయాల్సిన అవసరముంది. లేని పక్షంలో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..?

రాలిపడిన కాంక్రీటు పెళ్లలు..

పంజగుట్ట ఫ్లైఓవర్‌లోని కొన్ని పిల్లర్ల కాంక్రీటు పెళ్లలు రాలిపోవడాన్ని చూపుతూ సోషల్ మీడియాలో వెల్లువెత్తిన ఫిర్యాదులతో పరిశీలించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రమాదమేమీ లేదని ప్రాథమికంగా గుర్తించారు. పిల్లర్ల అందం కోసం వాటికి అమర్చిన ఫైబర్ బొమ్మల్ని శీతాకాలంలో చలిమంటల కోసం ఫ్లై ఓవర్ కింద నిద్రించే యాచకులు కాల్చడం వల్ల బొమ్మలు దెబ్బతినడంతో పాటు పిల్లర్ల పైభాగం వరకు మసిబారినట్లు చెప్పారు. అంతే తప్ప పిల్లర్లకు ప్రమాదం లేదని తేల్చారు.



ఎందుకైనా మంచిదనే తలంపుతో ఫ్లైఓవర్ స్ట్రక్చరల్ స్టెబిలిటీ పరీక్షలు నిర్వహించాల్సిందిగా జేఎన్‌టీయూ నిపుణులను కోరినట్లు తెలిపారు. నివేదిక అందాక అవసరాన్ని బట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్విట్టర్‌లో ఇది వైరల్‌గా మారడంతో పాటు ఫ్లై ఓవర్‌ను మూసివేసి మరమ్మతులు చేయాలని కూడా కొందరు సూచించారు. రెండేళ్ల క్రితం ఫ్లై ఓవర్‌కు అగ్నిప్రమాదాలు జరిగినా ఆధునీకరించలేదని ఫిర్యాదు చేశారు.

రిహాబిలిటేషన్ అవసరం..

ఫ్లై ఓవర్లు దెబ్బతినడమంటూ ఉండదని, దీర్ఘకాలంలో సాధారణంగా ఫ్లై ఓవర్లలోని గర్డర్స్ ప్రాంతాల్లో కాంక్రీట్ దెబ్బతింటుందని, బేరింగులు అరిగిపోతాయని, ఎక్స్‌పాన్షన్ జాయింట్స్ వదులై బలహీనంగా మారతాయని ఇంజినీరింగ్ నిపుణులు తెలిపారు. ఇంకా స్తంభాల పైభాగాలు (పయర్ క్యాప్స్) తుప్పుపడతాయి. బాక్స్‌గర్డర్స్ ఏటవాలు గోడల్లో పగుళ్లు ఏర్పడతాయి. వాటి బలోపేతానికి మరమ్మతులు అవసరం దాన్నే రిహాబిలిటేషన్ అంటారన్నారు. నిర్మాణం జరిగి ఇరవయ్యేళ్లయ్యాక రిహాబిలిటేషన్ అవసరముంటుందన్నారు.

మిగతా వాటికి మరమ్మతులేవీ?

నగరంలో ఇప్పటి వరకు డబీర్‌పురా, లాలాపేట ఫ్లై ఓవర్లకు మాత్రం మరమ్మతులు చేశారు. మిగతా వాటి గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం అడిక్‌మెట్‌కు రిహాబిలిటేషన్ జరుగుతోందని, బేగంపేట ఫ్లై ఓవర్‌కు కూడా చేయాల్సి ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం, నిర్ణీత వ్యవధుల్లో వీటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ పని జరగడం లేదు. ఒక్కో ఫ్లై ఓవర్‌కు దాదాపు 15–20 స్పాన్‌లుంటాయి. వాటిల్లో ఉండే బేరింగ్‌లను జాకీలు ఏర్పాటు చేసి మార్చాల్సి ఉంటుంది. వాస్తవానికి వీటి నిర్వహణ బాధ్యతలు చూడటంతోపాటు నిర్ణీత వ్యవధుల్లో తగిన మరమ్మతులు చేపట్టేందుకు స్పెషల్ డివిజన్ ఉండాలి. కానీ నగరంలో అది లేదు. జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ విభాగం వీటిపై దృష్టి సారించే పరిస్థితి లేకుండాపోయింది.

రూ. 55,908 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.55,908 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను లీడ్ బ్యాంక్ మేనేజర్ సుబ్రహ్మణ్యం విడుదల చేశారు. గురువారం హరిహర కళాభవన్‌లో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులకు ఎటువంటి జాప్యం లేకుండా రుణ వితరణ చేయడంలో ముందంజలో ఉండాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలోగా గ్రౌండింగ్ చేయించాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులపై ఉందన్నారు. ఆర్‌బీఐ అధికారి డెబోజిత బార్ మాట్లాడుతూ.. గ్రౌడింగ్ వివరాలను ముందస్తుగానే ఎల్డీఎంకు పంపాలని, నిర్దేశించిన సమయంలో గ్రౌండింగ్ పూర్తి చేయాలని బ్యాంకర్లకు సూచించారు. కార్యక్రమంలో నాబార్డ్ అధికారి గౌరీశంకర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి రమేశ్, బ్యాంకర్లు పాల్గొన్నారు.



మద్యం మత్తులో చెరువులో దిగి..

ఒకరి మృతి, మరొకరి గల్లంతు


హైదర్ ఖాద్రీ (ఫైల్)


అంజద్ (ఫైల్)

పహాడీషరీఫ్: మద్యం మత్తులో చెరువులో దిగిన ఇద్దరిలో ఒకరి మృతదేహం లభ్యం కాగా.. మరో యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా అన్సారీ రోడ్డుకు చెందిన మహ్మద్ అహ్మద్ ఖాన్ అతని స్నేహితులు సయ్యద్ సైఫ్ హుస్సేన్ (39), గౌస్ ఖాన్ (38), షైరా (35), మోజియా (35), హైదర్(35), అంజద్(32) మద్యం తాగేందుకు గురువారం కట్ట మైసమ్మ ఆలయ ప్రాంతానికి వచ్చారు. హుస్సేన్, గౌస్ ఖాన్, మోజియా ఒక దగ్గర ఉండగా.. మిగతా నలుగురు కాస్త దూరంగా ఉన్నారు. మద్యం మత్తులో హుస్సేన్, గౌస్ ఖాన్, మోజియా జల్‌పల్లి చెరువులోకి దూకారు. అరుపులు వినిపించడంతో స్నేహితులు అక్కడి చేరుకుని కాపాడేందుకు ప్రయత్నించారు. కర్రలు అందజేయగా షైరా బయటపడ్డాడు. హైదర్, అంజద్ నీట మునిగారు. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలించగా హైదర్ మృతదేహం లభ్యమైంది. అంజద్ కోసం గాలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర దర్యాప్తుతోనే నేరాల నియంత్రణ


మాట్లాడుతున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: భవిష్యత్తులో జరిగే నేరాలను అరికట్టడానికి సరైన విధానాలు, సమగ్ర, ఖచ్చితమైన దర్యాప్తు ప్రధానమని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో గురువారం 'ది నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ యాక్ట్ 1985 ప్రొసీడురల్' హ్యాండ్‌బుక్‌ను పలువురు ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులను దర్యాప్తు చేసే అధికారులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా ఎన్‌డీపీఎస్ యాక్ట్‌కు సంబంధించిన లీగల్ ప్రొవిజన్స్, ఇన్వెస్టిగేషన్ పద్ధతులు, ప్రక్రియలను తెలుసుకునేందుకు ఈ పుస్తకం ఉపకరిస్తుందన్నారు. ఎన్‌డీపీఎస్ సెల్ సైబరాబాద్ సహకారంతో ఈ పుస్తకం కార్యరూపం దాల్చిందన్నారు. సమాజంలో నార్కోటిక్, సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం పెరుగుదల ఆందోళనకరమన్నారు. నిషేధిత డ్రగ్స్ వాడకం వల్ల అనేక దుష్ప్రభావాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా ఇవి మెదడు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తాయన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ యాక్ట్‌ను అతిక్రమించి డ్రగ్స్‌ను వినియోగించే వారిని చట్టం తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. వీరికి జీవిత కాలపు జైలు శిక్ష, డెత్ పెనాల్టీ పడే అవకాశం ఉందన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం తీవ్రత ఉన్నప్పటికీ తాజా కోర్టు తీర్పులు, నియమాలు, పరిశోధనా విధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఈ పుస్తకం రూపకల్పనకు సహకరించిన విశ్రాంత ఎస్పీ ఓఎస్‌డీ సైబరాబాద్ మల్లారెడ్డి, ఏసీపీ ఎస్ రవీందర్, సెంట్రల్ టాక్స్ సూపరింటెండెంట్ రంగధంలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణనాయక్, డీసీపీలు కల్మేశ్వర్ సింగన్వర్, నికితాపంత్, యోగేష్‌గౌతమ్, శిల్పవల్లి, సందీప్, ఏసీపీ నారాయణరెడ్డి, ఓఎస్‌డీ మల్లారెడ్డి, సీఎస్‌ఐటీసీ ఏసీపీ రవీందర ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐరన్ ఓర్ సరఫరా చేస్తానని..

రూ. 6.57 కోట్లు స్వాహా

- సిద్ధార్థ ఇంఫ్లెక్స్ యజమాని సిద్ధార్థ్ రెడ్డి వ్యవహారం
- ఢిల్లీ చెందిన సీపీజీ ఇండియా సంస్థకు భారీ టోకరా
- షిప్‌యార్డ్ డెమరేజ్ చార్జెస్‌గా మరో రూ.1.77 కోట్లు
- కేసు నమోదు చేసిన ఢిల్లీ ఈవోడబ్ల్యూ అధికారులు
- అమీర్‌పేటలోని లీలానగర్ నుంచి నిందితుడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో జరిగిన 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అమీర్‌పేట వాసి, సిద్ధార్థ్ ఇంప్లెక్స్ సంస్థ యజమాని సిద్ధార్థ్ రెడ్డి భారీ స్కామ్‌కు స్కెచ్ వేశాడు. ఢిల్లీకి చెందిన కేర్ ప్రో బయోసైన్స్ (సీపీబీ) ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ముడి ఇనుము సరఫరా చేస్తానంటూ రూ.6.57 కోట్లు తీసుకుని మోసం చేశాడు. ఈ మొత్తాన్ని తన ఎన్నికల ఖర్చు కోసం వాడుకున్నాడు. విశాఖపట్నం పోర్టు నుంచి బొగ్గు తరలించడానికి ఓడను సైతం సిద్ధం చేసుకున్న సీపీబీ సంస్థ డెమరేజ్ చార్జెస్‌గా మరో రూ.1.77 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న ఢిల్లీ ఎకనమికల్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) అధికారులు బుధవారం నిందితుడిని అరెస్టు చేసి తీసుకెళ్లారు. అతను 2014 నుంచి పరారీలో ఉన్నాడని, ఎట్టకేలకు నిఘా ఉంచి పట్టుకున్నామని ఏసీపీ జటా శంకర్ మిశ్రా 'సాక్షి'కి తెలిపారు.

చైనాకు సరఫరా చేయడానికి...

ఢిల్లీలోని నెహ్రూ ప్లేస్ కేంద్రంగా పని చేసే సీపీబీ సంస్థ ఎగుమతులు, దిగుమతుల వ్యాపారం చేస్తుంటుంది. చైనాకు చెందిన ఓ సంస్థకు 50 వేల మెట్రిక్ టన్నుల ముడి ఇనుము సరఫరా చేసే కాంట్రాక్ట్ వీరికి దక్కింది. దీంతో దేశంలోనే పోర్టుల వద్ద ఈ సరుకు తమకు అప్పగించే సంస్థ కోసం సీపీబీ దేశ వ్యాప్తంగా ఆరా తీసింది. ఈ విషయం తెలిసిన సిద్ధార్థ్ రెడ్డి ఢిల్లీ వెళ్లి సీపీబీ యాజమాన్యాన్ని కలిశాడు. విశాఖపట్నం పోర్టు సమీపంలో ఉన్న గోదాములో తమ ముడి ఇనుము సిద్ధంగా ఉందని, దాన్ని సరఫరా చేస్తానంటూ చెప్పాడు. ఈ మేరకు 60 లక్షల డాలర్ల విలువైన కాంట్రాక్టుపై ఈ రెండు సంస్థలు సంతకాలు చేశాయి. సరుకు సరఫరా పూర్తయ్యే వరకు చెల్లుబాటు అయ్యేలా 53 వేల డాలర్లకు సమాన విలువైన బ్యాంక్ గ్యారెంటీని సిద్ధార్థ్ రెడ్డి సీపీబీ సంస్థకు సమర్పించాడు.

తొలి విడతగా రూ.6.57 కోట్లు బదిలీ...

విశాఖపట్నం పోర్టు సమీపంలోని గోదాములో ముడి ఇనుము సిద్ధంగా ఉందని చెప్పిన సిద్ధార్థ్ రెడ్డి దానికి సంబంధించినంటూ కొన్ని బోగస్ ఫొటోలు చూపించాడు. దీంతో పూర్తిగా నమ్మిన సీపీబీ సంస్థ తొలి విడతగా రూ.6.57 కోట్లు హైదరాబాద్‌లోని సిద్ధార్థ్ ఇంప్లెక్స్ సంస్థకు చెందిన ఖాతాలోకి ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసింది. ఐరన్ ఓర్‌ను చైనా తీసుకెళ్లడానికి సీపీబీ సంస్థ ఏర్పాటు చేసుకున్న ఓడ సైతం విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. అయితే సిద్ధార్థ్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చిన సీపీబీ ప్రతినిధులు ఆరా తీయగా అక్కడి గోదాముల్లో ఏదీ సిద్ధార్థ్ ఇంప్లెక్స్‌కు సంబంధించినవి కాదని తేలింది. బాధిత సంస్థ పోర్టు అధికారులకు డిటెన్షన్ అండ్ డెమరేజ్ చార్జెస్ కింద మరో రూ.1.77 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. సమయానికి సరుకు సరఫరా చేయడంతో సీపీబీ సంస్థ విఫలం కావడంతో చైనాకు చెందిన కొనుగోలుదారులు వీరు సమర్పించిన 1.7 లక్షల డాలర్ల బ్యాంక్ గ్యారెంటీని ఎన్‌క్యాష్ చేసుకున్నారు. ఇలా సిద్ధార్థ్ రెడ్డి వల్ల సీపీబీ సంస్థ మొత్తం రూ.9 కోట్లకు పైగా నష్టపోయింది.

ఎన్నికల్లో ఖర్చుపెట్టానని అంగీకారం...

సీపీబీ సంస్థ ఫిర్యాదు మేరకు ఢిల్లీ ఈఓడబ్ల్యూ అధికారులు 2014లోనే కేసు నమోదు చేశారు. సిద్ధార్థ్ రెడ్డికి ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినా అతడి నుంచి స్పందన లేదు. దీంతో ఈఓడబ్ల్యూ ఢిల్లీ కోర్టును ఆశ్రయించి సిద్ధార్థ్‌ను ప్రొక్లెయిమ్డ్ అఫెండర్‌గా మార్చారు. ఇతడి సమాచారం ఇచ్చిన వారికి రూ.50 వేల రివార్డు సైతం ప్రకటించారు. సిద్ధార్థ్ కోసం ముమ్మరంగా గాలించిన ఈఓడబ్ల్యూ అధికారులు ప్రత్యేకంగా ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం నగరంలో నిఘా ఉంచి బుధవారం అమీర్‌పేట లీలానగర్‌లోని అద్దె ఇంటి నుంచి సిద్ధార్థ్‌ను అదుపులోకి తీసుకుంది. ఢిల్లీకి తరలించిన అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

చదివింది 12 వ తరగతే..

ఈఓడబ్ల్యూ విచారణలో సిద్ధార్థ్ తన పూర్వాపరాలు బయటపెట్టాడు. 12వ తరగతి వరకు చదివిన తాను రైల్వే కాంట్రాక్టర్‌గా పని చేసినట్లు తెలిపాడు. చిన్న స్థాయిలో ఐరన్ ఓర్ వ్యాపారం చేస్తూనే రాజకీయాల్లోకి దిగానన్నాడు. సీపీబీ సంస్థ తన సంస్థ ఖాతాలోకి బదిలీ చేసిన మొత్తాన్ని డ్రా చేశానని, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన తాను ఆ ఖర్చుల కోసం డబ్బు వాడుకున్నట్లు తెలిపాడు.

కృష్ణవేణి దొరికింది

- చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిందితుడి అరెస్ట్
- బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన రాచకొండ సీపీ

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ పట్టణం, ఈడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన రాజేశ్వరీ, భరత్ దంపతుల కుమార్తె కృష్ణవేణి (4) కిడ్నాప్ కథ సుఖాంతమైంది. బుధవారం రాత్రి చాక్లెట్ కోసం దుకాణానికి వెళ్లిన చిన్నారి ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లితండ్రులు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. స్థానిక యువకులు అదే ప్రాంతంలోని ఓ సినిమా థియేటర్‌లో పనిచేస్తున్న మతి స్థిమితం లేని వ్యక్తి సురేష్‌పై అనుమానం వ్యక్తం చేశారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు సురేష్, చిన్నారి కృష్ణవేణి ఫొటోలను అన్ని పీఎస్‌లు, చైల్డ్‌వెల్ఫేర్ సంస్థలు, రైల్వే పోలీసులకు పంపారు. మల్కాజ్‌గిరి డీసీపీ జానకి, ఏసీపీ నరేశ్‌రెడ్డి, స్థానిక సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా సురేష్ కృష్ణవేణిని తీసుకెళుతున్నట్లు గుర్తించారు. ఘట్‌కేసర్ నుంచి గూడ్స్ రైలులో ఖాజీపేట్ వెళ్లిన సురేష్ ఏమి చేయాలో తెలియక మరో రైలెక్కి తిరిగి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అప్పటికే సమాచారం అందుకున్న రైల్వే రక్షణ పోలీసులు, చైల్డ్ గైడెన్స్ సెంటర్ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకుని చిన్నారిని తమ రక్షణలోకి తీసుకున్నారు. ఘట్‌కేసర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చిన్నారి ఫొటోను తల్లితండ్రులకు పంపించి సరిచూసుకున్నారు. దీంతో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై అశోక్ సికింద్రాబాద్ వెళ్లి చిన్నారిని తీసుకు వచ్చారు. అనంతరం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ స్వయంగా చిన్నారిని తల్లితండ్రులకు అప్పగించారు.


చిన్నారిని తల్లితండ్రులకు అప్పగిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ జానకి తదితరులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బాలుడి అపహరణ

ఆలస్యంగా వెలుగులోకి..

రాంగోపాల్‌పేట్: సొంతూరికి వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న ఓ దంపతుల 7 నెలల కుమారుడు కిడ్నాప్‌నకు గురైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ చందౌలికి చెందిన పింకీ, అజయ్ పటాన్‌చెరువు ఇస్నాపూర్ వద్ద కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు బాలిక, ముగ్గురు కుమారులు. ఈ నెల 2న వారు సొంతూరికి వెళ్లేందుకు నలుగురు పిల్లలతో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. 5వ తేదీ ఉదయం 3గంటలకు డీడీ ఉపాధ్యాయ జంక్షన్ వెళ్లే ట్రైన్‌లో వారు వెళ్లాల్సి ఉంది. అయితే లాడ్జీలో బస చేసేందుకు డబ్బులు లేకపోవడంతో పార్కింగ్ ప్రాంతంలోనే తలదాచుకుంటున్నారు. ఈ నెల 4న సాయంత్రం అజయ్ మద్యం తాగి రావడంతో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో అజయ్ బ్యాగ్ తీసుకుని తాను తిరిగి ఇస్నాపూర్ వెళతానని బయలుదేరాడు. దీంతో అతడిని వారించేందుకు పింకీ పిల్లలను అక్కడే వదలిపెట్టి అతడి వెంట వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత ఆమె తిరిగి వచ్చి చూడగా వారి కుమారుడు కన్నయ్య(7 నెలలు) కనిపించ లేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె అదే రోజు రాత్రి గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ప్రత్యేక బృందాలతో ఏర్పాటు

గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మురళీధర్ బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సీసీ టీవీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ఓ మహిళ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఆటోలో నాంపల్లి వెళ్లి అక్కడి నుంచి ట్రైన్‌లో చెన్నై వెళ్లినట్లు గుర్తించినట్లు సమాచారం. ఆటోలో వెళ్లిన సదరు మహిళ గూగుల్ పే ద్వారా ఆటో డ్రైవర్‌కు డబ్బు చెల్లించడంతో ఆమె పూర్తి వివరాలు కనుగొన్నట్లు తెలిసింది. ప్రత్యేక బృందాలు చెన్నై వెళ్లి కిడ్నాప్ చేసిన మహిళను గుర్తించేందుకు యత్నిస్తున్నాయి. కాగా సదరు మహిళ ఎగువ మధ్య తరగతికి చెందిన ఉన్నత విద్యావంతురాలై ఉండవచ్చునని భావిస్తున్నారు.

నెత్తురోడిన రహదారులు

నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గురువారం ఆరుగురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఔటర్ రింగ్ రోడ్‌పై డీసీఎం ఢీ కొన్న ఘటనలో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. కుషాయిగూడలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మాదాపూర్‌లో వాటర్ ట్యాంకర్ ఢీ కొని స్విగ్గి డెలివరీ బాయ్ కన్నుమూశాడు. కుత్బుల్లాపూర్ పరిధిలో బైక్‌లు అదుపు తప్పి ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే...

బైక్ అదుపు తప్పి విద్యార్థి...

కుత్బుల్లాపూర్: యాదాద్రి-భువనగిరి జిల్లా జమ్మాపూరం గ్రామానికి చెందిన గువ్వల తుంబితేజ (19) సుచిత్ర సర్కిల్ సమీపంలోని లయోలా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ అల్వాల్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. పార్టీకి వెళ్లిన తుంబితేజ గురువారం తెల్లవారుజామున తన స్నేహితుడైన కొప్పుల వంశీతో బైక్‌పై వస్తుండగా వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తుంబితేజ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వంశీని స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు గుంతలో పడి యువకుడు..

విజయవాడకు చెందిన శీలం చంద్రశేఖర్(33) కొంపల్లిలోని ప్లాట్‌ఫాం-65 రెస్టారెంట్‌లో ట్రాన్స్ టెక్నీషియన్‌గా పని చేస్తూ స్థానికంగా జయభేరి శాతవాహన స్కూల్ సమీపంలో అద్దెకు ఉంటున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కొంపల్లి ఫ్లైఓవర్ సమీపంలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా తీసిన గుంతలో బైక్ పడింది. ఈ ఘటనలో చంద్రశేఖర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి దుర్మరణం

ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం

ఇద్దరు మహిళల దుర్మరణం


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న మల్కాజ్‌గిరి డీసీపీ జానకి


మహిళల మృతదేహాలు

కీసర: కీసర అవుటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్) పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు దుర్మరణం పాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీరంగూడకు చెందిన లింగమ్మ (42),తిరుపతమ్మ(43) తోపాటు మరో ఎనిమిది మంది కూలీలు రింగ్‌రోడ్డుపై పారిశుద్ధ్య పనులు నిర్వహించేవారు. గురువారం సాయంత్రం వారు కీసర మండలం, యాద్గార్‌పల్లి సమీపంలోని అవుటర్ రింగురోడ్డుపై విధులు నిర్వహిస్తున్నారు. లింగమ్మ, తిరుపతమ్మ మంచినీళ్ల కోసం రోడ్డు దాటుతుండగా అదే సమయంలో అతి వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ వారిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వారు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై సమాచారం అందడంతో మల్కాజ్‌గిరి డీసీపీ జానకీ, కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, కీసర సీఐ వెంకటయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. రింగురోడ్డుపై పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ తమకు న్యాయం చేయాలంటూ మృతుల కుటుంబ సభ్యులు అంబెలెన్స్‌ను అడ్డుకుని ఆందోళన చేశారు. దీంతో పోలీసులు మృతుల బంధువుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో వాహనం బోల్తా:

ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే మరో వాహనం బోల్తా పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కట్టెల లోడుతో వస్తున్న వాహనం డ్రైవర్ రింగు రోడ్డుపై జరిగిన ప్రమాదం చూసుకుంటూ వెళుతుండగా డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ఘటనలో స్వల్పగాయాలతో వాహనం డ్రైవర్ బయటపడ్డాడు. రోడ్డు మధ్యలో వాహనంతో పాటు కట్టెలు పడిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిందిది. పోలీసులు కట్టెలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఫ్లెక్సీలు కడుతుండగా..


రామలింగం (ఫైల్)

కుషాయిగూడ: బీజేపీ బహిరంగ సభ ఫ్లెక్సీలు కడుతున్న వారిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏఎస్‌రావునగర్‌లో జరగనున్న బీజేపీ బహిరంగ సభ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున రామలింగం (23) నవీన్, భాస్కర్, రమేష్, కృష్ణ, సుధాకర్ అనే వ్యక్తులు రాధిక చౌరస్తా- సాకేత్ రోడ్డులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. అదే సమయంలో వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఫ్లెక్సీలు బిగిస్తున్న వారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రామలింగం, భాస్కర్, నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రామలింగం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

వాటర్ ట్యాంకర్ ఢీ కొని..

మాదాపూర్: వాటర్ ట్యాంక్ ఢీ కొనడంతో స్విగ్గి డెలివరీ బాయ్ అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై అవినాష్ బాబు కథనం మేరకు.. ఈస్ట్ గోదావరికి చెందిన దుర్గాప్రసాద్(40) నగరానికి వలస వచ్చి స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ మూసాపేట్‌లో నివాసముంటున్నాడు. గురువారం అతను శిల్పారామం నుంచి బైక్‌పై వెళుతుండగా సైబర్‌టవర్ గేట్ వద్ద కూకట్‌పల్లి నుంచి వేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌ను అదుపులో తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

ఈటలకు శుభాకాంక్షలు



శ్రీనగర్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌ను గురువారం ఆ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకురాలు కీర్తిరెడ్డి జూటూరు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం తథ్యమని ఈమె ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు ఫ్యాషన్‌షో

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వ ర్యంలో శారీస్ ఆఫ్ ఇండియా పేరిట ఫ్యాషన్‌షోను శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినయ్‌కుమార్ తెలిపారు. నాణ్యమైన, ఎక్కడా దొరకని బెనారస్ పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా చేనేత కళాకారుల కళా ఉత్పత్తులైన సిల్క్, కాటన్ వస్త్రాలను మోడల్స్ ప్రదర్శిస్తారని తెలిపారు.

అభినందన



బంజారాహిల్స్: ఇన్‌స్పెక్టర్ నుంచి అసిస్టెంట్ కమిషనర్ (ఏసీపీ)గా పదోన్నతి పొందిన సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ సత్తయ్యను గురువారం తెలంగాణ రాష్ట్ర కేజీటు పీజీ ప్రైవేట్ విద్యా సంస్థల జేఏసీ కన్వీనర్, టీ పీసీసీ స్పోక్స్ పర్సన్ గౌరీ సతీష్, రాష్ట్ర ఎంపీటీవో సంఘం అధ్యక్షుడు ఎం.సత్తయ్య అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇనిస్పెక్టర్‌గా ఎన్నో క్లిష్టమైన కేసులు ఛేదించిన సత్తయ్య పదోన్నతి పొందడం ఎంతో సంతోషకరమన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: మహిళలు ఏదో ఒకరంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని, మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుంటుందని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. గురువారం ఎర్రమంజిల్, రామకృష్ణానగర్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించి అనంతరం అందులో రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ వారు ఏర్పాటు చేసిన టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మురళీమోహన్, శ్యామ్‌కుమార్, శ్రీధర్, ఇమామ్, అర్జున్, ఫజల్ పాల్గొన్నారు.

తక్కువ ధరకే వస్తువులు సరఫరా చేస్తానని మోసం

బంజారాహిల్స్: తక్కువ ధరలో వస్తువులు సరఫరా చేస్తానని అడ్వాన్స్ తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూసాపేటకు చెందిన మినాక్షి కోహ్లి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. అదే హాస్టల్ ఉండే హర్షవర్ధన్ పరిచయమయ్యాడు. ఇండియా మార్ట్‌లో పనిచేస్తున్నానని ఇంటికి కావాల్సిన వస్తువులు తక్కువ దరకు ఇప్పిస్తానని నమ్మబలికాడు. నమ్మిన మినాక్షి వాషింగ్ మెషిన్‌తోపాటు పలు వస్తువులు కావాలని చెప్పి తన క్రెడిట్ కార్డు ద్వారా సుమారు రూ. 30 వేలు చెల్లించింది. రోజులు గడుస్తున్నా వస్తువులు చేరలేదు. హర్షవర్ధన్ ముఖం చాటేయడం మొదలు పెట్టాడు. దీంతో ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కంపెనీ రహస్య డాటాతో జియాలజిస్ట్ అదృశ్యం

బంజారాహిల్స్: కంపెనీకి చెందిన రహస్య డాటాను తీసుకొని ఓ జియాలజిస్ట్ కనిపించకుండా పోయాడు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12కు చెందిన బెనిటా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో యాదయ్య అనే వ్యక్తి సీనియర్ జియాలజిస్ట్‌గా ఉద్యోగంలో చేరారు. అతనికి కంపెనీకి సంబంధించిన రహస్య పత్రాలు, మ్యాప్‌లు, ఇతర డాక్యుమెంట్లు ఇచ్చారు. కొద్ది రోజులు బాగానే పనిచేసిన యాదయ్య ఈ యేడాది ఫిబ్రవరి నుంచి కంపెనీకి రావడం మానేశాడు. కంపెనీ ప్రతినిధులు ఫోన్ చేసినా స్పందించలేదు. తాజాగా యాదయ్య ఫోన్ కూడా పనిచేయడం మానేసింది. దీంతో కంపెనీ ప్రతినిధి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు 420 ,408 ఐపీసీ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మందుబాబులకు జైలు శిక్ష

బంజారాహిల్స్: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 22 మంది వాహనదారులను గురువారం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో పీకలదాకా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ గోపాల్, కె.లక్ష్మణ్‌కు రెండు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. మరో ఐదు మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను ఆరు నెలలపాటు సస్పెండ్ చేయడమే కాకుండా జరిమానా విధించారు. మిగతా 15 మందికి రూ. 2100 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం తదితరులు

ఫిలింనగర్: స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా తన పరిపాలనా దక్షతతో అఖండ భారతావనికి విశేష సేవలు అందించిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఖైరతాబాద్ నియోజకవర్గంలో గురువారం వాడవాడలా నిర్వహించారు. ఫిలింనగర్ బీజేఆర్ నగర్‌లోని కొత్త చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మామిడి నర్సింగరావు, నడిమింటి కృష్ణ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం...

లిబర్టీ: దళితుల అభ్యున్నతి.. రిజర్వేషన్ల పరిరక్షణ కోసం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జీవితాంతం పోరాటం చేశారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రైటర్ అయితే డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఫైటర్‌గా నిలిచిపోయారన్నారు. మాజీ ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు

రహమత్‌నగర్ కూడలిలో...

రహమత్‌నగర్: బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా రహమత్‌నగర్ కూడలిలో ఆయన విగ్రహానికి కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ బషీర్ తదితరులు పాల్గొన్నారు. ఎస్పీఆర్ హిల్స్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జె.పి.జ్ఞానేశ్వర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు యాదగిరి, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య నివాళి...

వెంగళరావునగర్: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలు భారతదేశానికి దిక్సూచి లాంటివని, ఆయన అడుగుజాడల్లో నడవడం ఎంతో మంచిదని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం రహమత్‌నగర్ చౌరస్తాలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ దేదీప్య మాట్లాడుతూ... దళితుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ శ్యాంరావు, పవన్ ముదిరాజ్ సత్యనారాయణ, పూజారి బాల్‌రాజ్, కిట్టు, కిశోర్ జీటీఎస్ ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

ఫిలింనగర్: ఉద్యోగం కోసం గాలిస్తున్న ఓ ఇంజనీరింగ్ విద్యార్థికి నకిలీ ఉద్యోగ కల్పన సంస్థ సైబర్ వల విసిరి విడతల వారీగా వేలాది రూపాయలు వసూలు చేసి జేబులు గుల్ల చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... షేక్‌పేట ఓయూ కాలనీ బీమాస్ హోటల్ సమీపంలో నివాసం ఉంటున్న టి.తేజా వీర బ్రహ్మకుమార్ బీటెక్ చదివాడు. గత నెల 27న నౌకరీ ఫాస్ట్ సర్వీసెస్1ఎట్ ఇంజినీరింగ్ డాట్ కామ్ నుంచి తేజకు మెయిల్ వచ్చింది. తాము హెచ్‌సీఎల్ సంస్థలో పైతాన్ డెవలపర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించడంతో పాటు ప్రాసెసింగ్ ఇతర ఫీజుల కింద కొంత సొమ్ము ఖర్చవుతుందని పేర్కొన్నారు. దీంతో వారి మాటలు నమ్మి ఆన్‌లైన్ ఇంటర్వ్యూకు హాజరు కాగా ఈ పోస్టుకు ఎంపికయ్యావని, ఏడాదికి రూ. 4.08 లక్షల ప్యాకేజ్ వస్తుందని తెలిపారు. ఈ మేరకు సదరు సంస్థనుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి ప్రాసెసింగ్ కోసం రూ. 2500 పోన్‌పే ద్వారా చేయించుకున్నాడు. కొద్దిసేపటికే బాండ్ సెక్యూరిటీ, హెచ్ఆర్ ఫీజు, వెబ్‌సైట్ సర్వీసెస్, రిపోర్టింగ్ మేనేజర్స్ చార్జి, బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్ పేర్లతో సుమారు రూ. 85,900 వసూలు చేశారు. అపాయింట్‌మెంట్ లెటర్ త్వరలోనే వస్తుందని చెప్పారు. కాగా శిక్షణ కోసం మరో రూ. 32,500 చెల్లించాలని ఫోన్లు చేస్తుండటంతో అనుమానం వచ్చిన తేజ డబ్బులు చెల్లించలేదు. తాను చెల్లించిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని కోరినా పట్టించుకోకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వినాయకనగర్‌లో విషాదఛాయలు



మృతుడు రాఘవేందర్ (ఫైల్)

ఫిల్మ్‌నగర్: ఫిల్మ్‌నగర్‌లోని వినాయకనగర్ బస్తీకి చెందిన కారు డ్రైవర్ వరికుప్పల రాఘవేందర్ ఆకస్మాత్తుగా మృతిచెందడంతో బస్తీలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కల్వకుర్తి సమీపంలోని దొడ్లపల్లి గ్రామానికి చెందిన జంగయ్య, అలివేలు దంపతులు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి వినాయకనగర్‌లో స్థిరపడ్డారు. వీరి కుమారుడు రాఘవేందర్ గురువారం ఉదయం మరణించడంతో బస్తీవాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ కుటుంబానికి బస్తీలో మంచి పేరు ఉండటం, మృతుడు రాఘవేందర్ స్థానికంగా మంచి పరిచయాలు ఉండటంతో స్థానికులు ఆయన మరణ వార్తను జీర్ణించుకోలేకపోతున్నారు. అంత్యక్రియలు స్వగ్రామంలో జరగగా బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

కింగ్‌కోఠి ఆస్పత్రిలో టీవీ చోరీ

హిమాయత్‌నగర్: నిత్యం రద్దీగా ఉండే కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డులే దొంగల అవతారమెత్తారు. ఆస్పత్రిని కాపాడాల్సిన వారే బయట వ్యక్తితో కలసి చోరీకి పాల్పడ్డారు. ఆస్పత్రిలో పెద్ద టీవీని చోరీని చేశారు. ఆలస్యంగా గుర్తించిన ఆస్పత్రి సిబ్బంది నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలివీ... ఈ నెల 2వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆస్పత్రిలోని ఎంసీహెచ్ భవనంలో ఉన్న 42 ఇంచుల ఎల్‌జీ టీవీ చోరీకి గురైంది. సోమవారం విధులకు హాజరైన నర్సులు ఈ విషయాన్ని గుర్తించి మెటర్నటీ విభాగాధిపతి డాక్టర్ జలజ వెరోనికకు తెలిపారు. దీంతో ఆమె సూపరింటెండెంట్ రాజేంద్రనాథ్‌కు వివరించారు. టీవీ చోరీకి గురైన స్థలంలో ఉన్న సీసీ ఫుటేజీలను జలజ వెరోనిక, రాజేంద్రనాథ్‌లు పరిశీలించారు. ఆ ఫుటేజీల్లో క్లియర్‌గా ఇద్దరు సెక్యూరిటీ గార్డులు బయట వ్యక్తిని పిలిపించి దగ్గర ఉండి మరీ టీవీని ఊడదీపించి పంపించేశారు. ఈ విషయాన్ని ఒప్పుకోవాలని సదరు సెక్యూరిటీ గార్డులను రాజేంద్రనాథ్ నిలదీయగా వారు తాము చోరీ చేయలేదన్నారు. దీంతో నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యూనిఫాం సివిల్ కోడ్ అవసరం లేదు: మాజీ ఎంపీ అజీజ్‌పాషా

పంజగుట్ట: దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో యూనిఫాం సివిల్ కోడ్ అవసరం లేదని మాజీ ఎంపీ అజీజ్‌పాషా పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఎ.సిద్ధిఖీలతో కలిసి ఆయన మాట్లాడుతూ... 2018వ సంవత్సరంలోనే 21వ లా కమిషన్ ఒక కమిటీ వేసి యూనిఫాం సివిల్ కోడ్ అవసరం లేదని చెప్పిందని గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం ఐదు రాష్ట్రాల ఎన్నికలు, వచ్చే సంవత్సరం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు సంపాదించుకునేందుకే ఈ అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చారన్నారు. దేశంలో భిన్న రకాల సంప్రదాయాల వారు ఉంటారని, ఒక్కొక్కరిది ఒక్కో సంప్రదాయం, చట్టం ఉంటుందని అవి కాదని ఒకే చట్టం అంటే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ తాను ముఖ్యమంత్రి కాగానే ముస్లింకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని హామీ ఇచ్చి మరిచిపోయారని వెంటనే ముస్లిలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు

బంజారాహిల్స్: సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా కామారెడ్డి జిల్లా బీబీపేట మండలంలో త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మించాలనే యోచనలో ఉన్నామని ప్రముఖ సంఘ సేవకుడు, బిల్డర్ తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి తెలిపారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 3లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు స్కిల్‌సెంటర్ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. త్వరలోనే పది ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. గతంలో జనగామ గ్రామంలో రూ. 6 కోట్ల వ్యయంతో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలను నిర్మించామని, ప్రస్తుతం రూ. మూడు కోట్ల వ్యయంతో రెండు స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు.

ఓపెన్ ప్లాట్ల పేరుతో మోసం

బంజారాహిల్స్ పోలీసుల కేసు నమోదు

బంజారాహిల్స్: ఓపెన్ ప్లాట్లు విక్రయిస్తామంటూ మోసగించిన సంస్థపై బంజారాహిల్స్ పోలీసులు ఛీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నంబరు 14కు చెందిన సయ్యద్ ఆబిద్ అలీ గతేడాది ఫిబ్రవరి 7న మారియట్ ఇన్‌ఫ్రా అండ్ సర్వీసెస్ రియల్ ఎస్టేట్ సంస్థ జేపీ దర్గా వద్ద మహేష్ విల్లాస్ పేరుతో ఏర్పాటుచేసిన ప్లాట్‌ను రూ. 7.10 లక్షలకు కొనుగోలు చేశారు. ఈ సంస్థ నలుగురు భాగస్వాములతో నడుస్తుంది. తనతోపాటు సభావత్ జాను, రత్లావత్ రమేష్ ఎస్పీటీనగర్ వాసులు సైతం ప్లాట్ల కోసం అడ్వాన్సులు ఇచ్చారని తెలిపారు. అయితే ఈ సంస్థ ప్లాట్లను రిజిస్టర్ చేయకుండా ఇటీవల తాము ఫోన్ చేస్తే స్పందించడం లేదని ఆరోపించారు. అలాగే మారియట్ ఇన్‌ఫ్రా అండ్ సర్వీసెస్ కార్యాలయం ఎత్తివేశారని, దురుద్దేశపూర్వకంగానే ప్లాట్ల పేరుతో డబ్బులు వసూలు చేసి తమను మోసం చేశారని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థ భాగస్వాములు డి. దినకర్, బండి సామేల్, మణిదీప్, సంజులపై ఐపీసీ సెక్షన్ 420, 406, రెడ్ విత్ 34 కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం

బంజారాహిల్స్: మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న బ్యూటీ స్పాపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లో మహి ఆయుర్వేదిక్ బ్యూటీ స్పా సెలూన్ పేరుతో సునీల్‌కుమార్ వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఇక్కడ సోదాలు నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి యువతులను రప్పించి క్రాస్ మసాజ్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నట్లు విచారణలో తేలింది. సునీల్‌కుమార్‌తోపాటు సబ్ ఆర్గనైజర్ ఫర్జానా బేగంపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అలాగే ముగ్గురు విటులను అదుపులోకి తీసుకొన్నారు. సెక్స్ వర్కర్లను పునరావాస కేంద్రానికి తరలించి బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జన్నత్ సెలూన్ అండ్ స్పాపై దాడులు

బంజారాహిల్స్ రోడ్ నంబరు 11లోని ఆర్‌కే రెసిడెన్సీ పెంట్‌హౌజ్‌లో జెన్నత్ సెలూన్ అండ్ స్పా ముసుగులో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. రత్లావత్ విజయ్‌బాబు(28) ఈ స్పాను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వివిధ ప్రాంతాల నుంచి సెక్స్ వర్కర్లు తీసుకొచ్చి తెలిసిన విటులను పిలిపించి స్పా సెంటర్లో వ్యభిచారం చేయిస్తున్నట్లు తేలింది. నిర్వాహకులు విజయ్‌బాబుపై కేసు నమోదు చేశారు.

టాస్క్ పూర్తిచేస్తే డబ్బుస్తామంటూ బురిడీ

ఫిలింనగర్: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారా.. అయితే ఇంట్లోనే ఉంటూ డబ్బులు సంపాదించవచ్చంటూ.. ఓ గృహిణిని నమ్మించి ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే డబ్బులు ఇస్తామంటూ బురిడీ కొట్టించిన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... షేక్‌పేట ఓయూ కాలనీలో నివాసం ఉంటున్న గృహిణి పెంటపాటి లక్ష్మీభార్గవి(32) అనే గృహిణి ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంతో ఏదైనా ఉద్యోగం చేయాలని నిర్ణయించుకుంది. దీనిలో భాగంగా ఆన్‌లైన్లో చూస్తుండగా హర్ష అనే యువతి నుంచి టెలిగ్రామ్ ద్వారా మెసేజ్‌వచ్చింది. తాను ఓ సంస్థలో హెచ్ఆర్ అసిస్టెంట్ నంటూ పరిచయం చేసుకుంది. ఇంట్లోనే ఉంటూ డబ్బులు సంపాదించవచ్చని, శక్తి సూపర్ 188 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తాము ఇచ్చే టాస్క్‌లు పూర్తి చేయడం ద్వారా పెట్టిన డబ్బులకు అదనంగా డబ్బులు సంపాదించవచ్చని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన లక్ష్మీ బార్గవి తెలిసిన వారివద్ద అప్పుచేసి సుమారు రూ. 16 వేలు చెల్లించింది. అయితే ఒకటిరెండు సార్లు కట్టిన డబ్బులు తిరిగి ఇచ్చిన యాప్ నిర్వాహకులు తర్వాత స్పందించడం మానేశారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు గురువారం ఫిలింనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మాజీ మంత్రి డీకే అరుణ కుమార్తె క్రెడిట్ కార్డు చోరీ

బంజారాహిల్స్: నమ్మిన యజమానురాలిని మోసం చేసిన డ్రైవర్ ఆమెకు తెలియకుండా క్రెడిట్ కార్డును చోరీ చేసి డబ్బులు డ్రా చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. వివరాలివీ... మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు డీకే అరుణ కూతురు డీకే శృతిరెడ్డి బంజారాహిల్స్ రోడ్ నంబర్.14లోని ప్రేమ్‌పర్వత్ విల్లాస్‌లో నివసిస్తుంది. గతేడాది డిసెంబర్ నుంచి చిన్నా అలియాస్ కె. బీసన్న ఆమె వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఆమెకు చెందిన క్రెడిట్ కార్డును దొంగిలించి శ్రీమహవీర్ జెమ్స్ అండ్ పెరల్స్‌లో స్వైప్ చేసి రూ. 11 లక్షలు వాడుకున్నాడు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న శృతిరెడ్డి సదరు డ్రైవర్‌ను ప్రశ్నించింది. అబద్ధాలు చెప్పడమే కాకుండా రకరకాల కథలతో ఆమెను నమ్మించాలని చూసినా చివరకు తన క్రెడిట్ కార్డును దొంగిలించి డబ్బు వాడుకున్న విషయం వెల్లడైంది. నిందితుడిపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు చిన్నా అలియాస్ బీసన్నపై ఐపీసీ 420, 408ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించకుంటే సహించం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



సింగాడకుంటవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌రోడ్ నెం 10లోని సింగాడకుంట చోటు బాయ్ గల్లీలో గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్థానిక కార్పొరేటర్ కవిత, జలమండలి బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివకుమార్‌తో కలిసి పర్యటించారు, స్థానికంగా తరచూ మంచినీటి సమస్యలపై ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. మంచినీటి పైప్‌లైన్ సమస్యలు తలెత్తడానికి గల కారణాలపై వెంటనే తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైతే కొత్త పైప్‌లైన్ వేయాలని, దానికోసం ప్రతిపాదనలు రూపొందించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. మరోసారి మంచినీటి సమస్యలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా నాగేందర్ హెచ్చరించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ ప్రజలకు తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని ప్రయత్నిస్తుంటే ఇదేం పద్ధతని ఆగ్రహం వ్యక్తం చేస్తూ... ఇలాంటి పరిస్థితులు పునరావృతం కావొద్దని స్పష్టం చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

శ్రీనగర్‌కాలనీ: దేశంలోనే తెలంగాణలో ఆదర్శంగా షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను సీఎం కేసీఆర్ ప్రజలకు అందిస్తున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో తొమ్మిది మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల చెక్కులను అందించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీత, నేతలు అప్పుఖాన్, తన్నుఖాన్, చిన బాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో సమస్యల పరిష్కారానికి కృషి...

రహమత్‌నగర్: బస్తీల్లో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహమత్‌నగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీవరేజి పైప్‌లైన్ పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... రహమత్‌నగర్ డివిజన్ అభివృద్ధిపై తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నానన్నారు. ఇప్పటికే అంతర్గత రహదారుల నిర్మాణ పనులు దాదాపు పూర్తి అయ్యాయన్నారు. డివిజన్‌లో ప్రతి వీధిలో సీసీ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, నేతలు కాసాల అరుణ్‌కుమార్, డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ బషీర్, కొండాపురం నాగరాజు, నజీర్, గద్దం శ్రీధర్, విజయ్ కిరణ్, రఘు, సుజాత, ప్రవంతి, ఫయాజ్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బంజారాహిల్స్: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం–2 ఇందిరానగర్‌కు చెందిన పలువురు యువకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికీ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ యువత సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని, పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేనన్ని ఉద్యోగ నియామకాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చేపట్టామని గుర్తుచేశారు. యువకులు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పథకాలకు అర్హులైన వారిని గుర్తించి వారిని బాగస్వాములు చేయాలని ఆదేశించారు. ఇందిరానగర్‌లో గతంలో ఎన్నడూ చేయని అభివృద్ధి గత నాలుగేళ్లలో చేశామని దానం నాగేందర్ స్పష్టం చేశారు.

'బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య రహస్య అజెండా'

లిబర్టీ: బీఆర్ఎస్, బీజేపీల మధ్య రహస్య అజెండా పక్కాగా పని చేస్తోందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. ఇరు పార్టీల మధ్య ఆయా పార్టీల రాజకీయ నేతల మధ్య రాజకీయ ఒప్పందం అవగాహన ఉందన్నారు. గురువారం ఏర్పాటు చేసిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ని తొలగించి ఆయన స్థానంలో కిషన్‌రెడ్డిని నియమించడం వెనుక సీఎం కేసీఆర్ కుట్ర దాగుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రధాని, బీజేపీ అధ్యక్షుడిపై ఒత్తిడి తెచ్చి బండి సంజయ్‌ను తొలగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటం చేస్తున్న క్రమంలో రాజకీయ లాభంగా చేసి కిషన్‌రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడంలో కేసీఆర్ పాత్ర ఉందని ధ్వజమెత్తారు. ఆ రెండు పార్టీలు ఒకటేనని పరస్పర అవగాహనతోనే పని చేస్తున్నాయని ప్రజల్లో మాత్రం వ్యతిరేక ఉన్నట్లు నటిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నేతలు గణేష్, సతీష్‌కుమార్, దేవసూరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యం


తెలంగాణ ప్రజల పార్టీ



మాట్లాడుతున్న అధ్యక్షుడు మురళీధర్‌గుప్తా

పంజగుట్ట: ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజల పార్టీ పనిచేస్తుందని పార్టీ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం పంజగుట్టలోని పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన పార్టీ మూడవ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మల్యాల మురళీధర్‌గుప్తాతో కలిసి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... ఇప్పటివరకు చట్టసభల్లో అడుగుపెట్టని వర్గాలకు ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో బంధుప్రీతి, లంచగొండితనం రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే వాటిని పూర్తిగా నిర్మూలిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా మల్యాల మురళీధర్‌గుప్తా, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా టి.శ్యామ్ సుందర్‌రామ్, కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా వై.శివారెడ్డి, సెక్రటరీ జనరల్‌గా సుదర్శన్, ప్రధాన కార్యదర్శులుగా వాసిరెడ్డి, లింగ నాయక్, కోశాధికారిగా మంచిరాల రఘునందన్‌లను ఎన్నుకున్నారు.

ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్ 7 ఏఎస్‌ఓగా సరస్వతి



ఏఎస్‌ఓ సరస్వతిని అభినందిస్తున్న ఉద్యోగులు

బంజారాహిల్స్: పౌరసరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్ 7 సహాయ సరఫరా అధికారిణిగా సరస్వతి నియమితులయ్యారు. ఆమె గురువారం ఆనంద్‌నగర్ కాలనీలోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ సర్కిల్ 9 నుంచి ఆమె ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు సర్కిల్ 7 ఏఎస్‌ఓగా పనిచేసిన చాముండేశ్వరీ దేవిని యాకత్‌పూర సర్కిల్ 2 ఏఎస్‌ఓగా బదిలీ చేశారు.

కుమార్తె ఆచూకీ చెప్పాలని తల్లి వేడుకోలు

పంజగుట్ట: తన కుమార్తె ఆచూకీ తెలుసుకోవాలని లేకపోతే మరో శాలినీ ఉన్నికృష్ణన్ అయ్యే అవకాశం ఉందని ఓ తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు సుమన్ జాదవ్, హైకోర్టు న్యాయవాది మౌనిక సుంకరతో కలిసి మాట్లాడుతూ... తన కూతురు సోనీజాదవ్(21) ఎంబీఏ పూర్తిచేసిందన్నారు. భర్త చనిపోవడంతో చిన్న టిఫిన్ బండి పెట్టుకుని కూతురు, ఇద్దరు కొడుకులను పోషించుకుంటున్నానని తెలిపారు. 10వ తరగతి వరకు కార్వాన్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తన కూతురు సోని చదువుకుందని అప్పుడే అమ్రన్ బేగం అనే మరో యువతితో పరిచయం ఏర్పడి ఇద్దరూ మంచి స్నేహితులుగా ఉండేవారన్నారు. గత నెల 7వ తేదీన అమ్రాన్ బేగం మా ఇంటికి వచ్చి సోనీని తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లిందన్నారు. రాత్రి అయినా రాకపోవడం ఇద్దరికీ ఫోన్ చేసినా స్పందన లేదని.. దీంతో లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. పోలీసులు వెతికి 11వ తేదీన వారిని మెజిస్ట్రేట్ ముందుకు తీసుకువచ్చారని అప్పటివరకు నాకు తెలియదన్న అమ్రాన్ బేగం తన కూతురు సోనీని తీసుకుని న్యాయవాదులను తీసుకుని వచ్చిందన్నారు. సోనీ పోలీసులకు తాను మేజర్‌ను అని సర్టిఫికెట్లు చూపించి తన ఇష్టం ఉన్నచోట ఉంటానని పోలీసులకు చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయిందన్నారు. తాము ఎంతసర్ది చెప్పాలని చూసినా వినిపించుకోకుండా వెళ్లిపోయిందన్నారు. అప్పటి నుంచి తన కూతురు సోనీ ఆచూకీ లేదని, తనకు ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రిలో అడ్మిట్ ఉన్నానని చెప్పినా కనీసం స్పందించడం లేదని, అమ్రన్ బేగం తనకు తెలియదు తన ఇంటికి రావద్దు అని హెచ్చరిస్తుందన్నారు. సోనీ 21 సంవత్సరాలు వచ్చిన రెండు నెలలకే ఈ పనిచేశారని, రెండు నెలల ముందే పాస్‌పోర్టు కూడా తీయించినట్లు తెలిసిందని ప్రస్తుతం తన కూతురు ఎక్కడ.. ఎలా ఉందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తన కూతురు ఆచూకీ తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కత్తితో బెదిరించిన యువకుడికి జైలు శిక్ష

హిమాయత్‌నగర్: నడి రోడ్డుపై చంపేస్తా అంటూ కత్తితో బెదిరించిన యువకుడు కటకటాలా పాలయ్యాడు. సెక్రటరియేట్ (లేక్) పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం ఎంఎస్ మక్తాకు చెందిన అక్బర్ అలియాస్ షోయబ్ హుస్సేన్ అనే యువకుడు సమీపంలోని టీ స్టాల్ వద్ద ఇదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ జుబేర్ అనే యువకుడిని కత్తితో బెదిరించాడు. ఈ కత్తితో చంపేస్తా, నీ అంతు తెలుస్తా అంటూ బెదిరింపులకు దిగడంతో బాధితుడు భయంతో లేక్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు అక్బర్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టారు. గురువారం నిందితుడికి 15 రోజుల న్యాయస్థానం జైలు శిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ బాలాగోపాల్ తెలిపారు.

● ముత్యాలు ధారగా



ఎగువ ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముత్యంధార జలపాతం కనువిందు చేస్తోంది. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధిలోని వీరభద్రవరం సమీప దట్టమైన అటవీ ప్రాంతంలో సుమారు 700 అడుగుల ఎత్తున ఉన్న గుట్టలపై నుంచి ముత్యంధార జలపాతంజాలువారుతూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. గురువారం జలపాతాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలి వచ్చారు. – వెంకటాపురం(కె)

‘ముందస్తు’ మాటే లేదు

ప్రజలు ఐదేళ్లు అధికారం ఇచ్చారు.. చివరిదాకా సేవ చేస్తాం: సజ్జల



సాక్షి, అమరావతి: ఏపీలో ముందస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పునరుద్ఘాటించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ప్రజలు ఐదేళ్లు అధికారం ఇచ్చారని, ప్రజా తీర్పును గౌరవిస్తామని చెప్పారు. షెడ్యూలు ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి కాబట్టి చంద్రబాబుకు కావాల్సినంత సమయం దొరుకుతుందని వ్యాఖ్యానించారు.

సీఎం పర్యటన ఫలితాలు కళ్లెదుటే..

విభజన అంశాలు, ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించేందుకే సీఎం జగన్ ఢిల్లీ పర్యటనలు చేపట్టి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో సమావేశమవుతున్నారు. సీఎం జగన్ భగీరథ ప్రయత్నం వల్లే 2014–15లో రెవెన్యూ లోటు కింద రావాల్సిన రూ.10,421 కోట్లను ఇటీవల కేంద్రం విడుదల చేసింది. పోలవరానికి నిధుల సమస్యపై కూడా కేంద్రం సానుకూలంగా స్పందిస్తోంది. తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలను ఇప్పించాలని కేంద్రాన్ని సీఎం జగన్ గట్టిగా కోరుతున్నారు. సీఎం జగన్ పర్యటన ఫలితాలు కళ్లెదుటే కనిపిస్తున్నా ఓ వర్గం మీడియా ఏదో ఊహించుకుని కథనాలు ప్రచురిస్తోంది.

సానుకూల ఓటుతోనే గెలుస్తాం

నిబద్ధతతో ఏ సంస్థ సర్వే చేసినా అది ప్రజాభిప్రాయాన్ని, వాస్తవాలను ప్రతిబింబిస్తుంది. ఇటీవల టైమ్స్ నౌ–నవభారత్ నిర్వహించిన సర్వే ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని తేల్చింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాభ్యుదయమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారు. 2019 ఎన్నికల తర్వాత జరిగిన స్థానిక సంస్థలు, తిరుపతి లోక్‌సభ, ఆత్మకూరు, బద్వేలు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి రికార్డు విజయాలను ప్రజలు కట్టబెట్టారు. గడప గడపకూ మన ప్రభుత్వం.. స్పందన.. జగనన్నకు చెబుతాం.. సురక్ష లాంటి వరుస కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నాం. ప్రతి చోట మమ్మల్ని ఆదరిస్తున్నారు. సానుకూల ఓటునే సీఎం జగన్ కోరుకుంటున్నారు.

శ్రేణులను కాపాడుకునేందుకే..

ప్రతి ఎన్నికలోనూ ఘోర పరాజయాలతో నైతిక స్థైర్యం కోల్పోయిన టీడీపీ శ్రేణులను కాపాడుకునేందుకు, పవన్ కళ్యాణ్‌ను తన జట్టులో చేర్చుకునేందుకు చంద్రబాబు, ఓ వర్గం మీడియా ముందస్తు ఎన్నికలంటూ హడావుడి చేస్తున్నాయి. ఐదో పదో సీట్లు ఇచ్చి పవన్‌ను తన జట్టులో చేర్చుకునేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేసుకోవచ్చు.

ఇళ్ల నిర్మాణాన్ని కేంద్రం వద్దనలేదు..

అమరావతిలో పేదల ఇళ్లకు కేంద్రం నిధులపై షరతు కొత్తదేమీ కాదు. అది గతంలో కూడా ఉంది. అందుకే మా వాటా నిధులు ఖర్చు చేస్తాం. ఇందులో టీడీపీ, ఓ వర్గం మీడియాకు వచ్చిన అభ్యంతరం ఏమిటో అర్థం కావడం లేదు. పేదలకు ఇళ్లు రాకూడదని కోరుకుంటున్న ఒక చిన్న మైనారిటీ, సంపన్న, ఫ్యూడల్ వర్గాలు మాత్రమే దానికి వ్యతిరేకంగా ఉన్నారు. రామోజీరావు, రాధాకృష్ణ ఎవరి ప్రయోజనం కోసం పని చేస్తున్నారో స్పష్టం అవుతోంది. సీఆర్‌డీఏ చట్టం ప్రకారమే అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చాం. అందులో ప్రభుత్వం ఇళ్లు కూడా కట్టించి ఇస్తుంది. కోర్టు వివాదాలు ముగిశాకే తమ వాటా ఇస్తామని కేంద్రం చెప్పిందేగానీ ఇళ్ల నిర్మాణాన్ని వ్యతిరేకించడం లేదు. సీఎం వైఎస్ జగన్‌కు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో విపక్షం ఇలా కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు.

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ బెంగాల్ పరిసర ప్రాంతాల నుంచి ఉత్తర ఒడిశా వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి.. 1.5 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని ఉత్తర ప్రాంత జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. గురువారం రాష్ట్రంలో 5.6 మిల్లీమీటర్ల సగటున వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 16.2 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావలసి ఉండగా.. 11.11 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 32 శాతం లోటు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

పీవైఎల్ రాష్ట్ర కమిటీ ఎన్నిక



సాగర్, లక్ష్మీనారాయణ

ఇల్లెందు: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర నూతన కమిటీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఇందూరి సాగర్ (నల్లగొండ), కోలా లక్ష్మీనారాయణ (ఖమ్మం) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి.రమేష్ (ఖమ్మం), వనమాల సత్యం (నిజామాబాద్), సహాయ కార్యదర్శులుగా పర్శిక రవి (భద్రాద్రి కొత్తగూడెం), బేజాడి కుమార్, కోశాధికారిగా ధారావత్ రవి (నల్లగొండ)ను ఎన్నుకున్నారు.

‘పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి’

సాక్షి, హైదరాబాద్: పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలంటూ సీపీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే పాత పెన్షన్ సంకల్ప రథయాత్రకు వివిధ సంఘాలు మద్దతు ఇచ్చాయి. అదే విధంగా ఆగస్టు 12న ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మద్దతు తెలిపాయి. హైదరాబాద్‌లో జరిగిన భేటీ అనంతరం సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్‌గౌడ్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మమత, సత్యనారాయణ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, అగ్రికల్చర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానందంగౌడ్, పర్వతరెడ్డి, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌ను కలిసి మద్దతు ఇవ్వాలని సీపీఎస్ యూనియన్ కోరింది.

మోదీ పర్యటనకు పటిష్ట బందోబస్తు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు శాఖ అప్రమత్తత
- ఉన్నతాధికారులతో డీజీపీ అంజనీకుమార్ వీడియోకాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం వరంగల్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు గురువారం ఆయన వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్, జోనల్ ఐజీ, డీఐజీ, ఆపరేషన్స్ అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, ఐజీ షా నవాజ్ ఖాసీంతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాని పర్యటన భద్రతకు సంబంధించి డీజీపీ పలు సూచనలు చేశారు. బందోబస్తు ఏర్పాట్ల నిమిత్తం రెవెన్యూ, రైల్వే, రోడ్లు, భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధాని పర్యటన సాఫీగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని, అదే సమయంలో సామాన్యులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రధాని పర్యటన రూట్, హెలిప్యాడ్, బహిరంగ సభకు వచ్చే వాహనాల పార్కింగ్ అన్ని అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రధాని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకునే మార్గాల్లో పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్లూ బుక్‌లోని నిబంధనలను అనుసరించి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

పంట నష్టపరిహారం రూ.304 కోట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ విన్నపం మేరకు విపత్తుల నిర్వహణ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 22 నుంచి ఏప్రిల్ 27వ తేదీ వరకు రాష్ట్రంలో అకాల వర్షాలు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. చేతికొచ్చిన పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎకరాకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

సీఎం ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పంట నష్టంపై సర్వే చేసిన వ్యవసాయశాఖ రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా 2.79 లక్షల మంది రైతులకు సంబంధించిన 3.04 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తేల్చింది. దీనికి అనుగుణంగా ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ. 304.61 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే ఈ పరిహారం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనుంది.

కమలనాథుల ఘర్షణ

రేవూరి, రాణాప్రతాప్ వర్గీయులు, సీనియర్ల కొట్లాట

నర్సంపేట రూరల్: వరంగల్ జిల్లా నర్సంపేటలో గురువారం సాయంత్రం బీజేపీ నేతలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రాణాప్రతాప్ వర్గీయులు ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి చివరికి కార్యాలయంలోని కుర్చీలు, అద్దాలు ధ్వంసం చేశారు. ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యటన నేపథ్యంలో పార్టీ నర్సంపేట ఇన్‌చార్జ్‌గా మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డిని నియమించారు. మోదీ సభకు జన సమీకరణ, ఇతరత్రా అంశాలపై జితేందర్‌రెడ్డి, వరంగల్ ఉమ్మడి జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కొందరు పార్టీ సీనియర్ నేతలు, రాణా వర్గీయులు కార్యాలయంలోకి చొచ్చుకొచ్చారు. పార్టీలో మాకు సముచిత స్థానం కల్పించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రేవూరి, రాణా వర్గీయుల మధ్య మాటల యుద్ధం జరిగింది. అది కాస్త తారస్థాయికి చేరడంతోమాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అక్కడినుంచి బయటికి వెళ్లిపోయారు. అనంతరం రాణా వర్గం, సీనియర్లు కుర్చీలు విరగ్గొట్టి, అద్దాలు ధ్వంసం చేశారు. దాడిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ తెలిపారు. కాగా, సీనియర్లయిన తమపైనే దాడిచేసి.. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తడక అశోక్, గడ్డం ఆంజనేయులు, గుడిపూడి రాధాకృష్ణ, అశోక్, ఆబోతు రాజు, అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు వరంగల్‌కు ప్రధాని మోదీ

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న పీఎం
- ఉదయం 10–30కి భద్రకాళి ఆలయంలో పూజలు
- 11–45 గంటలకు హనుమకొండలో బహిరంగ సభ



సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, వరంగల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో పాల్గొననున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు, హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. అధికారిక సమాచారం మేరకు ప్రధాని మోదీ పర్యటన వివరాలిలా ఉన్నాయి.

- శనివారం ఉదయం 7–35 గంటలకు వారణాసి ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.
- 9–25 గంటలకు హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 9–30 గంటలకు ఎంఐ–17 హెలికాప్టర్‌లో హకీంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి వరంగల్‌కు బయలుదేరతారు.
- 10–15 గంటలకు మామ్నూర్‌లోని హెలిపాడ్‌కు చేరుకుని, రోడ్డుమార్గాన భద్రకాళి ఆలయానికి బయలుదేరతారు.
- 10–30 గంటల నుంచి 10–50 గంటల వరకు ఆలయంలో పూజల అనంతరం హనుమకొండలోనిఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌కు బయలుదేరతారు.
- 11–00 గంటలకు అక్కడికి చేరుకుని 11–35 గంటల వరకు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 11–40 గంటలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లోని బహిరంగ సభ వేదికకు బయలుదేరి 11–45 గంటలకు అక్కడికి చేరుకుంటారు.
- 11–45 నుంచి 12–20 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు.
- 12–20 నుంచి 12–30 గంటల వరకు విశ్రాంతి. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 12–50 గంటలకు హెలిపాడ్‌కు చేరుకుంటారు.
- 12–55 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 1–40 గంటలకు హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 1–45 గంటలకు ప్రత్యేక విమానంలో రాజస్థాన్‌లోని బికనీర్‌కు వెళతారు.

కాజీపేట వ్యాగన్ల పరిశ్రమ రెండో అతిపెద్దది

- దక్షిణ మధ్య రైల్వే జీఎం ఎ.కె.జైన్
- అయోధ్యాపురంలో రైల్వే వ్యాగన్ పరిశ్రమకు స్థల పరిశీలన

కాజీపేట రూరల్: భారతీయ రైల్వేలోనే రెండో అతిపెద్ద రైల్వే వ్యాగన్ల తయారీ పరిశ్రమ కాజీపేటలో నిర్మాణం కాబోతోందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యాపురం గ్రామశివారులో ఈ నెల 8న ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్న రైల్వే వ్యాగ న్‌ల తయారీ పరిశ్రమస్థలాన్ని, అక్కడ జరుగుతున్న పను లను గురువారం అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వేతోపాటు తెలంగాణలో అతిపెద్ద ప్రాజెక్ట్‌గా కేంద్రం ప్రతిష్టాత్మకంగా ఈ పరిశ్రమను నిర్మిస్తుందన్నారు. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) సంస్థ సహకారంతో రొబొటిక్ సిస్టం ద్వారా నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, రైల్వే వ్యాగన్ల తయారీ పరిశ్రమకు ఈ నెల 8న ప్రధాని నరేంద్రమోదీ ఇక్కడ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. వ్యాగన్‌ల తయారీ పరిశ్రమకు ఆధారంగా వివిధ రకాల రోలింగ్ స్టాక్‌లను ఉత్పత్తి చేస్తుందన్నారు. జిల్లాలో కొత్త పారిశ్రామిక అభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణ వ్యవస్థను ప్రోత్సహిస్తుందని తెలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజల సామాజిక, ఆర్థిక పురోగతికి తోడ్పడుతుందన్నారు. రూ.521 కోట్ల వ్యయంతో 160.4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం కానున్న వ్యాగన్‌ల తయారీ పరిశ్రమలో నెలకు 200 వ్యాగన్ల పీరియాడికల్ ఓవరాయిలింగ్ (పీవోహెచ్) చేసేందుకు వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ మంజూరైందని, సంవత్సరానికి 1,200 వ్యాగన్లు, రెండో సంవత్సరానికి 2,400 వ్యాగన్‌లను ఉత్పత్తి చేస్తుందని వివరించారు. అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణం కానున్న వ్యాగన్‌ల తయారీ పరిశ్రమను 24 నెలల్లోపూర్తి చేసి 2025 సంవత్సరం నాటికి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాగన్‌ల తయారీ పరిశ్రమ వివరాలను దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం ఏకే గుప్తా, ఆర్‌వీఎన్‌ఎల్ సీపీఎం మున్నకుమార్ పాల్గొన్నారు.



అరుణ్‌కుమార్ జైన్

ఇటుకాలపల్లి ఇళ్ల దహనం కేసులో 11 మంది అరెస్ట్

కాజీపేట: ఇటుకాలపల్లిలో ఇళ్లకు నిప్పు పెట్టి దహనం చేసిన కేసులో గ్రామ సర్పంచ్ సహా 11 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ కరుణాకర్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాలపల్లి సర్పంచ్ మండల రవీందర్ కూతురు కావ్య, అదే గ్రామానికి చెందిన జాలిగం రంజిత్ అనే యువకుడు ఇటీవల ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వీరికి కొందరు స్నేహితులు సహకరించారు. దీంతో ఆగ్రహించిన అమ్మాయి బంధువులు ప్రేమపెళ్లికి సహకరించిన ముగ్గురు మిత్రుల ఇళ్లతోపాటు రంజిత్ ఇంటిపై బుధవారం దాడికి పాల్పడి నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సర్పంచ్ మండల రవీందర్‌తోపాటు మొత్తం 11 మందిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, పది సెల్‌ఫోన్లు, రెండు గొడ్డళ్లు, మూడు వేటకొడవళ్లు, కర్రలు, డీజిల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు.

కరెంటు షాక్‌తో రైతు మృతి

శంకరపట్నం: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌తో ఓ రైతు (72) మరణించాడు. గ్రామానికి చెందిన గడ్డం ఓదెలు– మల్లమ్మ దంపతులు గురువారం తమ వ్యవసాయభూమి వద్దకు వెళ్లారు. మల్లమ్మ బెండ విత్తనాలు విత్తుతోంది. వ్యవసాయబావి మోటారు పైపులీకేజీ ఉందని మరమ్మతు చేసేందుకు ఓదెలు బావివద్దకు వెళ్లాడు. మరమ్మతు చేస్తుండగానే విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. భార్య, కుమారుడు బావివద్దకు వెళ్లి చూడగా ఓదెలు విగతజీవిగా పడిఉన్నాడు.

తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్ అరధే

▶ మొదటి పేజీ తరువాయి

సిఫార్సు చేస్తున్నట్లు తెలిపింది. అదే సమయంలో ఫిబ్రవరి 9న జస్టిస్ ఠాకూర్‌ను మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలన్న సిఫార్సును రద్దు చేసినట్లు వివరించింది.

జస్టిస్ అలోక్ నేపథ్యం ఇదీ..

జస్టిస్ అలోక్ అరధే 1964 ఏప్రిల్ 13న మధ్యప్రదేశ్‌లోని రాయ్‌పూర్‌లో జన్మించారు. బీఎస్సీ ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన జస్టిస్ అలోక్... 1988 జూలై 12న మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. మధ్యప్రదేశ్ హైకోర్టులో రాజ్యాంగం, మధ్యవర్తిత్వం, కంపెనీ చట్టాలకు సంబంధించిన కేసులను వాదించడంలో పేరుగాంచారు. 2009 డిసెంబర్ 29న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011 ఫిబ్రవరి 15న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2016 సెప్టెంబర్ 20న జమ్మూకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. 2018 మే 11న జమ్మూకశ్మీర్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అనంతరం కర్ణాటకకు బదిలీ అయిన జస్టిస్ అలోక్... 2018 నవంబర్ 17న న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2022 జూలై 3 నుంచి అక్టోబర్ 14 వరకు కర్ణాటక హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. మాతృ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తి కావడం, న్యాయమూర్తిగా 13 ఏళ్ల సుదీర్ఘ అనుభవం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించేందుకు జస్టిస్ అలోక్ అరధేకు ఉపకరిస్తుందని కొలీజియం పేర్కొంది. కేంద్రం ఆమోదముద్ర పొంది ప్రస్తుత హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేశాక జస్టిస్ అలోక్ కొత్త సీజేగా, తెలంగాణ హైకోర్టు ఐదవ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరిస్తారు.

జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేపథ్యం ఇదీ..


జమ్మూకశ్మీర్‌కు చెందిన జస్టిస్ ఠాకూర్ 1964 ఏప్రిల్ 25న జన్మించారు. జమ్మూ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ డిగ్రీ పొందిన జస్టిస్ ఠాకూర్... 1989 అక్టోబర్ 18న ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో చేరి న్యాయవాద వృత్తి చేపట్టారు. 2011లో సీనియర్ న్యాయవాదిగా పదోన్నతి పొందారు. 2013 మార్చి 8న జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2022 జూన్ 10న బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు తాజా సిఫార్సుతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తి కానున్నారు.

నారాయణ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఏటీ-2023

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎన్‌ఎస్‌ఏటీ–2023) 18వ ఎడిషన్‌ను నారాయణ విద్యాసంస్థ ప్రకటించింది. దేశవ్యాప్తంగా 7 నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎస్‌ఏటీ పరీక్షలో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది. పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి విలువైన బహుమతులు అందించడం ఎన్‌ఎస్‌ఏటీ ముఖ్యోద్దేశం. పోటీ పరీక్షల్లో మార్పులు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఎన్‌ఎస్‌ఏటీ–2023 పరీక్షను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో నిర్వహించనున్నట్టు నారాయణ గ్రూప్ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు.

పోలీసులు పట్టించుకోలేదని..

జిల్లా కోర్టులో వ్యక్తి హల్‌చల్



రెడ్యానాయక్

ఖలీల్‌వాడి : ఫిర్యాదు చేయడానికి వెళ్తే పోలీసులు పట్టించుకోలేదంటూ ఒక వ్యక్తి నిజామాబాద్ జిల్లా కోర్టులో హల్‌చల్ చేశాడు. గురువారం మధ్యాహ్నం రెంజల్ మండలం దండిగుట్టకు చెందిన కేతావత్ రెడ్యా నాయక్ గొంతుపై గాయాలతో అరుస్తూ మొదటి అంతస్తుకు చేరుకున్నాడు. నిజామాబాద్ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు దగ్గరకు వెళ్లి గందరగోళం సృష్టించాడు. పైనుంచి దూకడానికి ప్రయత్నం చేశాడు. దగ్గరకు వెళ్లిన సెక్యూరిటీ గార్డులకు తన వద్ద ఉన్న సీసా చూపించి పెట్రోలు మీద పోసుకుంటానని బెదిరించాడు. చివరికి కోర్టు సిబ్బంది నచ్చజెప్పడంతో రెడ్యానాయక్ కిందకు దిగాడు. ఉదయం తన పొలానికి వెళ్తుండగా నవీపేటలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి రూ.5 వేలు లాక్కున్నారని వాపోయాడు. నవీపేట్ పోలీసు స్టేషన్‌కు వెళ్తే పోలీసులు పట్టించుకోనందున, జిల్లా కోర్టుకు వెళ్తే న్యాయం జరుగుతుందని వచ్చానని తెలిపాడు. కాగా అతని వద్ద ఉన్న సీసాలో పెట్రోలు కాకుండా గులాబీ కలిపిన నీళ్లున్నాయని తెలిసింది.

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా భూపాల్‌రెడ్డి

- ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ బాధ్యతలు మఠం భిక్షపతికి
- ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఎండీ తన్వీర్
- సంగారెడ్డి నేతలకు పదవుల పందేరం



వి.భూపాల్‌రెడ్డి



భిక్షపతి



ఎండీ తన్వీర్

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు బీఆర్‌ఎస్ నేతలను ప్రభుత్వ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమిస్తూ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డిని తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమించారు. సంస్థ డైరెక్టర్లుగా హైదరాబాద్‌కు చెందిన గోసుల శ్రీనివాస్ యాదవ్, నారాయణ్ పేట్ జిల్లా మద్దూర్ మండలం రెనెవట్లకు చెందిన మొహమ్మద్ సలీం నియమితులయ్యారు. తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గం వట్‌పల్లి మండలం మార్వెల్లి కి చెందిన మఠం భిక్షపతి స్వామిని నియమించారు. అదేవిధంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన మొహమ్మద్ తన్వీర్‌ను తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తున్నట్లు సీఎం కార్యాలయం వెల్లడించింది.

అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే..

- వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు నేతలకు ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాత్మకంగా నియమించారు. పటాన్‌చెరుకి చెందిన మాజీ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డి నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్నారు. 2007 నుంచి 2022 మధ్యకాలంలో వరుసగా మూడు పర్యాయాలు మెదక్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పనిచేసిన ఆయన 2021 జూన్ 4 నుంచి 2022 జనవరి 3 వరకు శాసన మండలి ప్రొటెమ్ చైర్మన్‌గా కూడా పనిచేశారు.
- అందోలు నియోజకవర్గం వట్‌పల్లికి చెందిన మఠం భిక్షపతి స్వామి తెలంగాణ ఉద్యమ సమయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతిలో క్రియాశీలంగా పనిచేశారు. సంగారెడ్డి జిల్లాలో ప్రధాన సామాజిక వర్గంగా ఉన్న లింగాయత్ కోటాలో భిక్షపతికి కార్పొరేషన్ పదవి దక్కింది.
- సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన మాజీ మంత్రి ఫరీదుద్దీన్ కుమారుడు తన్వీర్‌కు స్థానిక ఉన్న సామాజికవర్గం లెక్కలను దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ పదవి అప్పగించారు. ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన ఫరీదుద్దీన్ తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరగా.. ఎమ్మెల్సీ పదవి అప్పగించారు. పదవీకాలం పూర్తయిన తర్వాత అనారోగ్యంతో ఫరీదుద్దీన్ మరణించడంతో ఇటీవల ఆయన కుమారుడు తన్వీర్‌ను మైనారిటీ కమిషన్ సభ్యుడిగా నియమించగా, తాజాగా టీఎస్ఐడీసీ చైర్మన్ పదవి అప్పగించారు.

ఫ్యాషన్



చిటపట చినుకులను ఆనందించాలి
తడవకుండా మెరిసిపోవాలి
కొత్తగా ఉండాలి
స్టయిల్‌గా కనిపించాలి
మబ్బు పట్టిన సమయమైనా
ముసురు పట్టిన రోజులైనా
డ్రెస్‌కు అడ్రస్‌గా ఉంటూ
టెన్షన్ ఫ్రీగా గడిపేయాలనుకునేవారికి
డిజైనర్ వాటర్ ప్రూఫ్ పాంచోస్
రెడీ టూ వేర్ గా ఆకట్టుకుంటున్నాయి.

వానకు పాంచో







వానల్లో తడవకుండా ఉండటానికి గొడుగు లేదా లాంగ్ జాకెట్స్ మనకు వెంటనే గుర్తుకువస్తాయి. అంతకు మించి వానకాలంలో స్టయిల్‌గా కనిపించాలను కుంటే ఇంకేమీ లేవా అనుకునేవారికి వాటర్ ప్రూఫ్ పాంచోస్ మేమున్నామని గుర్తు చేస్తున్నాయి.

సహజంగా వేసవి కాలాన్ని సౌక ర్యంగా మురిపించిన సిల్క్ అండ్ కాటన్ పాంచోస్ ఇప్పుడు వాన కాలాన్ని వాటర్‌ప్రూఫ్‌తో ముస్తాబు చేసుకొని వచ్చాయి. పోల్కా డాట్స్, త్రీ డీ ప్రింట్స్, లైన్స్, ఫ్లోరల్స్, యానిమల్ ప్రింట్స్‌తో ఆకట్టుకునే ఈ పాంచోస్ ఒక్కోరోజును ఒక్కో రంగుతో ఎంపిక చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ లోనూ అందుబాటులో ఉన్న ఈ పాంచోని డ్రెస్ కలర్‌ని బట్టి కూడా సెలక్ట్ చేసుకోవచ్చు.

ఇంటిప్స్

- కొత్తిమీర ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే... పలుచటి వస్త్రంలో చుట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి.
- ఉల్లిపాయలు తరగడానికి పది నిమిషాల ముందు నీటిలో వేసి ఉంచితే తరిగేటప్పుడు కళ్లు మండడం, నీరు కారడం ఉండదు.
- పండ్లు, కూరగాయలను న్యూస్‌పేపర్‌లో చుట్టి ఫ్రిజ్‌పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.
- యాపిల్ తరిగిన తర్వాత ప్లేట్‌లో పెట్టి సర్వ్‌చేసే లోపే ముక్కలు రంగుమారుతుంటాయి. తరిగిన వెంటనే నిమ్మరసం రాస్తే రంగుమారవు. చాకుకు నిమ్మరసం రాసి తరగడం కూడా మంచి ఫలితాన్నిస్తుంది.
- పచ్చిమిరపకాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే ఫ్రిజ్‌లో పెట్టే ముందు తొడిమలు తీసేయాలి.

పర్యావరణహితం

ఈ బ్యాగు... బాగు బాగు!


● సునీతా రాణి

దేవాలయానికి వెళ్తే... వచ్చిన భక్తులందరి చేతిలో కొబ్బరికాయ, పూజాసామగ్రి కవర్‌లో నుంచి తొంగి చూస్తుంటాయి. కాలనీలో పెట్టిన చిన్న ఎగ్జిబిషన్‌కు వెళ్తే అక్కడ జుట్టుకు పెట్టుకునే పిన్నుల నుంచి వంటగదిలో ఉపయోగించే జాడీలు, స్పూన్‌లు, జిటర్‌లు, గ్రేటర్‌లు వంటివెన్నో ఉంటాయి. వాటిని చూసిన తర్వాత మనకు అవసరమైనవన్నీ గుర్తుకు వస్తాయి. కొన్న వెంటనే స్టాల్ వాళ్లు వాటిని ఒక పాలిథిన్ కవర్‌లో వేసిస్తారు. ఓ బర్త్‌డే ఫంక్షన్‌కు వెళ్తాం. వెళ్లిన వాళ్లందరికీ రిటర్న్ గిఫ్ట్‌లు ఓ చిన్న క్యారీ బ్యాగ్‌లో వేసిస్తారు. పర్యావరణం పట్ల చైతన్యం కలిగిన వాళ్లు పాలిథిన్ స్థానంలో పేపర్‌బ్యాగ్‌లను వాడుతున్నారు. అది మట్టిలో కలిసిపోతుంది. కానీ పేపర్ తయారీకి పెద్ద మొత్తంలో నీరు కావాలి. పేపర్ బ్యాగ్ సహజవనరుల వృథాను అరికట్టేది మాత్రం కాదు. వైశెట్టి సునీతా రాణికి వీటన్నింటికీ ప్రత్యామ్నాయం కేరళలో కనిపించింది.

కేరళ ఇచ్చిన ఆలోచన!

''కేరళ వాళ్ల జీవనశైలి ఎకో ఫ్రెండ్లీగా ఉంటుంది. భూమాతకు హాని కలిగించని జీవన విధానం వారిది. కొబ్బరిపీచు నుంచి తాటాకు, జ్యూట్ వరకు అన్నింటినీ ఉపయోగిస్తారు. అప్పటికి మన తెలుగు రాష్ట్రాల్లో జ్యూట్ వాడకం పెరగలేదు. దుస్తులు కొన్నప్పుడు కొంతమంది వస్త్రాల దుకాణదారులు కర్రల హ్యాండిల్స్ ఉన్న జ్యూట్ బ్యాగులను ఇచ్చేవారు. అంతే తప్ప బయో డీగ్రేడబుల్ ప్రోడక్ట్స్ దైనందిన జీవనంలోకి పెద్దగా రాలేదు. వచ్చిన అతికొద్ది ఉత్పత్తులు కూడా కోల్‌కతా మోడల్ సింగిల్ వీవింగ్ జ్యూట్ బ్యాగ్‌లే. వాటికి లోపల వైపు ల్యామినేషన్ ఉంటుంది. పైకి మాత్రం ఎకో ఫ్రెండ్లీ అనే ముసుగు వేసి లోపల కెమికల్ ల్యామినేషన్ వాడితే మనం ఏం సాధించినట్లు? పైగా మన దగ్గర ఏలూరులో డబుల్ వీవింగ్ జనపనార అందుబాటులో ఉండగా బయటి నుంచి ల్యామినేషన్ అతికిన జ్యూట్ వాడాల్సిన పనేంటి? ఇంతగా అధ్యయనం చేసిన తర్వాత నేషనల్ జ్యూట్ బోర్డు సహకారంతో నేను బయోడీగ్రేడబుల్ బ్యాగ్‌ల తయారీ మొదలుపెట్టాను'' అంటూ తాను సోషల్‌ప్రెన్యూర్‌గా మారిన వైనాన్ని వివరించారు సునీతారాణి.

గ్రీన్ లీఫ్ పుట్టింది!

''మాది విజయవాడ. బాల్యం, చదువు అంతా అక్కడే. ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ పూర్తి కాగానే పెళ్లయింది. హైదరాబాద్‌కి వచ్చాను. షాదాన్, అరోరా కాలేజీల్లో లెక్చరర్‌గా ఉద్యోగం చేశాను. పెద్ద పాప పుట్టిన తర్వాత ఫుల్‌టైమ్ జాబ్ వీలు కాకపోవడంతో కొంతకాలం మెడికల్ ట్రాన్‌స్క్రిప్షర్‌గా చేశాను. మా వారు యూఎస్ వెళ్లాలనే ఆలోచన చేశారు. అనుకున్నట్లుగా వెళ్లారు కానీ అక్కడ కొనసాగలేదు. ఇండియా వచ్చిన తర్వాత ప్రింటింగ్‌లో భవిష్యత్తును వెతుక్కున్నాం. ఇంట్లోనే ఒక గదిలో 2002లో ఒక్క మెషీన్‌తో ప్రింటింగ్ మొదలుపెట్టాం. నేను ఇంట్లో పిల్లలను, ప్రింటింగ్ పనులను చూసుకుంటూ ఉంటే మా వారు మార్కెటింగ్ చూసేవారు. ఆ ప్రయత్నం విజయవంతమైంది. జీవితం సౌకర్యవంతంగా సాగుతోంది. మా చిన్న పాప చెస్ ఆడుతుంది. తనకు తోడుగా టోర్నమెంట్‌లకు నేనే వెళ్లేదాన్ని. అనేక ప్రదేశాలను, వారి జీవనశైలిని చూశాను. ఓ సారి మా ఫ్యామిలీ మొత్తం కేరళ టూర్ వెళ్లాం. అప్పుడు వచ్చిన ఆలోచనే 'జస్ట్ గ్రీన్ లీఫ్' రూపంలో హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది.

ముగ్గు పరిచయం!

చిన్న జీయర్ స్వామిగారు ధనుర్మాస దీక్ష కోసం లడ్డు ప్రసాదం, పసుపు కుంకుమలు వేసివ్వడానికి పెద్ద మొత్తంలో ఆర్డర్ ఇచ్చారు. వాటిని చూసిన సింగపూర్ టీటీడీ వాళ్లు ప్రత్యేకంగా చేయించుకున్నారు. ఇక బ్యాగ్ మీద ముగ్గు ముద్రించడం వెనుక ఉద్దేశం... ఈ తరం పిల్లలకు మన ముగ్గులను పరిచయం చేయడం. ముగ్గు వేయడం నేర్చుకోమంటే ఎవరు శ్రద్ధ పెడతారు? ఇలా కనిపిస్తూ ఉంటే సరదాగా కాగితం మీద అయినా ఓ ప్రయత్నం చేస్తారని నా ఆశ. పర్యావరణహితమైన జీవనశైలితో పాటు తెలుగుదనాన్ని కూడా అలవాటు చేస్తున్నాను. ఇలాంటి ప్రయత్నాలకే నాకు గో గ్రీన్ పురస్కారం లభించింది'' అన్నారు వైశెట్టి సునీతారాణి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు :
నోముల రాజేశ్ రెడ్డి

పిల్లలకు అలవాటు చేయాలి!



నా యూనిట్ ఉద్దేశం... జ్యూట్ బ్యాగ్ తయారు చేయడం, ఖర్చులతోపాటు లాభం చూసుకుని అమ్మడం కాదు. మన అవసరాన్ని తీర్చిన తర్వాత ఆ మెటీరియల్ భూమిలో కలిసిపోవాలి. ప్లాస్టిక్‌లాగ పల్లపు ప్రదేశాలకు కొట్టుకువచ్చి వరదలకు కారణం కాకూడదు. ఇక ప్లాస్టిక్ వినియోగం ఎక్కడ ఎక్కువగా ఉంటోందో గమనించి అక్కడి అవసరాలకు సరిపోయే విధంగా బ్యాగ్‌లను డిజైన్ చేశాను. మార్కెట్‌కి వెళ్లేటప్పుడు తమ వెంట బ్యాగ్ తీసుకెళ్లడం పిల్లలకు అలవాటు చేయాలనేది నా లక్ష్యం. అందుకోసం చేసిన ప్రయోగమే స్క్రీన్ ప్రింటింగ్‌లో జ్యూట్ మీద పిల్లల పేర్లను ముద్రించడం. రిటర్న్ గిఫ్ట్‌గా తమ పేరున్న బ్యాగ్‌ను అందుకున్నప్పుడు వారి సంతోషం వర్ణనాతీతం. ఆ పేరును స్నేహితులకు చూపించుకోవడానికి ఆ బ్యాగ్‌ను ఇష్టంగా వాడడం మొదలుపెడతారు. ఈ ప్రయోగం విజయవంతం అయింది. ఇక నా సక్సెస్ సీక్రెట్ ఏమిటంటే... ఆన్‌లైన్‌లో రకరకాల ఉత్పత్తులను అప్‌లోడ్ చేస్తాం. అందులో త్వరగా అమ్ముడైన మోడల్ ఏమిటో గమనించి ఆ డిజైన్‌లో ఎక్కువ పీస్‌లు తయారు చేయడం అన్నమాట.



గెలుపు పాఠం

'జీరో' నుంచి
ప్రయాణం ప్రారంభించి
ఒక్కో పాఠం నేర్చుకుంటూ
తమ కంపెనీ 'వెల్‌స్పన్'ను
ప్రపంచంలోని అతి పెద్ద
టెక్స్‌టైల్ కంపెనీల పక్కన నిలబెట్టింది
దీపాలీ గోయెంకా...



అన్‌స్టాపబుల్

రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన దీపాలీకి పద్దెనిమిది సంవత్సరాల వయసులోనే వివాహం జరిగింది. ఇంటికే పరిమితం కాకుండా, ఏదైనా చేయాలనిపించేది. ముప్పైసంవత్సరాల వయసులో భర్త చేసే టెక్స్‌టైల్ వ్యాపారంలోకి అడుగు పెట్టింది.

'నా భార్యగా ఇక్కడ నీకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం అంటూ ఏవీ ఉండవు' అని చెప్పాడు ఆమె భర్త 'వెల్‌స్పన్' ఛైర్మన్ బీకే గోయెంకా.

తొలిరోజుల్లో 'బాస్ భార్య'గానే గుర్తింపు పొందిన దీపాలీ ఆ తరువాత కాలంలో తనదైన గుర్తింపు తెచ్చుకుంది. నిరుపమానమైన నాయకత్వానికి ప్రతీకగా ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. సైకాలజీ చదువుకున్న దీపాలీకి వ్యాపార వ్యవహారాలలో ఎలాంటి అనుభవం లేదు. ఏమీ తెలియని శూన్యం నుంచి అన్ని తెలుసుకోవాలనే తపన వరకు ఆమె ప్రయాణం కొనసాగింది. నష్టాలు ఎక్కడా జరుగుతున్నాయి? వాటిని నివారించడం ఎలా? ఇలా ఎన్నో విషయాలను త్వరగా తెలుసుకుంది. ఆఫీసుకు వెళ్లామా, వచ్చామా...అనే తీరులో కాకుండా ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన పెంచుకుంది. ఒకానొక కాలంలో విదేశీ ఒప్పందాలు రద్దు అయిపోయి కంపెనీ సంక్షోభపు టంచుల్లోకి వెళ్లింది. ఇలాంటి పరిస్థితులలో దీపాలీ ట్రబుల్ షూటర్‌గా మారి కంపెనీని మళ్లీ విజయపథంలోకి తీసుకువచ్చింది.

ఇంతలోనే కోవిడ్ రూపంలో మరో సంక్షోభం ఎదురైంది. దాన్ని కూడా తన నాయకత్వ లక్షణాలతో విజయవంతంగా అధిగమించింది.

'ఏ సంక్షోభాన్నీ వృథాగా పోనివ్వకూడదు. దానినుంచి నేర్చుకునే విలువైన పాఠాలు ఎన్నో ఉంటాయి. మనల్ని మనం పునఃపరిశీలన చేసుకోవడానికి, మెరుగు పెట్టుకోవడానికి సంక్షోభాలు ఉపయోగపడతాయి' అంటుంది దీపాలీ.

ప్రస్తుతం కంపెనీకి సంబంధించిన ఉత్పత్తుల్లో 94 శాతం బయటి దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇంటర్నేషనల్ మార్కెట్‌తో పాటు ఇండియన్ మార్కెట్‌పై కూడా దీపాలీ దృష్టి సారించింది.

'వ్యాపారవేత్త నిలువ నీరులా ఒకచోట ఉండిపోకూడదు. ప్రవాహమైపోవాలి. ప్రతి అడుగులో కొత్త విషయాలు తెలుసుకోవాలి. కొత్తగా ఆలోచించడం అనేది వ్యాపారానికి ప్రాణవాయువులాంటిది' అనేది తాను నమ్మిన సిద్ధాంతం.

ఇప్పుడు కంపెనీ చేతిలో సరికొత్త ఆవిష్కరణలకు సంబంధించి 35 పేటెంట్స్ ఉన్నాయి.

'అందరికీ అన్నీ తెలియాలి అని ఏమీ లేదు. తెలుసుకోవడానికి మన దగ్గర ఉన్న శక్తి... ప్రశ్న. ఒక్క ప్రశ్నతో ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. మన అజ్ఞానం బయటపడుతుందేమో అని సంశయిస్తే అక్కడే ఉండిపోతాం. నాకు ఈ విషయం గురించి పెద్దగా తెలియదు. దయచేసి చెబుతారా? అని అడిగేదాన్ని. మనం తెలివి ఉన్న వ్యక్తి అయినంత మాత్రాన సరిపోదు. ఆ తెలివితో కంపెనీ ఎంత ముందుకు వెళ్లిందనేది ముఖ్యం. నేర్చుకోవడం అనే ప్రక్రియకు కాల పరిధి లేదు. అది నిత్యం జరుగుతూనే ఉండాలి' అంటుంది దీపాలీ.

ఈఎస్‌జీ-ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్ తమ వ్యాపారానికి కీలకం అనేది దీపాలీ చెప్పే మాట. కంపెనీ ప్రాడక్ట్స్‌కు సంబంధించి తయారీ ప్రక్రియలో రీసైకిల్ వాటర్‌ను ఉపయోగించడం కూడా ఇందులో భాగమే. మరోవైపు రైతులతో కలిసి పర్యావరణానికి సంబంధించిన విషయాలపై పనిచేస్తోంది.

దీపాలీ 'వెల్‌స్పన్'లోకి అడుగు పెట్టినప్పుడు కేవలం ఏడు శాతం మంది మహిళలే ఉండేవారు. ఇప్పుడు వారి ప్రాతినిధ్యం ముప్పై శాతానికి పెరిగింది.

ఈతరం వ్యాపారవేత్తలకు దీపాలీ ఇచ్చే సలహా ఇది...

'వ్యాపారికి తన వ్యాపారం మాత్రమే ప్రపంచం కాకూడదు. తన మానసిక ఆరోగ్యం, తినే తిండి, వ్యాయామాలపై కూడా దృష్టి పెట్టాలి. మనం మానసికంగా చురుగ్గా ఉంటేనే ఉత్తమమైన ఆలోచనలు వస్తాయి'

సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా నిరూపించుకున్న దీపాలీ గోయెంకాలో మరో కోణం దాతృత్వం.

వంటిల్లు

టొమాటో లేకపోతేనేం!

చాలామందికి టొమాటో కలపనిదే కూర చేయబుద్ధి కాదు. అయితే ఇటీవల కొద్దికాలం నుంచి సెంచరీ కొట్టినా .. కిందకి దిగనంటోంది టొమాటో. అయినా ఏం ఫర్వాలేదు. టొమాటో లేకపోయినా కూరలను రుచిగా వండొచ్చని చేసి చూపిస్తోంది ఈ వారం వంటిల్లు....



మిక్స్‌డ్ వెజ్ కుర్మా



కావలసినవి : ఉల్లిపాయ ప్యూరీ – కప్పు; అల్లం వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను ; క్యారట్, బీన్స్, పచ్చిబఠాణీ, క్యాలీఫ్లవర్, బంగాళ దుంప ముక్కలు – అన్నీ కలిపి రెండు కప్పులు ; కారం – టీస్పూను ; ధనియాల పొడి – టీస్పూను ; జీలకర్ర పొడి – అరటీస్పూను ; గరం మసాలా – చిటికెడు ; నిమ్మరసం – టీస్పూను ; ఉప్పు – రుచికి తగినంత; నూనె – రెండు టేబుల్ స్పూన్లు, లవంగాలు – రెండు, దాల్చిన చెక్క – అర అంగుళం ముక్క ; యాలకులు – రెండు ; ఎండు కొబ్బరి తురుము – మూడు టేబుల్ స్పూన్లు ; గసగసాలు – టీస్పూను.

తయారీ : ● కూరగాయ ముక్కలన్నింటిని శుభ్రంగా కడిగి, కొద్దిగా ఉప్పువేసి ఉడకించి పక్కన పెట్టుకోవాలి. ● గసగసాలు, కొబ్బరిని దోరగా వేయించి పేస్టుచేసుకోవాలి. ● బాణలిలో నూనె వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నూనెలో లవంగాలు, చెక్క, యాలకులు వేసి నిమిషం పాటు వేయించాలి. తరువాత ఉల్లిపాయ ప్యూరీని వేసి కలపాలి. ● ప్యూరీ వేగాక అల్లం వెల్లుల్లి పేస్టు, మసాలా పొడి, వేసి కలిపి రెండు నిమిషాలు పెద్దమంటమీద వేయించాలి. ● ఇప్పుడు మంట తగ్గించి కొబ్బరి మసాలా, ఉడికించిన కూరగాయ ముక్కలు వేసి కలియబెట్టాలి. ● కూరగాయ ముక్కలు ఉడికించిన నీళ్లు, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి పదినిమిషాలు మగ్గనివ్వాలి. చివరిగా కొత్తిమీర, నిమ్మరసం వేసి దించేయాలి. చపాతీలలోకి, అన్నంలోకి బావుంటుంది.

కరైవారి చికెన్



కావలసినవి : చికెన్ – కేజీ ; పచ్చికొబ్బరి తురుము – రెండు కప్పులు ; ఉల్లిపాయలు పెద్దవి – రెండు (ముక్కలు తరగాలి) ; సోంపు – టీస్పూను ; గసగసాలు – టేబుల్ స్పూను ; మిరియాలు – పది ; లవంగాలు – పది ; బిర్యానీ ఆకులు – రెండు ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; జాజికాయ – చిన్న ముక్క ; ఎండు మిరపకాయలు – పదిహేను ; ధనియాలు – రెండు టేబుల్ స్పూన్లు ; వెల్లుల్లి రెబ్బలు – పది ; నూనె – మూడు టేబుల్ స్పూన్లు ; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ : ● ఎండు మిరపకాయలు, ధనియాలు, వెల్లుల్లి రెబ్బలను దోరగా వేయించి, చల్లారాక పేస్టు చేసి పక్కపెట్టుకోవాలి. ● శుభ్రంగా కడిగిపెట్టుకున్న చికెన్ ముక్కలకు ఈ పేస్టుని పట్టించి అరగంటపాటు పక్కన పెట్టుకోవాలి. ● బాణలిలో కొద్దిగా నూనెవేసి, కాగాక సగం ఉల్లిపాయ ముక్కలు, పచ్చికొబ్బరి తురుము, చెక్క, లవంగాలు, సోంపు, గసగసాలు, మిరియాలు వేసి దోరగా వేయించి పేస్టుచేసి పెట్టుకోవాలి. ● బాణలిలో మిగతా నూనె వేసి కాగనివ్వాలి. కాగిన నూనెలో బిర్యానీ ఆకు, మిగిలిన ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకు వేయించాలి. ● ఉల్లిపాయ వేగాక నానబెట్టుకున్న చికెన్ వేసి ఐదు నిమిషాలు ఫ్రై చేయాలి. ● ఇప్పుడు కొబ్బరి పేస్టు, మిరపకాయ మసాలా పేస్టు వేసి కలుపుకోవాలి. ● గ్రేవీకి సరిపడా నీళ్లు, రుచికి సరిపడా ఉప్పు వేసి సన్నని మంట మీద చికెన్ ముక్కలు మెత్తబడి, నూనె పైకి తేలంతవరకు మగ్గనించి దించేయాలి. అన్నం, రోటీ, పుల్కాల్లోకి మంచి సైడ్ డిష్.

పొటాటో క్యాబేజీ ఇగురు



కావలసినవి : క్యాబేజీ తురుము – అరకేజీ; బంగాళ దుంపలు – రెండు ; పచ్చిమిర్చి – రెండు; పచ్చిబఠాణీ – అరకప్పు; పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; ఉల్లిపాయ తరుగు – అరకప్పు ; అల్లం తురుము – టేబుల్ స్పూను ; కరివేపాకు – రెండు రెమ్మలు ; నూనె – రెండు టేబుల్ స్పూన్లు ; ఆవాలు – టీస్పూను ; పసుపు – అరటీస్పూను ; కారం – అరటీస్పూను ; ఉప్పు – రుచికి సరిపడా ; ధనియాల పొడి – టీస్పూను.

తయారీ : ● బాణలిలో నూనెవేసి వేడెక్కనివ్వాలి. ● కాగిన నూనెలో ఆవాలు, అల్లం, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చిని వేయాలి. ● ఇవన్నీ వేగాక కరివేపాకు, ఉల్లిపాయలు వేసి ఐదు నిమిషాలు వేయించాలి. ● ఇప్పుడు క్యాబేజీ తురుము, బంగాళ దుంపలను తొక్కతీసి సన్నగా తరిగి వేయాలి. ● రెండు నిమిషాల తరువాత పసుపు, కారం, ధనియాల పొడి రుచికి సరిపడా ఉప్పు వేసి కలుపుకోవాలి. ● ఈ మిశ్రమాన్ని మూతపెట్టి సన్నని మంట మీద పదిహేను నిమిషాలు మగ్గనివ్వాలి. ● ఇప్పుడు పచ్చిబఠాణీవేసి మరో పదినిమిషాలు ఉడికించాలి. ● బంగాళ దుంప ముక్కలు మెత్తబడి నూనె పైకి తేలినప్పుడు కొబ్బరి తురుము వేసి ఐదునిమిషాల తరువాత దించేయాలి. చపాతీ, రోటీ, అన్నంలోకి ఈ ఇగురు మంచి కాంబినేషన్.

బైగన్ కా బార్తా



కావలసినవి : మీడియం సైజు వంకాయలు – రెండు ; వెల్లుల్లి రెబ్బలు – నాలుగు ; నూనె – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు ; వెల్లుల్లి తరుగు – రెండు టీస్పూన్లు ; అల్లం – అంగుళం ముక్క (సన్నగా తురుముకోవాలి) ; పచ్చిమిర్చి తరుగు – రెండు టీస్పూన్లు ; ఉల్లిపాయ తరుగు – అరకప్పు ; కారం – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, ధనియాల పొడి – టీస్పూను ; ఉప్పు – రుచికి తగినంత; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ : ● వంకాయలను శుభ్రంగా కడిగి తడిలేకుండా తుడుచుకోవాలి. ● ఇప్పుడు వంకాయలకు కొద్దిగా నూనె రాసి మూడు వైపులా మూడుగాట్లు పెట్టాలి. ఈ చీలిక మధ్యలో వెల్లుల్లి రెబ్బలను లోపలికి పోయేలా పెట్టాలి. ● ఇప్పుడు వంకాయను మంటమీద నేరుగా పెట్టి చక్కగా కాల్చుకోవాలి. ● వంకాయ కాలిన తరువాత చల్లారనిచ్చి, వెల్లుల్లి రెబ్బలను బయటకు తీసి సన్నగా తరగాలి. వంకాయను మెత్తగా చిదుముకోవాలి. ● బాణలిలో నూనె వేసి, కాగిన తరువాత వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి తరుగు వేసి రెండు నిమిషాలు వేయించాలి. ● ఇప్పుడు చిదుముకున్న వంకాయ గుజ్జు, ఉడికించి తరిగిన వెల్లుల్లిని వేసి ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి. ● కారం, ధనియాల పొడి రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి. నూనె పైకి తేలేంత వరకు మగ్గనిచ్చి కొత్తిమీర తరుగు చల్లుకుని దించేస్తే బైగాన్ బార్తా రెడీ. రోటీల్లోకి మంచి సైడ్ డిష్.

● సక్సెస్ స్టోరీ

ప్రయాణంలో, తీరిక వేళల్లో ఎఫ్ఎంలో పాటలు వినడం సహజమే.
'ఎప్పుడూ అవే పాటలు, అవే మాటలేనా' అనుకుంటారు కొద్దిమంది.
వారిలో రోహన్ నాయక్ ఒకరు.
ఈ యువ ఇంజనీర్ తన స్నేహితులతో కలిసి బెంగళూరు కేంద్రంగా ప్రారంభించిన 'పాకెట్ ఎఫ్ఎం' వివిధ జానర్స్, వివిధ భాషలలో ఆకట్టుకునే ఆడియో సిరీస్‌లతో దూసుకుపోతుంది...


ప్రతీక్ దీక్షిత్, రోహన్ నాయక్, నిశాంత్

పాకెట్ ప్రపంచంలోకి...

కొన్నిసార్లు ఐడియాల కోసం వెదుక్కుంటూ వెళ్లనక్కర్లేకుండానే... అవే మనల్ని వెదుక్కుంటూ వస్తాయి. రోహన్ నాయక్ విషయంలోనూ అలాగే జరిగింది.

ఇంటి నుంచి ఆఫీసుకు చేరుకోవడానికి చాలా టైమ్ పట్టేది. టైమ్‌పాస్ కోసం ఎఫ్ఎంలలో మ్యూజిక్ వినేవాడు. అయితే ఆ మ్యూజిక్ అదేపనిగా రిపీట్ కావడంతో బోర్‌గా ఉండేది.

'భారతీయ భాషల్లో ఆడియో స్టోరీ టెల్లింగ్ ప్లాట్‌ఫామ్ ఉంటే బాగుండేది' అనుకునేవాడు.

'మనం కావాలనుకుంటున్నది కాలమే మన చేత చేయిస్తుంది' అన్నట్లుగా ఆ ప్రయత్నానికి తానే శ్రీకారం చుట్టాడు రోహన్ నాయక్.

ఐఐటీ–ఖరగ్‌పూర్ ఫ్రెండ్స్ ప్రతీక్ దీక్షిత్, నిశాంత్ కేఎస్‌లతో కలిసి 'పాకెట్ ఎఫ్.ఎం'కు శ్రీకారం చుట్టాడు.

మ్యూజిక్ కాకుండా 'ఆడియో ఎంటర్‌టైన్‌మెంట్' లక్ష్యంగా మొదలైన ఈ ఆడియో సిరీస్ ప్లాట్‌ఫామ్ అన్యూవలైజ్‌డ్ రెవెన్యూ రన్‌రేట్(ఏఆర్ఆర్)తో దూసుకుపోవడానికి ఎంతో కాలం పట్టలేదు.

'ప్రస్తుతం శ్రోతలు సగటున రోజుకు వంద నిమిషాల సమయాన్ని వినడానికి వెచ్చిస్తున్నారు. మా యాప్ టోటల్ మంత్లీ ఆడియో స్ట్రీమింగ్‌లో ఎప్పటికప్పుడు వృద్ధి కనిపిస్తోంది' అంటున్నాడు పాకెట్ ఎఫ్.ఎం. ఫౌండర్‌లలో ఒకరైన నిశాంత్.

రొమాన్స్, హారర్, థ్రిల్లర్, ఫిక్షన్, సైన్స్ ఫిక్షన్...అనేవి పాకెట్ ఎఫ్.ఎం.లో టాప్ జానర్‌లుగా ఉన్నాయి. ఎపిసోడ్‌లు 10–15 నుంచి 25–30 నిమిషాల వరకు ఉంటాయి.

'పాకెట్ ఎఫ్.ఎం' ఆడియో సెగ్మెంట్ సిరీస్‌లో కొన్ని హిట్ టైటిల్స్...

యే రిష్తా కైసా హై(400 మిలియన్), లవ్ కాంట్రాక్ట్(200 మిలియన్), యక్షిణీ (195 మిలియన్), షూర్‌వీర్(129 మిలియన్)...మొదలైనవి.

> పాకెట్ ఎఫ్.ఎం. విజయవంతం కావడంలో ఏఐ, ఎంఎల్ సాంకేతికత కీలక పాత్ర పోషించింది. శ్రోతల నాడి పసిగట్టడం, సంక్లిష్టమైన విషయాలను సరళం చేయడం, ఖర్చులు తగ్గించుకోవడం... ఇలా ఎన్నో విషయాల్లో సాంకేతికత ఉపయోగపడింది.
> – ప్రతీక్ దీక్షిత్

'పాకెట్‌ఎఫ్ఎం'లో 733 ఆడియో సిరీస్‌లతో పాటు ఆడియో బుక్స్ కూడా ఉన్నాయి. గత అక్టోబర్‌లో ఆన్‌లైన్ రీడింగ్ ప్లాట్‌ఫామ్ 'పాకెట్ నావెల్'కు శ్రీకారం చుట్టారు. ఇక శ్రోతల విషయానికి వస్తే 15 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్నవారు ఎక్కువగా ఉన్నారు. బెంగళూరు, ముంబై, ఢిల్లీ, పుణె, హైదరాబాద్‌లు టాప్ 5 సిటీస్‌గా ఉన్నాయి. మరోవైపు చిన్న పట్టణాలలో కూడా 'పాకెట్‌ఎఫ్ఎం' పాపులర్ అవుతుంది.

లాంగ్ ఫార్మట్ ఆడియో ఎంటర్‌టైన్‌మెంట్ సిరీస్ ద్వారా ఓటీటీ స్పేస్‌ను పునర్నిర్వచించే ప్రయత్నం చేస్తున్న 'పాకెట్ ఎఫ్ఎం' యాడ్–టెక్ ప్లాట్‌ఫామ్ 'రియల్ టైమ్ యాడ్స్'ను తీసుకువచ్చింది.

'పాకెట్ ఎఫ్ఎం విజయవంతం కావడంలో ఏఐ, ఎంఎల్ సాంకేతికత కీలక పాత్ర పోషించింది. శ్రోతల నాడి పసిగట్టడం, సంక్లిష్టమైన విషయాలను సరళం చేయడం, ఖర్చులు తగ్గించుకోవడం... ఇలా ఎన్నో విషయాల్లో సాంకేతికత ఉపయోగపడింది' అంటున్నాడు కంపెనీ సీటీవో ప్రతీక్ దీక్షిత్. కంపెనీకి లైట్‌స్పీడ్, టెన్‌సెంట్, టైమ్స్ ఇంటర్నెట్‌లాంటి కీ ఇన్వెస్టర్‌లు ఉన్నారు. ఇప్పుడు పాకెట్ ఎఫ్.ఎం. యూఎస్ మార్కెట్‌లోకి కూడా విస్తరించే ప్రయత్నం చేస్తోంది.

'టీమ్ మెంబర్స్‌కు అద్భుతమైన శక్తి,సామర్థ్యాలు, అంకితభావం ఉన్నాయి' అంటున్నాడు టాంగ్లిన్ వెంచర్ పార్ట్‌నర్స్‌కు చెందిన సంకల్ప్ గుప్తా.

పాకెట్ ఎఫ్.ఎం.ను 'నెట్‌ఫ్లిక్స్ ఆఫ్ ఆడియో ఓటీటీ ప్లాట్‌ఫామ్స్'గా తీర్చిదిద్దాలనేది ముగ్గురు విజేతల లక్ష్యం.



● టెక్.. టాక్

వివో ఎక్స్ ఫోల్డ్ 2



డిస్‌ప్లే: 8.03 అంగుళాలు
ఓఎస్: ఆండ్రాయిడ్ 13
కనెక్టివిటీ: 5జీ
బరువు: 279 గ్రా.
మెమోరీ: 256జీ 12జీబి ర్యామ్ 512 జీబి 12జీబి
ఫ్రంట్ కెమెరా: వైడ్(మెయిన్) 16 ఎంపీ
బ్యాటరీ: 4800 ఎంఏహెచ్

యాపిల్ మ్యాక్ బుక్ ఎయిర్ 15



హైట్: 1.13 సీఎం
విడ్త్: 30.41 సీయం
డెప్త్: 21.5 సీఎం
స్టోరేజ్: 256 జీబి 512జీబి
ఆడియో: 4–స్పీకర్ సౌండ్ సిస్టమ్
వైడ్ స్టీరియో సౌండ్
బరువు: 1.24 కేజీ
ఫీచర్స్: వాయిస్ కంట్రోల్, వాయిస్ ఓవర్... మొదలైనవి.

వాట్సాప్‌లో ఆటో–డౌన్‌లోడ్

(ఫొటోలు, వీడియోలు) టర్న్ ఆఫ్ చేయడానికి...

వాట్సాప్‌లోకి వచ్చిన మీడియా ఫైల్ ఫోన్ గ్యాలరీలో సేవ్ అవుతుంది. మీడియా విజిబిలిటీ ఆప్షన్ 'టర్న్‌డ్ ఆన్'లో ఉండడమే దీనికి కారణం. టర్న్ ఆఫ్ చేయడానికి



- వాట్సాప్ ఓపెన్ చేసి ఆటో–డౌన్‌లోడ్ డిసైబుల్ చేయాలనుకుంటున్న 'చాట్'పై ట్యాప్ చేయాలి.
- 'నేమ్ ఆఫ్ ది చాట్' ట్యాప్ చేసి ప్రొఫైల్ సెక్షన్‌లోకి వెళ్లాలి
- మీడియా విజిబిలిటీ–ట్యాప్ ● ట్యాప్–నో
- ఒకవేళ ఫీచర్‌ని ఎనైబుల్ చేయాలనుకుంటే ఇదే విధానంలో 'యస్' ట్యాప్ చేయాలి.

● కళ

ది ఆర్ట్ ఆఫ్ కామెడీ

ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ఉన్నప్పుడు 'ఇంజనీరింగ్ తప్ప ఏదైనా చేయాలి' అని గట్టిగా అనుకుంది నిహారిక! పేరెంట్స్ ససేమిరా అన్నారు. దీంతో చదువు తప్పలేదు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు కంటెంట్ క్రియేటర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది. సోషల్ లైఫ్ పెద్దగా లేని నిహారిక తన స్టడీ రూమ్‌లో ఇంజనీరింగ్ పుస్తకాలు చదువుకుంటూనే, మరోవైపు కామెడీ స్కెచ్‌లు రాసేది.

'మొదట్లో నన్ను ఎవరూ సీరియస్‌గా తీసుకునేవారు కాదు. నన్ను అనుకరిస్తూ కామెంట్స్ పెట్టేవారు. అయితే వాటికి నేనెప్పుడు బాధ పడలేదు. స్వభావరీత్యా నేను చాలా సెన్సిటివ్ పర్సన్‌ని. అయితే కాలేజీలోకి అడుగుపెట్టిన తరువాత మరీ ఇంత సున్నితంగా ఉంటే బాగుండదు అనిపించింది. ఒక్కొక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుంది. ప్రతి దానికి బాధ పడాల్సిన అవసరం లేదు. మానసికంగా దృఢంగా ఉండడం అనేది కంటెంట్ క్రియేటర్‌గా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు బాగా ఉపయోగపడింది. మొదట్లో వెక్కిరించిన వారే ఆ తరువాత మెచ్చుకునేవారు' అంటుంది నిహారిక.

చవకబారు విమర్శల మాట ఎలా ఉన్నా నిర్మాణాత్మక విమర్శను ఇష్టపడుతుంది. 'కొత్త విషయాలు నేర్చుకోవడానికి, మనల్ని మనం మెరుగు పెట్టుకోవడానికి నిర్మాణాత్మకమైన విమర్శ తోడ్పడుతుంది' అంటుంది నిహారిక. ఇన్‌స్టాగ్రామ్ 'రీల్స్' ద్వారా నిహారిక పేరు ఎక్కడికో వెళ్లిపోయింది.

నిహారిక కంటెంట్‌కు తొలి ప్రేక్షకురాలు నిహారికనే! ప్రేక్షక స్థానంలో కూర్చున్నప్పుడు తాను ఆ కంటెంట్ ఎంజాయ్ చేయగలిగితేనే ప్రేక్షకుల్లోకి తీసుకువెళుతుంది. 2022లో తన తొలి షార్ట్–ఫార్మట్ కంటెంట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఇక అప్పటి నుంచి వెనక్కి తిరిగిచూసుకోలేదు. తన ఫస్ట్ వైరల్ వీడియో 'లివింగ్ ఎలోన్ 101' పదమూడు రోజుల వ్యవధిలోనే 11 మిలియన్‌ల వ్యూస్‌ను దాటేసింది.

'ప్రేక్షకుల పెదాల మీద నవ్వులు పూయించే ఔషధం ఇంట్లో దొరకదు. జనాల్లోకి వెళ్లాలి. చిన్న ఎక్స్‌ప్రెషన్ నుంచి విలువైన మాట వరకు ఎన్నెన్నో బయటి ప్రపంచంలోనే దొరుకుతాయి' అంటుంది నిహారిక ఎన్ఎం.


'నాకు ఏదైనా సరే త్వరగా బోర్ కొడుతుంది. దీని వల్ల నాకు జరిగిన మేలు ఏమిటంటే నా కంటెంట్‌ను ఇతరులు బోర్‌గా ఫీల్ కావడానికి ముందుగానే కొత్త కంటెంట్ కోసం ప్రయత్నిస్తాను' అంటుంది నిహారిక ఎన్ఎం.

> బెంగళూరుకు చెందిన నిహారిక ఇంజనీరింగ్, ఎంబీఏ చేసింది. అయితే తనలోని క్రియేటివిటీ ఆమెను వేరే మార్గం వైపు నడిపించింది. డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటున్న నిహారికకు 'డోన్ట్ జస్ట్ ఫాలో ట్రెండ్స్. సెట్ దెమ్' అనే మాట అంటే చాలా ఇష్టం...


నిహారిక

● ఇంగ్లిష్ ఇడియమ్స్

కీప్ అప్ విత్ ది జోన్‌సిస్



మన స్థాయికి తగినట్లు ఖర్చు పెట్టడం అనేది సరియైన పద్ధతి. కొందరు మాత్రం దీన్ని పాటించరు. తమ ఆర్థికస్థాయితో సంబంధం లేకుండా ఇతరులను అనుకరిస్తూ ఖర్చు చేస్తారు. ఇరుగుపొరుగువారు, బంధువుల కంటే తాము ఏ రకంగా తక్కువ కాదు అని ఆడంబరం ప్రదర్శించడానికి పరిమితికి మించి ఖర్చు చేస్తుంటారు. ఇలాంటి సందర్భంలో ఉపయోగించే ఇడియమ్...కీప్ అప్ విత్ ది జోన్‌సిస్.

ఈ ఇడియమ్‌కు మూలం...అమెరికన్ కామిక్ స్ట్రిప్: కీప్ అప్ విత్ ది జోన్‌సిస్. కార్టూనిస్ట్ ఆర్థర్ మోమండ్ ఈ కార్టూన్ స్ట్రిప్‌ను 1913లో క్రియేట్ చేశాడు.

అవును... ఇది నిజమే!

- నమీబియాలోని 'డెడ్ వ్లయ్'లో 900 ఏళ్ల వయసు ఉన్న చెట్లు ఉన్నాయి. అయితే అవి పేరుకు మాత్రమే చెట్లు. పచ్చదనం లేకుండా ఎండిపోయిన చెట్లు! అందుకే దీన్ని 'చెట్ల ఎడారి' 'చెట్ల సమాధులు' అని పిలుస్తారు
- చిలకలలో 'డ్రాకూన్ చిలకలు వేరయా' అని చెప్పుకోవచ్చు. పపువా న్యూ గినియాలోని రెయిన్ ఫారెస్ట్‌లో కనిపించే డ్రాకూల ప్యారట్స్ నలుపు, చార్‌కోల్ గ్రే రంగుల్లో ఉండి కుంచెం భయపెట్టేలా ఉంటాయి
- నార్వేలో 'హెల్' పేరుతో ఒక విలేజ్ ఉంది. టూరిస్ట్ ఎట్రాక్షన్‌లో భాగంగా ఆ పేరు పెట్టారు!

సినిమా


● చిరంజీవి

మార్క్ చేసుకోండి...

'భోళా శంకర్' సినిమాలోని తన పాత్ర డబ్బింగ్‌ని పూర్తి చేశారు హీరో చిరంజీవి. ఈ విషయాన్ని ఆయన ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తమన్నా హీరోయిన్. రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ''భోళా శంకర్' రూపుదిద్దుకున్న తీరు చాలా ఆనందంగా ఉంది. ఈ ఫైర్ మాస్ ఎంటర్‌టైనర్ కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. మీ క్యాలెండర్‌లను మార్క్ చేసుకోండి. థియేటర్స్‌లో కలుద్దాం.. భోళా శంకర్ ఆగస్టు 11'' అంటూ డబ్బింగ్ చెబుతున్న ఓ ఫొటోని షేర్ చేశారు చిరంజీవి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. కీర్తీ సురేష్, సుశాంత్ కీలక పాత్రలు చేసిన ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: డడ్లీ.

నువ్వు కావాలయ్యా...

కొంచెం ఆట కావాలా? కొంచెం పాట కావాలా? అంటూ ఊర మాస్ స్టెప్పులతో తమన్నా అదరగొట్టారు. రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్'లోని 'నువ్వు కావాలయ్యా..' అంటూ సాగే పాట ఇది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించింది. 'జైలర్' చిత్రం ఆగస్టు 10న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'రా.. నువ్వు కావాలయ్యా.. నువ్వు కావాలి' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను గురువారం విడుదల చేశారు. రజనీకాంత్, తమన్నా మధ్య ఈ పాట సాగుతుంది. అనిరుధ్ రవిచంద్రన్ స్వరపరచిన ఈ పాటకు అరుణ్ రాజా కామరాజ్ సాహిత్యం అందించగా శిల్పా రావు, అనిరుధ్ పాడారు. జానీ మాస్టర్ ఈ పాటకు నృత్య రీతులు సమకూర్చారు. 'జైలర్'లో శివ రాజ్‌కుమార్, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్, సునీల్, రమ్యకృష్ణ, మిర్నా మీనన్ కీలక పాత్రలు పోషించారు.


● తమన్నా, రజనీకాంత్

ఆ పార్కులో సలార్ ఉన్నాడు

'లయన్, చీతా, టైగర్, ఎలిఫెంట్.. వెరీ డేంజరస్.. బట్ నాట్ ఇన్ జురాసిక్ పార్క్, బికాజ్ ఇన్ దట్ పార్క్..' (సింహం.. చిరుత.. పులి.. ఏనుగు.. చాలా ప్రమాదం.. కానీ, జురాసిక్ పార్క్‌లో కాదు.. ఎందుకుంటే ఆ పార్కులో...) అంటూ నటుడు టీనూ ఆనంద్ చెప్పిన డైలాగ్ పూర్తి కాకముందే ప్రభాస్ స్క్రీన్ మీద ప్రత్యక్షమవుతారు (ఆ పార్కులో ఉన్నది సలార్ అనేది అర్థం). ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సలార్ పార్ట్ 1: సీజ్ ఫైర్' టీజర్ ఇది. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్.. ''కేజీఎఫ్, కాంతారా' వంటి హిట్ చిత్రాలు నిర్మించిన హోంబలే ఫిలింస్‌పై విజయ్ కిరగందూర్ 'సలార్' నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను గురువారం రిలీజ్ చేశారు. 'సలార్' రెండు భాగాలుగా రిలీజ్ కానుంది. తొలి భాగం 'సలార్ పార్ట్ 1: సీజ్ ఫైర్' సెప్టెంబరు 28న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.


● ప్రభాస్

వివాదాల నుంచి పబ్లిసిటీ కోరుకోను – ఎస్‌కేఎన్

''ఇండస్ట్రీలో జర్నలిస్ట్‌గా మొదలై, పీఆర్‌వో అయ్యాను. ఆ తర్వాత నిర్మాతగా మారాను. కెరీర్ చాలా సంతృప్తిగా ఉంది'' అన్నారు ఎస్‌కేఎన్. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో సాయి రాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన చిత్రం 'బేబీ'. ఈ నెల 14న ఈ చిత్రం రిలీజ్ కానుంది. నేడు (శుక్రవారం) ఎస్‌కేఎన్ బర్త్ డే. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''ఆనంద్, విరాజ్, వైష్ణవిల మధ్య సాగే ఎమోషనల్ లవ్‌స్టోరీ 'బేబీ'. కథ, కథనం, సన్నివేశాలు కొత్తగా ఉంటాయి. ఇంట్రవెల్‌కు ముందు పెద్ద షాక్ ఉంటుంది. మ్యూజిక్ పరంగా ఈ మధ్య వచ్చిన ప్రేమకథా చిత్రాల్లో 'బేబీ' ఓ మంచి చిత్రంగా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది. విజయ్ బుల్గానిన్ మంచి సంగీతం అందించాడు. ఇక సోలో నిర్మాతగా నేను తొలిసారి విజయ్ దేవరకొండతో 'టాక్సీవాలా' నిర్మించాను. అప్పుడు సాయి రాజేష్ నాకు 'బేబీ' కథ చెప్పాడు. కథ విన్నాక నిర్మాతగా నా తర్వాతి చిత్రం ఇదే చేయాలనుకున్నాను. ఈ సినిమా నుంచి విడుదలైన ఓ పోస్టర్ వివాదాస్పదమైంది. ఆ పోస్టర్‌ను అలాగే ఉంచితే మూవీకి ప్రమోషన్ వస్తుందని కొందరు అన్నారు. కానీ కంటెంట్ బాగుంటే పబ్లిసిటీ అదే వస్తుంది.. కాంట్రవర్సీల నుంచి కాదని నమ్మే వ్యక్తిని. ఇక మార్కెట్ అంటే.. 'అర్జున్ రెడ్డి' రిలీజ్ కాకముందే విజయ్ స్టార్ అవుతాడని నమ్మి 'టాక్సీవాలా' తీశా. అలా 'బేబీ' ఆనంద్ కెరీర్‌లో ఓ మైలురాయిలా నిలుస్తుందని నమ్ముతున్నాను. ఏడాదికి రెండు సినిమాలు, వెబ్ ఫిల్మ్ నిర్మించాలనుకుంటున్నాను. సందీప్ రాజ్, సాయి రాజేష్, రాహుల్ సంకృత్యాన్, వీఐ ఆనంద్‌లతో సినిమాలు ఉన్నాయి'' అన్నారు.




● నయనతార

మరో గ్రీన్ సిగ్నల్

కథ నచ్చితే కొత్త దర్శకులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తుంటారు హీరోయిన్ నయనతార. కోలీవుడ్ దర్శకుడు అశ్విన్ శరవణన్ వంటి వారికి తొలి అవకాశం ఇచ్చింది నయనతారనే. కాగా ఈ బ్యూటీ ఎక్కువగా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ చేస్తున్న విషయం తెలిసిందే. కథ బాగా నచ్చడంతో తాజాగా మరో లేడీ ఓరియంటెడ్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సినిమాతో విక్కీ డ్యూడ్ అనే ఓ యూట్యూబర్ దర్శకుడిగా పరిచయం కానున్నారని టాక్. ఈ సినిమా షూటింగ్‌ను ఈ నెలలో ఆరంభించనున్నారట. ఈ చిత్రం కాకుండా మరో నాలుగు చిత్రాలతో నయనతార ఫుల్ బిజీగా ఉన్నారు. వీటిలో షారుక్ ఖాన్ సరసన నటిస్తున్న హిందీ చిత్రం 'జవాన్' ఒకటి.


● రెజీనా

నేనేనా రెడీ

రెజీనా లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'నేనేనా' (తమిళంలో 'సూర్పణగై'). కార్తీక్ రాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అక్షరా గౌడ, అలీ ఖాన్, జై ప్రకాష్ కీలక పాత్రలు చేశారు. 'జాంబీ రెడ్డి' సినిమాతో హిట్ అందుకున్న ఆపిల్ ట్రీ స్టూడియోస్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెలాఖరులో విడుదలకి సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ సంగీతం అందించారు.

యాక్షన్.. థ్రిల్

జగన్మోహన్, శ్వేతా వర్మ, శివన్నారాయణ, రూపాలక్ష్మి, దయానంద్ రెడ్డి, దేవీ ప్రసాద్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ఎస్ 99'. టెంపుల్ మీడియా పతాకంపై యతీష్, నందిని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన దర్శకుడు కె. రాఘవేంద్ర రావు మాట్లాడుతూ– ''టీజర్ బాగుంది. తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ అవుతున్న ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''వచ్చే నెల మొదటివారంలో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు జగన్మోహన్.


● రాఘవేంద్ర రావు, జగన్మోహన్


● అజయ్, రసమయి బాలకిషన్, జగపతిబాబు

రుద్రంగి నా థర్డ్ ఇన్నింగ్స్ – జగపతిబాబు

''మూడేళ్లు సినిమాలు లేకుండా ఇంట్లో కూర్చున్నప్పుడు 'లెజెండ్' సినిమా అవకాశం వచ్చింది. అది నా సెకండ్ ఇన్నింగ్స్ అని అందరూ పేరు పెట్టారు. 'రుద్రంగి'కి నా థర్డ్ ఇన్నింగ్స్ అని పేరు పెట్టుకుంటున్నాను. ఇందులోని నా పాత్రలో దమ్ము ఉంటుంది'' అని నటుడు జగపతిబాబు అన్నారు. అజయ్ సామ్రాట్ దర్శకత్వంలో జగపతిబాబు, ఆశిష్ గాంధీ, మమతా మోహన్ దాస్, విమలా రామన్, గానవి లక్ష్మణ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రుద్రంగి'. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జగపతిబాబు మాట్లాడుతూ– ''చిన్న సినిమా.. పెద్ద సినిమా.. పెద్ద బడ్జెట్ అనే పాయింట్ ఇవాళ దాటిపోయింది. డబ్బులు పెడితే సూపర్ హిట్ అనేది కాదు. రీసెంట్‌గా విడుదలైన 'సామజ వరగమన' మంచి హిట్ అయింది. 'రుద్రంగి' కథ కూడా కొత్తగా ఉంటుంది'' అన్నారు. రసమయి బాలకిషన్ మాట్లాడుతూ– ''జగతిబాబుగారి ప్రోత్సాహమే మమ్మల్ని ముందుకు నడిపించింది. ప్రేమకు, వాంఛకు మధ్య జరిగిన వాస్తవ కథే 'రుద్రంగి'. నేను ఎమ్మెల్యే కాకముందు కూడా సినిమా తీశా.. ఇప్పుడు 'రుద్రంగి' తీశా. అంతేగానీ ఎమ్మెల్యే అని ఈ సినిమా తీయలేదు. మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు.

నాయకుడుతో...

ఉదయనిధి స్టాలిన్, వడివేలు, ఫాహద్ ఫాజిల్, కీర్తి సురేష్ లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ చిత్రం 'మామన్నన్'. 'పరియేరుమ్ పెరుమాళ్, కర్ణన్' లాంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన మారి సెల్వరాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రం తెలుగులో 'నాయకుడు'గా ఏషియన్ మల్టీప్లెక్స్– సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 14న రిలీజ్ కానుంది. ''పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.


● కీర్తీ సురేష్

కోలీవుడ్‌లో కొత్త సినిమా

'ఎఫ్ 3' (2022) తర్వాత మెహరీన్ తెలుగులో సినిమాలు కమిట్ కాలేదు. తాజాగా తమిళంలో ఓ కొత్త చిత్రంలో హీరోయిన్‌గా నటించడానికి అంగీకరించారు. శబరీష్ నంద దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో వసంత్ రవి హీరో. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు చెన్నైలో జరిగాయి. ఇందులో సునీల్ ఓ కీలక పాత్ర చేయనున్నారు. 'విశ్వాసం'లో హీరో అజిత్ కూతురి పాత్రలో కనిపించిన అనిఖా సురేంద్రన్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర చేయనుంది. ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది.


● మెహరీన్, అనిఖా సురేంద్రన్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	340	65,786
నిఫ్టీ ▲	99	19,497

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	13,664 ▽	128
డోజోన్స్	33,197 ▽	372
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,281 ▽	162
డాక్స్	15,529 ▽	409
షాంఘై	3,205 ▽	17
నికాయ్	32,773 ▽	566

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,644 ▲	13
బంగారం (99.5 స్వచ్ఛత)	58,409 ▲	13
వెండి (కేజీ)	70,815 ▲	1116

ఆడి క్యూ8 ఈ-ట్రాన్ వస్తోంది



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ కంపెనీ ఆడి భారత మార్కెట్లో క్యూ8 ఈ-ట్రాన్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని 2023 ఆగస్ట్‌లో ఆవిష్కరిస్తోంది. ఎస్‌యూవీ, స్పోర్ట్‌బ్యాక్ రకాల్లో విడుదల చేయనుంది. 114 కిలోవాట్ బ్యాటరీ పొందుపరిచారు. పూర్తిగా తయారైన కారును భారత్‌కు దిగుమతి చేసుకుంటారు. ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఇప్పటికే కంపెనీ దేశీయంగా ఈ-ట్రాన్ 50, ఈ-ట్రాన్ 55, ఈ-ట్రాన్ స్పోర్ట్‌బ్యాక్ 55, ఈ-ట్రాన్ జీటీ, ఆర్‌ఎస్ ఈ-ట్రాన్ జీటీ మోడళ్లను విక్రయిస్తోంది. అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న మోడళ్లను ఇక్కడి మార్కెట్‌కు తీసుకువస్తామని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. '2033 నాటికి పూర్తి ఎలక్ట్రిక్ కంపెనీగా మారాలన్నదే సంస్థ లక్ష్యం. మరిన్ని ఈవీలు ప్రవేశపెడతాం. భారత్‌లో ఈ కార్లు రూ.1.5 కోట్ల సగటు ధరకు అమ్ముడవుతున్నప్పటికీ లగ్జరీ సెగ్మెంట్‌లో ఆడి ఈవీలు ఆదరణ పొందుతున్నాయి' అని వివరించారు. అన్ని విభాగాల్లో కలిపి ఆడి ఇండియా 2023 జనవరి-జూన్‌లో 3,474 యూనిట్ల అమ్మకాలను సాధించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 97% ఎక్కువ.

టయోటా కార్ల ధర పెరిగింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ తాజాగా ధరలను సవరించింది. అన్ని మోడళ్ల ధర సుమారు 1% పెంచినట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. కొత్త ధరలు జూలై 5 నుంచి అమల్లోకి వచ్చాయని టయోటా వెల్లడించింది. ముడి సరుకు వ్యయాలు పెరిగినందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది.

తనిష్క్ నుంచి 'టేల్స్ ఆఫ్ మిస్టిక్' కలెక్షన్



హైదరాబాద్: టాటా గ్రూప్ జ్యువెలరీ రిటైల్ సంస్థ తనిష్క్ 'టేల్స్ ఆఫ్ మిస్టిక్' పేరుతో కొత్త కలెక్షన్ ఆవిష్కరించింది. రాజస్తాన్ రాజ భవనాలు, నగర నిర్మాణాల కళాత్మక సౌందర్యం నుంచి ప్రేరణ పొంది ఈ వజ్రాభరణాలను తీర్చిదిద్దినట్టు కంపెనీ తెలిపింది. ఈ కలెక్షన్ విడుదలతో ప్రముఖ భారత డిజైనర్ రాహుల్ మిశ్రా భాగస్వామ్యంతో పారిస్ హౌట్ కౌటూర్ వీక్, ఫాల్-వింటర్ 2023-24లో తాము అరంగేట్రం చేశామని వెల్లడించింది.

కార్డు నెట్‌వర్క్‌ను ఎంచుకునేందుకు కస్టమర్‌కు ఆప్షన్

ఆర్‌బీఐ ప్రతిపాదన



న్యూఢిల్లీ: బ్యాంకులు, బ్యాంక్‌యేతర సంస్థలు జారీ చేసే కార్డులకు సంబంధించి అధీకృత నెట్‌వర్క్‌లను ఎంచుకునే వెసులుబాటును కస్టమర్‌కు ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ ప్రతిపాదించింది. ప్రస్తుతం కార్డ్ నెట్‌వర్క్‌లు, కార్డ్‌లు జారీ చేసే సంస్థల (బ్యాంకులు, నాన్-బ్యాంకులు) మధ్య ఉన్న ఒప్పందాలు.. కస్టమర్లకు తగినన్ని ఆప్షన్లను అందుబాటులో ఉంచేలా లేవని సర్క్యులర్ ముసాయిదాలో అభిప్రాయపడింది. కార్డును జారీ చేసేటప్పుడు గానీ లేదా ఆ తర్వాత గానీ అర్హత కలిగిన కస్టమర్లు.. బహుళ కార్డు నెట్‌వర్క్‌ల నుంచి ఏదో ఒకదాన్ని ఎంచుకునేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంది. కార్డు ఇష్యూయర్లు ఒకటికి మించి నెట్‌వర్క్‌లతో కార్డులను జారీ చేయాలని తెలిపింది. సంబంధిత వర్గాలు ఆగస్టు 4 వరకు ఈ ముసాయిదా సర్క్యులర్‌పై ఆర్‌బీఐకి తమ అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వీసా, రూపే, మాస్టర్‌కార్డ్ మొదలైన కార్డ్ నెట్‌వర్క్‌లు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటితో భాగస్వామ్యం ద్వారా బ్యాంకులు, నాన్-బ్యాంకులు తమ డెబిట్, క్రెడిట్, ప్రీపెయిడ్ కార్డులు మొదలైన వాటిని జారీ చేస్తున్నాయి.

ఇక జియో ఫైనాన్షియల్ లిస్టింగ్!

రిలయన్స్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) నుంచి ఫైనాన్షియల్ సర్వీసుల యూనిట్ విడదీతకు జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిలయన్స్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్‌ను విడదీసేందుకు ఇప్పటికే ఆర్‌ఐఎల్ ప్రణాళికలు ప్రకటించింది. ఈ విభాగాన్ని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫ్‌ఎస్‌ఎల్) పేరుతో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. గత నెలాఖరున ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ ఇందుకు అనుమతించినట్లు ఆర్‌ఐఎల్ తాజాగా ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది.



పారదర్శకంగా ఎన్‌పీఏల గుర్తింపు

- రిస్క్ నిర్వహణ బలంగా ఉండాలి
- పీఎస్‌బీలను కోరిన ఆర్థిక మంత్రి
- బ్యాంకింగ్ పనితీరుపై సీఈఓలతో సమీక్ష

న్యూఢిల్లీ: వసూలు కాని రుణాన్ని నిరర్థక ఆస్తిగా (ఎన్‌పీఏలు) గుర్తించే విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వరంగ బ్యాంక్‌లను (పీఎస్‌బీలు) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. అలాగే, బలమైన రిస్క్ నిర్వహణ విధానాలను అనుసరించాలని సూచించారు. వృద్ధి, లాభదాయకత విషయంలో ఇక ముందూ మంచి పనితీరు చూపించాలని కోరారు. ఆర్థిక మంత్రి అన్ని పీఎస్‌బీల సీఈవోలతో ఢిల్లీలో గురువారం సమావేశమయ్యారు. పీఎం స్ట్రీట్ వెండర్స్ ఆత్మ నిర్భర్ నిధి, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, అటల్ పెన్షన్ యోజన, అత్యవసర రుణ వితరణ పథకం తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల పరిధిలో నిర్దేశించిన లక్ష్యాలను ప్రభుత్వరంగ బ్యాంక్‌లు ఏ మేరకు చేరాయన్నది మంత్రి పరిశీలించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. రుణ వితరణలో వృద్ధి, ఆస్తుల నాణ్యత, తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంక్‌ల నిధుల అవసరాలను సమీక్షించినట్టు తెలిపాయి. రుణాల పంపిణీ, లాభదాయకత, ఆస్తుల నాణ్యత, క్యాపిటల అడెక్వెసీ తదితర గణాంకాలన్నీ పీఎస్‌బీల పనితీరు ఎంతో మెరుగుపడినట్టు తెలియజేస్తుండడాన్ని మంత్రి పరిగణనలోకి తీసుకున్నట్టు పేర్కొన్నాయి.



త్వరలో గ్రామీణ బ్యాంక్‌ల వంతు..

ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌ల పనితీరును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి త్వరలోనే సమీక్షించనున్నారు. ఇందుకోసం గ్రామీణ బ్యాంక్‌ల అధినేతలతో ఆమె భేటీ కానున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లు అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రుణ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుండడం తెలిసిందే. సాగు రంగం, దాని అనుబంధ విభాగాలకు కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ)ల జారీని ఆర్థిక మంత్రి సమీక్షించనున్నట్టు ఆ వర్గాలు చెప్పాయి. వీలైనంత ఎక్కువ సంఖ్యలో రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణాలు అందేలా చూడాలన్నది కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ లక్ష్యంగా ఉంది. బలహీనంగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు నిధుల అవసరాలను కూడా మంత్రి పరిశీలించనున్నారు. టెక్నాలజీ పెంపు, ఎన్‌పీఏల తగ్గింపు విధానాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

మార్కెట్లో మళ్లీ కొత్త రికార్డులు

- ర్యాలీకి ఎఫ్‌ఐఐల కొనుగోళ్ల అండ
- ఇంట్రాడే, ముగింపులో కొత్త గరిష్టానికి
- 19,500 స్థాయికి చేరువలో నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 340 పాయింట్లు



ముంబై: ఒకరోజు విరామం తర్వాత స్టాక్ మార్కెట్లో మళ్లీ కొత్త రికార్డులు నమోదయ్యాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీనతలను విస్మరిస్తూ.., ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో గురువారం ఇంట్రాడే, ముగింపులోనూ సూచీలు సరికొత్త రికార్డులను లిఖించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందుకున్న మార్కెట్ ఉదయం నష్టంతో మొదలైంది. సెన్సెక్స్ 54 పాయింట్లు పతనమై 65,392 వద్ద, నిఫ్టీ 13 పాయింట్లు నష్టపోయి 19,386 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. యుటిలిటీ, రియల్టీ, ఇంధన, విద్యుత్, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఆటో, హెల్త్‌కేర్ షేర్లకు డిమాండ్ లభించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 387 పాయింట్లు లాభపడి 65,833 వద్ద, నిఫ్టీ 113 పాయింట్లు బలపడి 19,512 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 340 పాయింట్లు పెరిగి 65,786 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 99 పాయింట్లు లాభపడి 19,497 వద్ద ముగిసింది. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, వినిమయ షేర్లలో లాభాల స్వీకరణ కొనసాగింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 22 పైసలు క్షీణించి 82.47 స్థాయి వద్ద స్థిరపడింది. సూచీల రికార్డు ర్యాలీ తిరిగి మొదలవడంతో గురువారం ఒక్కరోజే రూ.1.80 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్‌ఈ కంపెనీల మొత్తం విలువ రికార్డు స్థాయి రూ.301.70 లక్షల కోట్లకు చేరింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- టైర్ల కంపెనీ సియట్ షేరు 19% పెరిగి రూ.2498 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 20% ర్యాలీ చేసి రూ.2,511 వద్ద జీవితకాల గరిష్టాన్ని అందుకుంది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ క్యాప్ తొలిసారి రూ.10,000 కోట్లకు చేరింది.
- బైబ్యాక్ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలపడంతో బీఎస్‌ఈ షేరు నాలుగు శాతం లాభపడి రూ.706 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.711 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- టాటా ఏఎంసీ వాటాను పెంచుకునేందుకు ఆర్‌బీఐ ఆమోదం తెలపడంతో డీసీబీ బ్యాంకు ఆరుశాతం పెరిగి రూ.129 వద్ద స్థిరపడింది.

సెన్‌కో గోల్డ్ ఐపీవో సక్సెస్

73 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్

జ్యువెలరీ రిటైల్ రంగ కంపెనీ సెన్‌కో గోల్డ్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇష్యూ చివరి రోజు గురువారాని(6)కల్లా 73 రెట్లు అధికంగా సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. కంపెనీ 94.18 లక్షల షేర్లు విక్రయానికి ఉంచగా.. 69.08 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. షేరుకి రూ. 301-317 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 405 కోట్లు సమీకరించింది. ప్రధానంగా అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 181 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రిటైలర్ల నుంచి 15.5 రెట్లు అధికంగా దరఖాస్తులు వచ్చాయి.

అదానీ గ్రీన్ నిధుల సమీకరణకు సై

షేర్ల విక్రయంతో రూ. 12,300 కోట్లు



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ నిధుల సమీకరణ ప్రణాళికలు ప్రకటించింది. షేర్ల విక్రయం ద్వారా రూ. 12,300 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీ తాజాగా వెల్లడించింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల విక్రయం(క్విప్) మార్గంలో నిధులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. కంపెనీ విస్తరణ ప్రణాళికలకు అవసరమయ్యే పెట్టుబడుల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలియజేసింది. కాగా.. ఇటీవల గ్రూప్‌లోని మరో రెండు కంపెనీలు సైతం నిధుల సమీకరణ ప్రణాళికలు ప్రకటించిన సంగతి తెలిసిందే. క్విప్ ద్వారా అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ. 12,500 కోట్లు, అదానీ ట్రాన్స్‌మిషన్ రూ. 8,500 కోట్లు చొప్పున సమకూర్చుకోనున్నట్లు ఇప్పటికే తెలియజేశాయి. ప్రధానంగా యూరప్, మధ్యప్రాచ్యం నుంచి ఇన్వెస్టర్లు అదానీ గ్రూప్ షేర్ల కొనుగోలుకి ఆసక్తి చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల నివేదిక వెలువడిన తదుపరి అదానీ గ్రూప్ కంపెనీలు పెట్టుబడుల సమీకరణ, కొత్త ప్రాజెక్టులతో విస్తరణకు తెరతీశాయి. హిండెన్‌బర్గ్ ఆరోపణలను తోసిపుచ్చిన గ్రూప్ ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని మరింత పెంచేందుకు వీలుగా ముందస్తు రుణ చెల్లింపులకు ప్రాధాన్యమిస్తున్న విషయం విదితమే.



డి లీడె

'ఆరెంజ్' ఓ రేంజ్‌లో...



వన్డే వరల్డ్ కప్‌కు అర్హత సాధించేందుకు నెదర్లాండ్స్ తమ చివరి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై తప్పనిసరిగా గెలవాలి. లక్ష్యం 278 పరుగులు... అదీ 44 ఓవర్లలో సాధిస్తేనే బెర్త్ దక్కుతుంది. అంతకంటే ఒక్క బంతి ఎక్కువ తీసుకొని మ్యాచ్ గెలిచినా లాభం లేదు. స్కాట్లాండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తక్కువ వ్యవధిలో ఒక్కో వికెట్ కోల్పోతూ వచ్చిన జట్టు ఒక దశలో 163/5 వద్ద నిలిచింది. 79 బంతుల్లోనే మరో 115 పరుగులు కావాలి. ఇలాంటి స్థితిలో బాస్ డి లీడె ఒక్కసారిగా చెలరేగిపోయాడు. తర్వాతి 40 బంతుల్లోనే 76 పరుగులు సాధించి జట్టుకు సంచలన విజయం అందించాడు. డి లీడె శతకానికి తోడు జుల్ఫికర్ అండగా నిలవడంతో నెదర్లాండ్స్ మరో 7 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరి ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లలో భారత్‌లో జరిగే వరల్డ్ కప్‌కు అర్హత సాధించింది. 'సూపర్ సిక్స్' దశలో జింబాబ్వేను ఓడించి ఆ జట్టును వరల్డ్ కప్‌కు దూరం చేసి తమ అవకాశాలు మెరుగుపర్చుకున్న స్కాట్లాండ్ అనూహ్య ఓటమితో నిష్క్రమించింది. వరల్డ్ కప్‌కు నెదర్లాండ్స్ అర్హత సాధించడం ఇది ఐదోసారి. 2011 తర్వాత మళ్లీ భారత్‌లోనే ఆ జట్టు బరిలోకి దిగుతోంది.

వన్డే వరల్డ్ కప్‌కు నెదర్లాండ్స్ అర్హత


- చివరి పోరులో 4 వికెట్లతో స్కాట్లాండ్‌పై విజయం
- సెంచరీతో గెలిపించిన డి లీడె

బులవాయో: వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే భారత్‌కు వచ్చే రెండు జట్లేవో తేలిపోయింది. మాజీ చాంపియన్ శ్రీలంక ఇంతకుముందే అర్హత సాధించగా, ఇప్పుడు నెదర్లాండ్స్ తమ చోటును ఖాయం చేసుకుంది. గురువారం తప్పనిసరిగా నెగ్గాల్సిన 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 4 వికెట్లతో స్కాట్లాండ్‌పై నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. బ్రెండన్ మెక్‌ములన్ (106; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (64; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. బాస్ డి లీడె (5/52) ఐదు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. అనంతరం వరల్డ్‌కప్‌కు క్వాలిఫై కావాలంటే 44 ఓవర్లలోనే లక్ష్యం సాధించాల్సిన స్థితిలో నెదర్లాండ్స్ బరిలోకి దిగింది. ఆ జట్టు 42.5 ఓవర్లలో 6 వికెట్లకు 278 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బాస్ డి లీడె (92 బంతుల్లో 123; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) శతకంతో చెలరేగగా... విక్రమ్‌జిత్ సింగ్ (40), సాఖిబ్ జుల్ఫికర్ (33 నాటౌట్) రాణించారు. 36 ఓవర్లు ముగిసేవరకు కూడా మ్యాచ్ స్కాట్లాండ్ నియంత్రణలోనే ఉంది. 8 ఓవర్లలో నెదర్లాండ్స్ 85 పరుగులు చేయాల్సి ఉంది. తర్వాతి 4 ఓవర్లలో 40 పరుగులు వచ్చాయి. దాంతో సమీకరణం 4 ఓవర్లలో 45కు మారింది. ఈ సమయంలో డి లీడె ఒక్క సారిగా టి20 తరహా ఆటను చూపించాడు. వాట్ వేసిన ఓవర్లో 2 సిక్స్‌లు, మెక్‌ములెన్ వేసిన తర్వాతి ఓవర్లో 2 సిక్స్‌లు బాదడంతో మొత్తం 42 పరుగులు వచ్చేశాయి. 84 బంతుల్లో అతని సెంచరీ పూర్తయింది. డి లీడె రనౌటైనా, వాన్ బీక్ సింగిల్ తీయడంతో డచ్ శిబిరంలో సంబరాలు షురూ అయ్యాయి.

సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం 2003 వన్డే వరల్డ్ కప్... పార్ల్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 68 పరుగుల తేడాతో ఓడింది. అయితే సచిన్ టెండూల్కర్ సహా 4 వికెట్లు తీసిన టిమ్ డి లీడె 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అతని కొడుకే ఈ బాస్ డి లీడె. టోర్నీ ఆసాంతం నిలకడైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అతను జట్టును ముందుకు నడపడంలో కీలకపాత్ర పోషించాడు. 285 పరుగులు చేయడంతో పాటు డి లీడె 15 వికెట్లు పడగొట్టడం విశేషం. కౌంటీల్లో ఒప్పందాల కారణంగా పలువురు ప్రధాన ఆటగాళ్లు ఈ టోర్నీ నుంచి తప్పుకున్నా... డి లీడె మాత్రం రెండిటిలో వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌నే ఎంచుకున్నాడు. సీనియర్లు లేకపోయినా స్ఫూర్తిదాయక ఆటతో డచ్ బృందం సత్తా చాటింది. గ్రూప్ దశలో జింబాబ్వే చేతిలో ఓడినా అమెరికా, నేపాల్‌పై సునాయాస విజయాలు సాధించింది. విండీస్‌తో మ్యాచ్ ఆ జట్టు స్థాయిని చూపించింది.

సమష్టి ప్రదర్శనతో...

374 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదిస్తూ తడబడకుండా స్కోరు సమం చేయగలిగింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తేజ నిడమనూరు అద్భుత సెంచరీతో చెలరేగగా, కీలకమైన సూపర్ ఓవర్‌లో వాన్ బీక్ 30 పరుగులు కొట్టి జట్టును గెలిపించాడు. 'సూపర్ సిక్స్' దశలో ఒమన్‌పై భారీ విజయం జట్టుకు మేలు చేయగా, ఇప్పుడు స్కాట్లాండ్‌పై గెలుపు ఆ జట్టును ప్రధాన టోర్నీకి చేర్చింది. 4 అర్ధ సెంచరీలు చేసిన స్కాట్ ఎడ్వర్డ్స్, మరో సెంచరీ చేసిన విక్రమ్‌జిత్ సింగ్‌తో పాటు బౌలింగ్‌లో వాన్ బీక్, ర్యాన్ క్లీన్ కీలక పాత్ర పోషించారు.



తేజ

'భారత గడ్డపై అంతర్జాతీయ మ్యాచ్ ఆడాలనేది నా కల' అని తేజ కొన్నాళ్ల క్రితం 'సాక్షి'తో ఇంటర్వ్యూలో చెప్పాడు. ఇప్పుడు అతను భారత్‌పైనే వరల్డ్ కప్ మ్యాచ్ ఆడబోతుండటం విశేషం. నవంబర్ 11న బెంగళూరులో భారత్‌తో తలపడే నెదర్లాండ్స్... అక్టోబర్ 6న తమ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో హైదరాబాద్‌లో ఆడుతుంది.

4 వన్డేల్లో సెంచరీ సాధించడంతో పాటు ఐదు వికెట్లు తీసిన నాలుగో ఆటగాడు డి లీడె. గతంలో వివియన్ రిచర్డ్స్ (విండీస్), కాలింగ్‌వుడ్ (ఇంగ్లండ్), రోహన్ ముస్తఫా (యూఏఈ) మాత్రమే ఈ ఘనత సాధించారు.

ప్రిక్వార్టర్స్‌లో సింధు



కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ పీవీ సింధు శుభారంభం చేసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాలుగో సీడ్ సింధు 21-16, 21-9తో తాలియా ఎన్‌జీ (కెనడా)పై విజయం సాధించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ అమ్మాయి గద్దె రుత్విక శివాని 12-21, 3-21తో సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. లక్ష్య సేన్ 21-18, 21-15తో రెండో సీడ్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)ను బోల్తా కొట్టించగా... సాయిప్రణీత్ 12-21, 17-21తో వైగోర్ కొల్హో (బ్రెజిల్) చేతిలో ఓడిపోయాడు.

మనిక ముందంజ



లుబ్లియానా (స్లొవేనియా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ లుబ్లియానా టోర్నీలో భారత నంబర్ వన్ మనిక బత్రా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. రెండో రౌండ్ మ్యాచ్‌లో మనిక 11-4, 11-9, 11-7తో ప్రపంచ 15వ ర్యాంకర్ చెంగ్ ఐ చింగ్ (చైనీస్ తైపీ)పై సంచలన విజయం సాధించింది. తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయింది. క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో శ్రీజ 9-11, 8-11, 11-9, 9-11తో భారత సంతతికి చెందిన ఫ్రాన్స్ క్రీడాకారిణి ప్రీతిక చేతిలో ఓడిపోయింది.

ఆదుకున్న మయాంక్, తిలక్

బెంగళూరు: కష్టాల్లో ఎదురీదుతున్న సౌత్‌జోన్ జట్టును హైదరాబాద్ రైజింగ్ స్టార్ ఠాకూర్ తిలక్ వర్మ (46; 5 ఫోర్లు, 1 సిక్స్), సీనియర్ ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (76; 10 ఫోర్లు)తో కలిసి గట్టెక్కించాడు. దీంతో దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకు ఆలౌటైంది. నార్త్‌జోన్ 3 పరుగుల ఆధిక్యంతోనే సరిపెట్టుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 63/4తో రెండో రోజు ఆట కొనసాగించిన సౌత్‌జోన్‌ను మయాంక్, తిలక్ నడిపించారు. ఐదో వికెట్‌కు ఇద్దరు 110 పరుగులు జోడించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్‌జోన్ ఆట నిలిచే సమయానికి 11 ఓవర్లలో 2 వికెట్లకు 51 పరుగులు చేసింది.



మయాంక్

నాలుగో సీడ్ రూడ్‌కు చుక్కెదురు



రూడ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగం రెండో రౌండ్‌లో సంచలనం చోటు చేసుకుంది. బ్రిటన్ ప్లేయర్, ప్రపంచ 142వ ర్యాంకర్ లియామ్ బ్రాడీ 3 గంటల 27 నిమిషాల పోరులో 6-4, 3-6, 4-6, 6-3, 6-0తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే)ను బోల్తా కొట్టించాడు. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్‌లలో, ఈ సంవత్సరం ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన రూడ్ వింబుల్డన్ టోర్నీలో నాలుగో ప్రయత్నంలోనూ రెండో రౌండ్‌ను దాటలేకపోవడం గమనార్హం. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6-7 (4/7), 6-3, 6-4, 7-5తో కరాత్సెవ్ (రష్యా)పై, వావ్రింకా (స్విట్జర్లాండ్) 6-3, 4-6, 6-4, 6-2తో ఎచెవెరి (అర్జెంటీనా)పై గెలిచారు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఐదో సీడ్ గార్సియా (ఫ్రాన్స్) 3-6, 6-4, 7-6 (10/6)తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా) పై నెగ్గింది. తొలి రౌండ్ మ్యాచ్‌లో ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ ముకోవా (చెక్ రిపబ్లిక్) 4-6, 7-5, 1-6తో జూలీ నిమియెర్ (జర్మనీ) చేతిలో ఓడింది.

క్రికెట్‌కు తమీమ్ గుడ్‌బై



చిట్టోగ్రామ్: వన్డే ప్రపంచకప్‌కు మూడు నెలల ముందు బంగ్లాదేశ్ జట్టు సీనియర్ ప్లేయర్, కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ సంచలన ప్రకటన చేశాడు. తాను అంతర్జాతీయ క్రికెట్ నుంచి వెంటనే తప్పుకుంటున్నట్లు భావోద్వేగంతో ప్రకటించాడు. బుధవారం అఫ్గానిస్తాన్‌తో జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ ఓడగా ...తర్వాతి రోజే ఈ ప్రకటన వచ్చింది. 16 ఏళ్ల కెరీర్ లో 34 ఏళ్ల తమీమ్ ఇక్బాల్... 241 వన్డేల్లో 14 సెంచరీలు, 56 అర్ధ సెంచరీలతో 8313 పరుగులు... 70 టెస్టుల్లో 10 సెంచరీలతో 5134 పరుగులు... 78 టి20 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, ఏడు అర్ధ సెంచరీలతో కలిపి 1758 పరుగులు సాధించాడు.

తొలి రోజే హోరాహోరీ

- ఆస్ట్రేలియా 263, ఇంగ్లండ్ 68/3
- మార్ష్ సెంచరీ, వుడ్‌కు 5 వికెట్లు

లీడ్స్: 'యాషెస్' సిరీస్ మూడో టెస్టు అనేక మలుపులతో ఆసక్తికరంగా మొదలైంది. మొదటి రోజే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా హోరాహోరీగా పోటీ పడ్డాయి. ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో 60.4 ఓవర్లలో 263 పరుగులకే ఆలౌటైంది. మార్క్ వుడ్ (5/34) ప్రత్యర్థిని పడగొట్టాడు. వార్నర్ (4), ఖ్వాజా (13), లబుషేన్ (21), స్మిత్ (22) విఫలం కావడంతో ఒక దశలో ఆసీస్ 85/4 వద్ద నిలిచింది. అయితే ఆరో స్థానంలో బరిలోకి దిగిన మిచెల్ మార్ష్ (118 బంతుల్లో 118; 17 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒక్కసారిగా పరిస్థితిని మార్చేశాడు. నాలుగేళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడిన అతను మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగాడు. మార్ష్, హెడ్ (39) ఐదో వికెట్‌కు 28 ఓవర్లలోనే 155 పరుగులు జోడించారు. అయితే ఆ తర్వాత ఇంగ్లండ్ బౌలర్లు మళ్లీ పైచేయి సాధించారు. ఫలితంగా 23 పరుగులకే ఆసీస్ చివరి 6 వికెట్లు కోల్పోయింది. అనంతరం ఇంగ్లండ్ బ్యాటింగ్ కూడా తడబడింది. గురువారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 68 పరు గులు చేసింది. ఇంగ్లండ్ మరో 195 పరుగులు వెనుకబడి ఉంది.



మార్ష్



'కాచిగూడ'లో ఈ సెగ్‌వే పెట్రోలింగ్

ప్రారంభించిన హైదరాబాద్ డీఆర్ఎం శరత్ చంద్రయాన్

రైల్వే ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు హైదరాబాద్ డివిజినల్ రైల్వే మేనేజర్ శరత్ చంద్రయాన్ తెలిపారు. కాచిగూడ ఆర్‌పీఎఫ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం రైల్వే స్టేషన్‌లో ఈ సెగ్‌వే పెట్రోలింగ్ వాహనాలను డీఆర్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పెట్రోలింగ్ వాహనాలు ప్రయాణికులకు అత్యవసర సేవలు వేగంగా అందిస్తూ ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ వాహనాలు రైల్వే స్టేషన్‌లో ఎప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం స్టేషన్‌లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహార పదార్థాలను ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ డీఐజీ సాధక్ జబ్‌ఖాన్, డీఎస్‌సీ శంకర్ కుట్టి, రైల్వే స్టేషన్ డైరెక్టర్ బాలాజీ, అధికారులు మహేందర్ చౌదరి, ఇక్బాల్, శ్రీనివాస్‌రావు, శైలేందర్ కుమార్, జగన్‌మోహన్ రెడ్డి, మీనా, కాచిగూడ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు పాల్గొన్నారు.

– కాచిగూడ



అరక పట్టిన అమాత్యుడు

నిర్మల్ జిల్లాలో గిరిజనులకు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సారంగాపూర్ మండలం రవీంద్రనగర్ తండాకు వెళ్లి పోడు భూమిలో ఇలా అరక పట్టి దుక్కి దున్నారు. పోడు భూముల్లో రతనాలు పండించి ఆదర్శంగా నిలవాలని ఆదివాసీ రైతులకు సూచించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్



ఆర్టీసీ బస్సెక్కిన మంత్రి

విద్యార్థులతో ముచ్చటించిన మంత్రి సబిత

విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి గురువారం సాయంత్రం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని తిరుగు పయనంలో మన్సాన్‌పల్లి చౌరస్తా వద్ద తన కాన్వాయ్‌ను ఆపారు. నాగారం వైపు వెళ్తున్న బస్సు ఎక్కి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులతో ముచ్చటించారు. ఏ పాఠశాలలో చదువుతున్నారు? బస్సులు సమయానికి వస్తున్నాయా? ప్రభుత్వ పాఠశాలలో బోధన, వసతులు బాగున్నాయా?.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారితో ఆమె ఫొటోలు దిగారు. కాసేపు బస్సులో ప్రయాణించిన తర్వాత మంత్రి .. తిరిగి తన కారులో హైదరాబాద్ బయలుదేరారు.

– మహేశ్వరం



సీఎం నాటిన మొక్కకు హ్యాపీ బర్త్‌డే

నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి... తన ఇంటి వద్ద ఎనిమిదేళ్ల క్రితం సీఎం కేసీఆర్ మొదటి విడత హరితహారంలో నాటిన మొక్కకు గురువారం పుట్టినరోజు వేడుక నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచం మొత్తం అడవుల శాతం తగ్గిపోతుంటే, తెలంగాణలో మాత్రం సీఎం కేసీఆర్ చొరవ వల్ల 7.7 శాతం అడవులు పెరిగాయన్నారు.

– వేల్పూర్



అల'గెల'గా

సాధారణంగా ఒక అరటి చెట్టుకు ఒక గెల మాత్రమే కాస్తుంది. ఇందుకు భిన్నంగా ఒకే చెట్టుకు రెండు అరటి గెలలు కాశాయి. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం భీమవరం పంచాయతీ మద్దిపుట్టులో ఓ గిరిజనుడి ఇంటి వద్ద ఈ అద్భుతాన్ని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– హుకుంపేట

వరదలా విదేశీ డబ్బు

గతేడాది రూ.8 లక్షల కోట్లు పంపిన వైనం

ఆర్థిక వ్యవస్థకు దన్నుగా డాలర్లు

పేదరికం తగ్గేందుకు, ప్రజల ఆరోగ్యం మెరుగయ్యేందుకు దోహదం

ప్రపంచంలోనే మొదటి స్థానంలో ప్రవాస భారతీయులు

(కంచర్ల యాదగిరిరెడ్డి)

వంద బిలియన్ డాలర్లు...
మన రూపాయల్లో సుమారు 8 లక్షల కోట్లు!
గతేడాది విదేశాల్లోని భారతీయులు
స్వదేశానికి పంపిన మొత్తమిది!
ఇలాంటి చెల్లింపుల్లో ప్రవాస భారతీయులు
ప్రపంచంలోనే టాప్!
అయితే ఏంటి? చాలా ఉంది!
ఈ మొత్తం అనేక మందికి అన్నం పెడుతోంది! పేదరికం తగ్గేందుకు, ప్రజల ఆరోగ్యం మెరుగయ్యేందుకు, నవజాత శిశువులు పుష్టిగా ఉండేందుకూ కారణమవుతోంది..ఎలా?

ప్రపంచ బ్యాంకు తాజా లెక్కల ప్రకారం 2022–23లో ప్రపంచం మొత్తమ్మీద అభివృద్ధి చెందిన దేశాల నుంచి అభివృద్ధి చెందుతున్న లేదా పేద దేశాలకు పంపిన మొత్తం 80,000 కోట్ల డాలర్లు. ఈ విషయంలో అన్ని దేశాల కంటే తొలి స్థానంలో ఉన్న భారత్‌కు విదేశాల్లోని భారతీయులు వంద బిలియన్ డాలర్లు పంపితే, అరవై బిలియన్ డాలర్లతో మెక్సికో రెండో స్థానంలో ఉంది. విదేశాల్లో ఉన్న మన బంధువులు లేదా మిత్రులు ఇంటికి పంపే డబ్బుల్ని ఇక్కడ రకరకాలుగా పెట్టుబడి పెడుతుంటారు. దీని వల్ల ఆర్థిక వ్యవస్థ చక్రాలు కదులుతూ ఉంటాయి. పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయమూ లభిస్తుంటుంది. పైగా మధ్యవర్తి లేకుండా నేరుగా డాలర్లు భారత్‌కు వస్తుంటాయి. ఈ డాలర్లను ప్రభుత్వం ముడిచమురు, తదితర కొనుగోళ్లకు ఉపయోగించుకోవచ్చు.



వ్యయం తడిసిమోపెడు!

అంతాబాగానే ఉంది కానీ.. ఇటీవలి కాలంలో చెల్లింపుల కోసం అయ్యే వ్యయం తడిసిమోపెడు అవుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. భారత్ అధ్యక్షతన ప్రస్తుతం జరుగుతున్న జీ20 సమావేశాల్లోనూ ఈ అంశంపై విస్తృత చర్చ జరగడం గమనార్హం. డాలర్ మారకం విలువల్లోని తేడాలు, పంపేందుకు, అందుకునేందుకు చెల్లించాల్సిన కమీషన్లు ఎక్కువగా ఉండటం వల్ల చెల్లింపుల వల్ల కలిగే ప్రయోజనాలు పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నాం. ప్రస్తుతం ఈ కమీషన్లు, మారక విలువల్లోని తేడాలనీ కలిపి ప్రతి చెల్లింపునకూ 6.24 శాతం మొత్తాన్ని కోల్పోవాల్సి వస్తోంది. అయితే మూడేళ్ల క్రితం ఇది ఏడు శాతంగా ఉంది. సమీప భవిష్యత్తులో దీనిని మూడు శాతానికి తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. డబ్బులు మార్పిడి చేసే కంపెనీలు మరిన్ని అందుబాటులో ఉండేలా చేసి వాటి మధ్య పోటీ పెంచాలన్నది ఈ దిశలో జరుగుతున్న ప్రయత్నాల్లో ఒకటి. ఆయా దేశాలు ఈ చెల్లింపులపై విధిస్తున్న పన్నులను తగ్గించేందుకు, వీలైతే పూర్తిగా మాఫీ చేసేలా కూడా ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యయం తగ్గించుకునేందుకు వలస కార్మికులు లేదా ఉద్యోగులు మధ్యవర్తులను ఆశ్రయించడం వల్ల కొన్నిసార్లు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుని ఈ వ్యయాన్ని వీలైనంతగా తగ్గిస్తే వినియోగదారులకు లాభం చేకూరడమే కాకుండా.. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది.

ఎగువన ఉన్న వారికీ...

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారినే కాకుండా ఎగువన ఉన్న వారికీ ఈ చెల్లింపులు ఉపయోగపడతాయి. ఆర్థిక వ్యవస్థల్లో ఒడిదుడుకులు ఎదురైనప్పుడు, లేదా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు దారిద్ర్యరేఖకు కొంచెం ఎగువన ఉన్న వారు కూడా కిందకు పడిపోతారు. ఈ పరిస్థితుల్లో విదేశాల్లోని బంధుమిత్రులు పంపే అదనపు మొత్తాలు బాధితులు పుంజుకునేందుకు ఉపయోగపడతాయన్నది కొత్తగా చెప్పాల్సిన అవసరమే లేదు. 2018 ఆగస్టు నాటి భారీ వరదల సమయంలో భారత్‌కు చెల్లింపులు దాదాపు 14 శాతం వరకూ పెరిగాయి. అంతెందుకు 2008లో ప్రపంచం మొత్తం ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయినా, విదేశీ పెట్టుబడులు తగ్గిపోయినా ఈ రకమైన చెల్లింపులు పెరగడం గమనార్హం. అంటే ప్రభుత్వాలకు నమ్మకంగా వచ్చిపడే విదేశీ మారక ద్రవ్యం ఇది.

80 శాతం పేద, మధ్యాదాయ దేశాలే..

గత ఏడాది చెల్లింపుల్లో దాదాపు 80 శాతం పేద, మధ్యాదాయ దేశాలే అందుకున్నాయి. కొన్ని దేశాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కంటే ఎక్కువగా ఈ చెల్లింపులు ఉండటం గమనార్హం. కాగా ఈ డబ్బులు పేదరిక నిర్మూలనకు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై మూడేళ్ల క్రితం మారియా ఫాషోలిన్సే అనే శాస్త్రవేత్త ఒక అధ్యయనం నిర్వహించారు. కార్మికులను ఇతర దేశాలకు పంపే 25 ఆసియా దేశాలను ఎంచుకుని ఈ అధ్యయనం చేశారు. వలసలు, చెల్లింపులపై ప్రపంచబ్యాంకు వద్ద ఉన్న సమాచారం ఆధారంగా ఆయా దేశాల్లోని పేదల సంఖ్య, వారిలో ఉండే అంతరం (కటిక పేదలు.. ఓ మోస్తరు పేదలు) వంటి వివరాలు సేకరించారు. వీటిద్వారా ఆయా దేశాల్లో పేదరికం ఎంతమేరకు ఉందన్నది నిర్ధారించుకున్నారు. రోజుకు రెండు డాలర్లు లేదా అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న వారిని ప్రపంచబ్యాంకు పేదల కింద లెక్కవేస్తుంది. ఈ వివరాలను పొందుపరిచి గణితశాస్త్ర సూత్రాల ప్రకారం లెక్క వేస్తే విదేశాల నుంచి వీరికి అందే చెల్లింపుల ప్రభావం ఎక్కువగానే ఉన్నట్లు స్పష్టమైంది. ఒక్కొక్కరికి అందే డబ్బులు పది శాతం పెరిగినా ఆ దేశంలో పేదరికంలో ఉన్న వారి శాతం (వంద మందిలో పేదల సంఖ్య) 0.4 శాతం తగ్గుతుందని తేలింది. చెల్లింపుల డబ్బులతో పేదలు మంచి ఆహారం తీసుకోవడం మాత్రమే కాకుండా.. పిల్లలను చదివించుకునేందుకూ వీలేర్పడుతోంది. ఆపత్కాలాన్ని కూడా తట్టుకుని వీరు బతకగలుగుతున్నారు.

చెల్లింపులు అందుకుంటున్న టాప్ - 10 దేశాలు (బిలియన్ డాలర్లలో)

1	100	భారత్
2	61	మెక్సికో
3	51	చైనా
4	38	ఫిలిప్పీన్స్
5	32	ఈజిప్టు
6	29	పాకిస్తాన్
7	28	ఫ్రాన్స్
8	21	బంగ్లాదేశ్
9	20	నైజీరియా
10	19	వియత్నాం

20 ఏళ్లలో రెండు రెట్లు పెరిగిన చెల్లింపులు

2019 నాటి లెక్కల ప్రకారం ఈ విధంగా చెల్లింపులు చేసే వారి సంఖ్య 27 కోట్లు!

- మొత్తం చెల్లింపులను ఒక దేశ ఆర్థిక వ్యవస్థ అని అనుకుంటే అది ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల్లో టాప్–20లో ఉంటుంది. స్విట్జర్లాండ్ అంత అన్నమాట!
- నేపాల్, కిర్గిస్తాన్ వంటి దేశాల స్థూల జాతీయోత్పత్తిలో ఈ చెల్లింపులు దాదాపు మూడో వంతు!
- గడచిన ఇరవై ఏళ్లలో చెల్లింపుల మొత్తం రెండు రెట్లు ఎక్కువైంది.

విదేశాలకూ పెరుగుతున్న చెల్లింపులు

దశాబ్దాలుగా విదేశాల నుంచి భారత్‌కు "చెల్లింపులు" పెరుగుతూనే ఉన్నాయి. అయితే ఇటీవలి కాలంలో విదేశాలకు వెళుతున్న మొత్తం కూడా రికార్డు స్థాయిలో పెరుగుతోంది. తాజా లెక్కల ప్రకారం గత ఏడాది ఈ మొత్తం 2,710 కోట్ల డాలర్లకు చేరుకుంది. లిబరైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద భారతీయులు తమ వ్యక్తిగత అవసరాల కోసం (పర్యాటకం, విద్య, అనుమతులు అవసరం లేని పెట్టుబడులు) ఏటా దాదాపు రూ.2 కోట్లు ఖర్చు పెట్టుకునే అవకాశం ఉంది. 2004లో ఇది రూ.24 లక్షలు మాత్రమే. 2015లో ఈ పరిమితిని పెంచారు. దీంతో 2004లో విదేశాలకు వెళ్లే మొత్తం 460 బిలియన్ డాలర్లు కాగా 2022 నాటికి 2,710 కోట్ల డాలర్లకు చేరింది.

కరీంనగర్ జిల్లాలో 68.6% సిజేరియన్లు

- జూన్‌లో ఈ జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో అత్యధికం
- కుమురంభీం జిల్లాలో అత్యంత తక్కువగా 22 శాతం సిజేరియన్లు
- తల్లుల ఆరోగ్య పరిరక్షణలో గద్వాల ఫస్ట్.. సూర్యాపేట లాస్ట్

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్లు పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జూన్‌లో జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో 68.6 శాతం ప్రసవాలు సిజేరియన్ ఆపరేషన్ల ద్వారానే జరిగాయని వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ జిల్లాలో మే నెలలో 64.1 శాతం సిజేరియన్లు జరగ్గా, నెలలోనే ఇంకా పెరగడం గమనార్హం. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్లు, ప్రసవాలు, తల్లుల ఆరోగ్యం విషయంలో చేపట్టిన చర్యలపై గురువారం వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాల్లో మే నెలలో 46 శాతం సిజేరియన్లు జరగ్గా, జూన్ నెలలో 45.4 శాతం జరిగినట్లు ఆరోగ్య శాఖ నివేదిక వెల్లడించింది. జూన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 67.6 శాతం, పెద్దపల్లి జిల్లాలో 65.7 శాతం, జగిత్యాల జిల్లాలో 64.1 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 63.8 శాతం, నిర్మల్ జిల్లాలో 62.2 శాతం సిజేరియన్లు జరిగాయి. కాగా, 14 జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 50 శాతం పైగా ప్రసవాలు సిజేరియన్ల ద్వారానే జరిగాయి. కాగా, అత్యంత తక్కువగా జూన్ నెలలో కుమురంభీం జిల్లాలో 22 శాతం మాత్రమే సిజేరియన్లు జరిగాయి. మే నెలలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 26,414 ప్రసవాలు జరగ్గా, అందులో 12,159 ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరిగాయని ఆరోగ్య శాఖ నివేదిక వివరించింది. కాగా, జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 23,784 ప్రసవాలు జరగ్గా, అందులో 10,795 ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరిగాయి. మొత్తంగా చూస్తే మే నెల కంటే జూన్‌లో 21 జిల్లాల ప్రభుత్వ ఆస్పత్రులు సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించడంలో శ్రద్ధ తీసుకున్నాయి. ఇక తల్లుల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో జోగుళాంబ గద్వాల జిల్లా అగ్రస్థానాన్ని సాధించింది. ఇదే విషయంలో వికారాబాద్ రెండు, కుమురంభీం ఆసిఫాబాద్ మూడు, మెదక్ నాలుగు, సంగారెడ్డి జిల్లా ఐదో ర్యాంకు సాధించాయి. సూర్యాపేట జిల్లా లాస్ట్ ర్యాంకు అంటే 33వ ర్యాంకు సాధించింది. నిర్మల్ 32, మహబూబాబాద్ 31, మంచిర్యాల 30, వనపర్తి 29 ర్యాంకులు సాధించాయి. హైదరాబాద్ 11వ ర్యాంకు సాధించింది. కాగా, ప్రగతి కనబర్చడంలో విఫలమైన జిల్లాల అధికారులపై చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించినట్లు తెలిసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.